Dwaraka

fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 22 | విజయవాడ, మంగళవారం 23 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలకు సిద్ధమైన దావోస్



దిగజారాం!

అసమానతలు అధికం.. అభివృద్ధి అధమం

- గతేడాది భారత సంపదలో 73 శాతం సంపన్నులకే
- 63 కోట్ల మంది పేదలకు దక్కింది ఒక్క శాతమే
- పొరుగుదేశాల కంటే దైన్యస్థితిలో భారత్
- ప్రపంచ ఆర్థిక వేదిక, ఆక్స్‌ఫామ్ సర్వేల్లో వెల్లడి

దావోస్ : ఆర్థిక అసమానతలు, అభివృద్ధి అంశాల్లో పొరుగు దేశాల కంటే భారత్ దైన్యస్థితిలో ఉందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్), ఆక్స్‌ఫామ్ సంస్థలు వేర్వేరుగా విడుదల చేసిన తమ నివేదికల్లో పేర్కొన్నాయి. దేశంలో గతేడాది ఉత్పత్తి అయిన మొత్తం సంపదలో 73 శాతం సంపద కేవలం ఒక్క శాతంగా ఉన్న శతకోటీశ్వర్ల వద్దే పోగుబడిందని, జనాభాలో సగానికై పైగా ఉన్న 63 కోట్ల మంది సంపద గతేడాది ఒక్క శాతమే పెరిగిందని ఆక్స్‌ఫామ్ పేర్కొంది. సంపదంతా కొద్దిమంది సంపన్నుల వద్దే పోగుబడటంతో ప్రపంచవ్యాప్తంగానూ ఆర్థిక అసమానతలు బాగా పెరిగిపోయాయని తెలిపింది. ఈ ఆర్థిక అసమానతలకు పన్ను ఎగవేతలను ప్రధాన కారణంగా పేర్కొన్న ఆక్స్‌ఫామ్.. కార్పొరేట్లకు ఇస్తున్న రాయితీలను రద్దు చేసి, వారి ఆదాయాలపై పన్నులు పెంచాలని ప్రభుత్వాలకు సూచించింది. జీవనప్రమాణాలు, పర్యావరణం మిగతా 8లో

ఉమ్మడి భవిష్యత్తు!

- నేటి నుండి దావోస్ సమావేశాలు
- లక్ష్య సాధనపై అనుమానాలు
- అమెరికా సహకారమే ప్రశ్నార్థకం

దావోస్ : 'ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అస్థిరత నెలకొంది. తీవ్రమౌతున్న భౌగోళిక, రాజకీయ పోటీ దేశాల్ని తమ హక్కుల కోసం, సార్వభౌమాధికారం కోసం గట్టిగా పట్టుబట్టేలా చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి భవిష్యత్ కోసం ప్రపంచ వ్యాప్త వాణిజ్య సహకారానికి, స్థానిక ప్రభుత్వాలకు మధ్య సమన్వయం సాధించడమెలా? వాణిజ్య ప్రయోజనాల కోసమైనా ప్రపంచ దేశాల్ని ఒక్క తాటిపైకి తీసుకురావడం ఎలా;? 'దావోస్‌లో నేడు ప్రారంభం కానున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) ముందు ఉన్న కీలక ప్రశ్నలివి! దీనిని దృష్టిలో ఉంచుకునే డబ్ల్యుఇఎఫ్ గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ దేశాలకు చెందిన నేతల్ని, ప్రభుత్వ ప్రతినిధుల్ని తాజా సమావేశానికి ఆహ్వానించింది, పది దేశాల అధినేతలతో పాటు, వివిధ దేశాలకు చెందిన 340 మంది అత్యున్నత స్థాయి రాజకీయ నేతలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభోపన్యాసం చేయనుండగా, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ముగింపు ఉపన్యాసం ఇవ్వనున్నారు. జర్మనీ ఛాన్సలర్ అంజెలా మార్కెల్, ఇటలీ ప్రధాని, బ్రిటన్ ప్రధాని, ఫ్రాన్స్ అధ్యక్షులు తదితరులు కీలక నేతల జాబితాలో ఉన్నారు. వీరితోపాటు డబ్ల్యుటిఓ, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన మరో 500 మంది ప్రతినిధులు కూడా సదస్సులో పాల్గొంటున్నారు. ఇక వివిధ దేశాల నుండి హాజరయ్యే కార్పొరేట్ రంగ ప్రతినిధుల సంఖ్య ఇంతకు రెట్టింపుగా ఉంది.

వ్యాపార సూత్రమిదే...!

'ముక్కలైన ప్రపంచంలో ఉమ్మడి భవిష్యత్ భవిష్యత్‌ను సృష్టించడం అనే నినాదంతో తాజా మిగతా 2లో

జ్యురిచ్‌తో ఏపి ఒప్పందం

- పయనీరింగ్ వెంచర్స్ ప్రతినిధులతో చంద్రబాబు భేటీ
- ఆహార శుద్ధిపైనా పెట్టుబడులు పెట్టాలని సూచన
- తొలిరోజు జ్యురిచ్‌లో ప్రారంభమైన సిఎం పర్యటన


పయనీరింగ్ వెంచర్స్ సిఇఓ రాన్‌పాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సోమవారం ఏపి ప్రభుత్వం జ్యురిచ్‌తో సిస్టర్ స్టేట్స్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక వేదిక ఆహ్వానం మేరకు నాలుగు రోజుల పర్యటనకు దావోస్ బయలుదేరిన ఆయన ముందుగా జ్యురిజ్ చేరుకున్నారు. జ్యురిచ్ ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్మెన్ వాకెర్ స్పా, ఆర్థిక వ్యవహారాల బ్యూన్ సాటర్‌లతో ఆయన భేటీ అయ్యారు. సిస్టర్ స్టేట్స్ ఒప్పందంలో భాగంగా సమాచార, మిగతా 9లో

పెదగొట్టిపాడులో దళితులపై దాడి చేసిన

నేరస్తుల్ని అరెస్టు చేయాలి

- సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ డిమాండ్
- 24న చలో పెదగొట్టిపాడు
- గాయపడిన ఇద్దరు దళితుల పరిస్థితి విషమం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో-గుంటూరు జిల్లా ప్రతినిధి-పత్తిపాడు, పొన్నూరు

పెదగొట్టిపాడు దళితులపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, నిందితులపై ఎస్సీ,ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్‌తో కలిసి వారు మాట్లాడారు. జనవరి ఒకటోతేదీన దళితులపై పెత్తందారులు దాడిచేశారని, అప్పటి నుండి ఇప్పటి వరకూ సాంఘిక బహిష్కరణ అమలు జరుగుతోందని తెలిపారు. దళిత యువకులకిచ్చిన విద్యుత్, సైకిల్‌షాపుల్ని వెనక్కు తీసుకుంటున్నారని, కౌలు పొలాలు ఇవ్వబోమని చెప్పారని, గతంలో తీసుకున్న అప్పుల్ని వెంటనే చెల్లించాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అలాగే దాడిలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని, వారిలో ఇద్దరి పరిస్థితి ఇప్పటికీ విషమంగా ఉందని తెలిపారు. గాయపడిన వారిలో ఒకరికి కాలు తొలగించాలని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారన్నారు. అయినా దాడిచేసిన వారిపై ఇప్పటికీ ఎస్సీ,ఎస్టీ మిగతా 9లో

హోదా ఇస్తే బిజెపితో పొత్తు


చిత్తూరు జిల్లా బిఎన్.కండ్రిగ మండలం పాదయాత్రలో జగన్

- ప్రధాన టార్గెట్ చంద్రబాబే
- మోడీని, ప్రజలను మోసగించి గెలిచారు
- జాతీయ ఛానెల్‌తో జగన్

ప్రజాశక్తి-తిరుపతి ప్రతినిధి

ఎన్‌డిఏ ప్రభుత్వం ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే 2019 ఎన్నికల్లో బిజెపితో కలిసి వెళ్తానని వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. సిఎం చంద్రబాబునాయుడు అధికారం కోసం ప్రధాని మోడీని, ప్రజలను మోసగించాడని, వచ్చే ఎన్నికలలో చంద్రబాబే ప్రధాన టార్గెట్‌గా ఎత్తుగడలు ఉంటాయన్నారు. సోమవారం జగన్ ప్రజాసంకల్పయాత్ర శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని తొట్టంబేడు మిగతా 9లో



భారీగా భోగాపురం భారం

- కొత్త ప్రతిపాదనలతో పెరగనున్న వ్యయం
- ఎఎఐ తీవ్ర అసంతృప్తి
- తాజా పరిణామాల్ని పరిశీలిస్తున్న కేంద్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి, విశాఖపట్నం ప్రతినిధి

టెండర్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భోగాపురం అంచనాలు భారీగా పెరగనున్నాయి. ఇప్పటికే ఎన్నో ప్రతిష్టాత్మక ఎయిర్‌పోర్టులను నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థను కాదని ఒక ప్రైవేటు సంస్థకు పనులు అప్పగించడానికి సిద్ధపడే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్న విమర్శలు వస్తున్నాయి. టెండర్ రద్దుకు సాంకేతికంగా కొన్ని కారణాలు చూపి, పాత ప్రతిపాదనల్లో కొన్ని కొత్త అంశాలు చేర్చినా సర్కారు నిర్ణయంపై ఉన్నతస్థాయి అధికారుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయం ఇప్పటికే టెండర్ దక్కించుకున్న ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు కూడా అసహనంగానే ఉన్నట్టు చెబుతున్నారు. తాజా పరిణామాలకు దారి తీసిన పరిస్థితులను మంత్రి కార్యాలయం వాకబు చేసినట్టు కూడా తెలిసింది.

టెండర్ల కథ ఇదీ!

2016లో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి మిగతా 9లో

రెండు రాష్ట్రాల్లోనూ పోటీ

జనసేన నేత పవన్

తెలంగాణలో ప్రారంభమైన రాజకీయ యాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పోటీ చేస్తామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమన్నారు. నిర్మాణాత్మక రాజకీయాల కోసమే పార్టీ పెట్టానని, ప్రభుత్వాల్ని అస్థిర పర్చడం, ప్రేరేపించడం జనసేన సిద్ధాంతం కాదన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న అనంతరం రాజకీయ యాత్రను ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అక్కడినుంచి అభివాదం చేస్తూ కరీంనగర్‌కు బయలుదేరి వెళ్లారు. అక్కడి యువ సమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాజకీయాల్ని గౌరవించాల్సిన అవసరముందన్నారు. దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర నిర్వహించాలని యువత, కార్యకర్తల్ని ఉద్దేశించి పిలుపునిచ్చారు. ప్రభుత్వాలతో గొడవలు పెట్టుకునే ఉద్దేశం తనకు లేదని, రాజకీయ అస్థిరత కోసం ప్రయత్నించడం తమ పార్టీ విధానం కాదని స్పష్టం చేశారు. తానెప్పుడూ సునిసితంగా ఆలోచిస్తానన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే పనిని తానెప్పుడూ చేయనన్నారు. ప్రస్తుతం పార్టీ నిర్మాణం దశలో ఉందని, పార్టీ సిద్ధాంతాలు, ఆలోచనా విధానాలకు అనుగుణంగా ముందుకు వెళుతున్నామన్నారు. తెలంగాణ నుంచి తన యాత్ర ప్రారంభమైనా ఆంధ్రప్రదేశ్ సమస్యలపైనే ఎక్కువ దృష్టి పెడతానన్నారు. రెండు రాష్ట్రాల్లో పోటీ చేస్తానని మొదటి నుంచి చెబుతూనే ఉన్నామని, అయితే ఎంత బలం ఉందనేది ఒక అంచనాకు వచ్చాకే చెప్పగలుగుతామన్నారు. గత ఎన్నికల్లో ఒక ఆలోచనా విధానంతో బిజెపి-టిడిపి కూటమికి మద్దతు తెలిపానన్నారు. రాష్ట్రం విడిపోయిన సమయంలో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లగలరనే నమ్మకంతో ఆ రెండు పార్టీలకూ మద్దతు తెలిపానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 27 నుంచి ప్రజాయాత్ర ఉంటుందన్నారు. గతంలో చెప్పినట్లుగా అనంతపురం నుంచి మూడు రోజుల పాటు యాత్రను చేపడతామన్నారు. పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించడంతో పాటు జిల్లాల్లో పర్యటనలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై అవగాహన కోసం పలు ప్రాంతాల్లో పర్యటిస్తానన్నారు. ఒంగోలులోని ఫ్లోరోసిస్, కిడ్నీ బాధితుల్ని కలుస్తానన్నారు. విశాఖ జిల్లా ఏజెన్సీ, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాన్ని కూడా సందర్శిస్తానన్నారు. అనంతపురం జిల్లా పర్యటన తరువాత మిగిలిన జిల్లాల్లో పర్యటనలకు సంబంధించిన తేదీల్ని ఖరారు చేస్తామన్నారు.


పవన్ కల్యాణ్‌కు తిలకం దిద్దుతున్న ఆయన సతీమణి అన్నా

నేడు స్కీం వర్కర్ల

సమ్మె

- విధులను బహిష్కరించనున్న కార్మికులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్కీం వర్కర్లు మంగళవారం సమ్మె చేపట్టనున్నారు. కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 17న దేశవ్యాప్తంగా ఈ డిమాండ్లపై సమ్మె చేపట్టాలని పిలుపునిచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సెలవుల కారణంగా 23న జరపాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే సర్వశిక్షా అభియాన్, అంగన్‌వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం, ఐకెపి, 108, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్మికులు సోమవారం సమ్మెలోకి వెళ్ళనున్నారు. కార్మికులకు రూ.3వేలు పెన్షన్, పిఎఫ్, గ్రాట్యూటీ, వైద్య సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ పథకాలకు 2018-19 బడ్జెట్‌లో నిధులు పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర పథకాలకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వాటా 90:10గా మొదట ఉండేది. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఈ బడ్జెట్‌ను 75:25 నిష్పత్తికి తగ్గించి, ప్రస్తుతం 60:40గా నిధులు కేటాయిస్తోంది. ఈ మూడేళ్ల కాలంలో కేంద్ర పథకాలకు మోడీ మిగతా 9లో

విద్యుత్తు సంస్థల్లో సమ్మెపై నిషేధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ట్రాన్స్‌కో, విద్యుత్తు పంపిణీ సంస్థలలో అన్ని సర్వీసులలో పనిచేస్తున్న ఉద్యోగుల సమ్మెలపై నిషేధాన్ని విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాన్స్‌కో, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ సంస్థలలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెలపై ఆరు నెలల పాటు నిషేధాన్ని విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయన్నారు.


పహరా

పెదగొట్టిపాడు దళితులను పరామర్శించేందుకు సిపిఎం నేతలు వస్తున్నారన్న నేపథ్యంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు



ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు

రాష్ట్ర మంత్రి దేవినేని ఉమ



ప్రజాశక్తి-పోలవరం

పోలవరం ప్రాజెక్టుపైగాని, ఏ ఇతర ప్రాజెక్టుపై గాని మాట్లాడే నైతిక హక్కు వైసిపి అధినేత జగన్‌కు లేదని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమ అన్నారు. పోలవరం ప్రాజెక్టు జాప్యానికి, అంచనా వ్యయం పెరగడానికి జగన్, కెవిపి.రామచంద్రరావు, విజయసాయిరెడ్డిలే కారణమని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును సోమవారం సందర్శించిన ఆయన తొలుత ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ కొన్నిరోజుల క్రితం ముఖ్యమంత్రి ప్రారంభించిన బ్లాచింగ్ ప్లాంట్, నదితీరాన వున్న డయాఫ్రమ్ వాల్, ఎర్తకమ్ రాక్‌ఫిల్‌డ్యామ్, లోయర్ కాఫర్ డ్యామ్ పనులను పరిశీలించారు. అనంతరం స్పిల్‌వే వద్ద పనులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశంలో నవయుగ కంపెనీ కాంక్రీటు పనులు చేయటానికి ముందుకొచ్చిందన్నారు. వచ్చే నెల నుంచీ రాష్ట్రంలో ప్రతి మండల కేంద్రం నుంచి పోలవరం ప్రాజెక్టు వద్దకు ఎపిఎస్‌ఆర్‌టిసి బస్సులు నడుపుతామని, రైతులు, ప్రజలు పోలవరం ప్రాజెక్టు పనులను చూసేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. స్పిల్‌వే, పవర్‌హౌస్ పనులు ఈ సంవత్సరాంతానికి పూర్తవుతాయన్నారు. అప్పర్ కాఫర్ డ్యామ్ పనులు వేగవంతంగా సాగుతున్నాయని, గోదావరి నీటిని మళ్లించేందుకు చేసిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో పులివెందుల్లోనూ టిడిపి గెలుపు ఖాయమని దేవినేని వ్యాఖ్యానించారు.



రాష్ట్రంలో పెరిగిన చలి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ఈశాన్య, తూర్పు దిశ నుంచి వచ్చే గాలులు ప్రస్తుతం తూర్పు, ఆగ్నేయం దిశ నుంచి వీస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ సోమవారం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో చలి ఎక్కువైందని ప్రకటించింది. దక్షిణ అండమాన్‌కు ఆనుకుని మలయ్ ద్వీపంపై 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు రెండు వారాలుగా ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడన ద్రోణి పశ్చిమానికి జరిగి నైరుతి బంగాళాఖాతంపై శ్రీలంక తీరానికి ఆనుకుని కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంపైకి వస్తున్న గాలుల దిశ మారినట్లు హైదరాబాద్ వాతావరణశాఖ పేర్కొంది. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు పగలు ఎండలు, రాత్రి పూట చలి కొనసాగుతుందని పేర్కొంది.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. పట్టు పరిశ్రమపై 8వ అంతర్జాతీయ సదస్సు ఎక్కడ జరుగుతుంది?
2. రెండో ప్రపంచయుద్ధ మ్యూజియంను ఎక్కడ ప్రారంభించారు?
3. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి) నూతన డిజి?
4. భారత ఎన్నికల కమిషన్ ప్రధాన కమిషనర్?
5. ముంబయి మారథన్ 2018?

కమీషన్‌ల కోసమే భోగాపురం టెండర్లు రద్దు : అంబటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమీషన్‌లు రావనే భోగాపురం ఎయిర్‌పోర్ట్ టెండర్లను రద్దు చేశారని వైసిపి అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆరోపించారు. సంపాదనే లక్ష్యంగా రాష్ట్ర కేబినెట్ నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. సోమవారం హైదరాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ టెండర్‌లో పాల్గొన్న ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా 30.2 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధపడిందని, అదే టెండర్‌లో పాల్గొన్న ప్రైవేటు సంస్థ కేవలం 21.6శాతమే కోట్ చేసిందన్నారు. ఎఎఐకు టెండర్ ఇవ్వాల్సి ఉన్నా, ప్రభుత్వ సంస్థ నుంచి ఫండింగ్, సూట్ కేసులు రావన్న ఉద్దేశంతో టెండర్‌నే రద్దు చేశారన్నారు. భూసేకరణ పూర్తి కాలేదని వంకలు పెట్టి రద్దు చేశారన్నారు. టిడిపికి చెందిన కేంద్ర మంత్రి నేతృత్వంలోని ఎఎఐకే టెండర్ రద్దు చేశారంటే చంద్రబాబు దుర్బుద్ధి ఎలాంటిదో అర్థమవుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇలాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం రాష్ట్రానికి ఎంతమాత్రం మంచిది కాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విభజన చట్టం అమలులో విఫలం

సుప్రీంకోర్టుకు వెళ్తామనడం సిగ్గుచేటు

హోదా కోసం పెద్ద ఎత్తున ఆందోళన

అన్ని పార్టీలూ పార్లమెంట్‌ను స్తంభింపజేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవిభజన చట్టం-2014ను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. హోదా విషయంలో మోడీ-చంద్రబాబు రాష్ట్ర ప్రజల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. విభజన బిల్లులో ఉన్న అంశాల్ని అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై చిన్నచూపు చూస్తోందన్నారు. విభజన అంశాల అమలుకోసం అన్ని పార్టీలూ కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు సమావేశ తీర్మానాల్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ విభజన హామీలపై సుప్రీంకోర్టుకు వెళ్తానంటూ చంద్రబాబు మరోసారి రాష్ట్రప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. 16 నెలల పాటు చంద్ర బాబుకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, రాష్ట్ర ప్రయోజనాల పట్ల కేంద్రానికి ఎంత చిత్తశుద్ధి ఉందో దీన్ని బట్టి అర్థమవుతోందన్నారు.

అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు పూర్తయినా విభజన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని, దీంతో రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. హోదా కన్నా ప్యాకేజీ ముద్దు అన్న చంద్రబాబు ప్యాకేజీ నిధుల్ని సాధించడంలోనూ విఫలమయ్యారన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబు భాగస్వామిగా ఉంటూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల్ని పణంగా పెడుతున్నారని, చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి బయటకు రావాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై అన్ని పార్టీలూ కలిసి మార్చి, ఏప్రిల్‌లో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాలని, అవసరమైతే రాష్ట్రబంద్ చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని పార్టీలూ పార్లమెంట్‌ను స్తంభింపచేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడీ నుంచి ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికీ జరగని అవమానాన్ని చంద్రబాబు చవి చూస్తున్నారన్నారు. మోడీని కాదని చంద్రబాబు సుప్రీంకోర్టుకు వెళ్లగలరా అని ఎద్దేవా చేశారు. విభజన హామీల అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అమలుపరిచిన అంశాలేంటో చంద్రబాబు శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ బ్యాంక్ నిధులతో రాజధానిని, నాబార్డు నిధులతో పోలవరాన్ని నిర్మించుకోవాలని కేంద్రం చెప్పడం రాష్ట్రంపై ఉన్న ప్రేమకు అద్దం పడుతోందన్నారు. ప్రత్యేక హోదా అంశాల కోసం మాజీ ఎంపి కొణతాల రామకృష్ణ ఈ నెల 27న రైలులో చేపట్టిన దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల సమయంలో ప్రభుత్వాన్ని స్తంభింపజేసేలా అన్ని రాజకీయ పార్టీలు ఒక్కటై పెద్దఎత్తున ఉద్యమించాలని, మార్చి ,ఏప్రిల్‌లో అఖిలపక్ష పోరాటాలు చేస్తామని వెల్లడించారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు

కాంగ్రెస్ నాయకులు మస్తాన్‌వలీ మాట్లాడుతూ బిజెపి, టిడిపి ప్రత్యేక హోదాను పక్కకు తోస్తున్నాయన్నారు. వైసిపి నాయకులు మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. అందరూ కలిసి కట్టుగా రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని సూచించారు. ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు, సిపిఎం (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు రామారావు, ఆప్ నాయకులు రాము, లోకసత్తా పార్టీ నాయకులు శ్రీను, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె రమేష్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ పాల్గొన్నారు.

ఉమ్మడి భవిష్యత్తు!

మొదటి పేజీ తరువాయి

సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. ప్రపంచ స్థాయిలో వాణిజ్య విస్తరణ అవకాశాలు కుదించుకుపోతుండటంతో వాటిని తిరిగి సృష్టించడం, కార్పొరేట్ ప్రపంచానికి నమ్మకం కలిగించడమే ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశాలు సాగనున్నాయి. దీనిలో భాగంగా అంతర్జాతీయ భద్రత, పర్యావరణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనే అంశాలపై చర్చలు సాగనున్నాయి. ఈ లక్ష్యాల్ని సాధించడానికి వివిధ దేశాల మధ్య ఇప్పటికే తీవ్ర స్థాయిలో నెలకొన్న విభేదాల్ని పరిష్కరించాల్సిఉంది. దావోస్ సమావేశంలో దీనిపైనే ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు చెబుతున్నారు. అయితే, ప్రపంచ ఆర్థిక వేదిక నిర్దేశించుకున్న ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి అమెరికా ప్రధాన ఆటంకంగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.'అమెరికా ఫస్ట్' అన్న నినాదంతో ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న అనేక చర్యలు స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలకు భిన్నంగా ఉన్నాయన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది. వలసప్రజలు, వారి హక్కులు, వీసాల మంజూరుపై ట్రంప్ అనుసరిస్తున్న వైఖరి ఇప్పటికే కార్పొరేట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ట్రంప్ స్వయంగా ముగింపు ఉపన్యాసం ఇవ్వనుండటంతో ఆయన ఏం చెబుతారన్న ఆసక్తి కలుగుతోంది.

విశ్వాసం నెలకొల్పడానికే ప్రాధాన్యత : డబ్ల్యుఇఎఫ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్

మరికొన్ని గంటల్లో సదస్సు ప్రారంభం కానుండగా మీడియాతో మాట్లాడిన డబ్ల్యుఇఎఫ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ప్రొఫెసర్ క్లాస్ స్కావబ్ 'బహుళ పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని కల్పించడమే తక్షణ ప్రాధాన్యతా అంశం' అని చెప్పారు. ' మన ప్రపంచం గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ముక్కలై ఉంది. దేశాలు, సమాజాలు, సమూహాల మధ్య తీవ్ర స్థాయిలో పోటీ నెలకొనడమే దీనికి కారణం. ఫలితంగా ఒకరిపై ఒకరికి నమ్మకం లేని పరిస్థితి ఏర్పడింది. ఈ సవాల్‌ను మనం ఎదుర్కోవాలి. నిజానికి గతంలో ఎప్పటికన్నా పరస్పర సహకారం ఇప్పుడే కీలకంగా మారింది. వివిధ దేశాల్లో ఉన్న బహుళ పెట్టుబడిదారుల మధ్య విశ్వాసం నెలకొల్పడమే ఈ వార్షిక సమావేశపు ముఖ్య లక్ష్యం' అని ఆయన చెప్పారు.

రాష్ట్రానికి శాపంగా మారిన చంద్రబాబు

సొంత ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని గాలికొదిలేశారు

నాలుగేళ్లలో ఒక్క విభజన హామీనీ సాధించలేదు

ముఖ్యమంత్రికి కెవిపి బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యక్తిగత ప్రయోజనాల కోసం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాల్ని గాలికొదిలేశారని, ఆయన తీరు రాష్ట్రానికి శాపంగా మారిందని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్రరావు విమర్శించారు. నాలుగేళ్లయినా విభజన చట్టంలోని హామీలను అమలు చేయించలేకపోయారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆరు పేజీలతో బహిరంగ లేఖ రాశారు. వాటాలు కుదరక ప్రాజెక్టుల్ని ఆలస్యం చేస్తున్నారని, అమరావతిలో శాశ్వత భవనాలకు ఒక్క ఇటుకనూ పేర్చలేదన్నారు. నాలుగేళ్లలో ఒక్క పని కూడా చేయకుండా చివరి నిముషంలో బిజెపిపై నిందలేస్తే ప్రజలు క్షమించరని హితవు పలికారు. ఆస్పత్రి పేర దుబాయ్ కంపెనీకి భూములు ఇవ్వడంలో ఉన్న ఆసక్తి ఎయిమ్స్ నిర్మాణంపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. హెరిటేజ్, బిగ్‌బజార్ ప్రయోజనాల కోసం రాజీపడుతున్నట్లుగా ఉందని ఆరోపించారు. విభజనకు కాంగ్రెస్ ఒక్కటే కారణం కాదని, టిడిపి కూడా రెండుసార్లు విభజనకు అనుకూలంగా లేఖలిచ్చిందని వెల్లడించారు. కాంట్రాక్టర్ల రేట్ల కోసం కేంద్రంతో తగాదా పడటం విడ్డూరంగా ఉందన్నారు. ముందుగానే ఎన్నికలు జరగొచ్చని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టం గుర్తు చేయాలనే ఉద్దేశంతో లేఖను రాయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలు వచ్చి తమకు ఉద్యోగాలొస్తాయని ఎందో మంది నిరుద్యోగ యువత ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. పోలవరం పూర్తయ్యి సాగు, తాగునీరు లభిస్తుందని రైతులు భావించారని, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ వస్తే తమ జీవితాలు బాగుపడతాయని ఉత్తరాంధ్ర-రాయలసీమ వాసులు ఇంకా ఎదురు చూస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ పూర్తయితే రాయలసీమ వాసులకు ఉపాధి లభిస్తుందని ఆ ప్రాంత ప్రజలు కలలు కంటున్నారని తెలిపారు. విభజన అశాస్త్రీయంగా జరిగిందంటూ మొసలి కన్నీరు కారుస్తున్న బాబు నటనా చాతుర్యాన్ని చూసి ఆస్కార్ అవార్డు పొందిన నటులుసైతం ఆచ్చర్యపోతున్నారని ఎద్దేవా చేశారు. విభజన హామీల అమలు కోసం కోర్టులకు వెళతామంటున్న చంద్రబాబు ఏ న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తారు? ఎవరిమీద కేసు వేస్తారు? ఎవరిని ప్రతివాదులుగా చేస్తారో స్పష్టం చేయాలని కెవిపి కోరారు.

జన్మభూమిలో ఎస్సీ లబ్ధిదారులకు రూ.2359 కోట్లు

రెండు లక్షల మందికి రుణాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది లబ్ధిదారులకు రూ. 2,359 కోట్ల రుణాన్ని అందజేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. బ్యాంక్ లింక్డ్ స్కీమ్‌లతో పాటు స్వయం ఉపాధి వంటి వివిధ పథకాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి మెగా గ్రౌండ్ మేళా కింద లబ్ధిదారులకు చెక్కుల రూపంలో ఈ రుణాలు అందించినట్లు వారు పేర్కొన్నారు. అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లాలో 3,5120 మంది లబ్ధిదారులకు రూ.457 కోట్లు పంపిణీ చేయగా, అత్యల్పంగా విజయనగరం జిల్లాలో 70 కోట్లతో 6,121 మందికి రుణాలు అందజేశారు. శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో కూడా తక్కు సంఖ్యలోనే రుణాలు పంపిణీ చేశారు. కృష్ణా జిల్లాలో 19వేల మందికి రూ.268 కోట్లు, తూర్పు గోదావరిలో 18 వేల మందికి రూ.231 కోట్లు, అనంతపురంలో 22 వేల మందికి రూ.226 కోట్లు పంపిణీ చేశారు. గుంటూరులో 14 వేల మందికి 184 కోట్లు, కర్నూలులో 14 వేల మందికి రూ.181 కోట్లు, విశాఖపట్నంలో 36 వేల మందికి రూ. 156 కోట్లు పంపిణీ చేశారు. చిత్తూరులో 12 వేల మందికి 145 కోట్లు, కడపలో 8 వేల మందికి 144 కోట్లు, ప్రకాశంలో 9753 మందికి రూ.119 కోట్లు, శ్రీకాకుళం జిల్లాలో 7553 మందికి రూ.89 కోట్లు, నెల్లూరు జిల్లాలో 6వేల మందికి రూ.84 కోట్లు అందజేశారు. వాస్తవానికి అంబేద్కర్ విదేశీ విద్యా పథకం కింద అందించే ఉపకార వేతనంతో పాటు ప్రభుత్వం అందించే అన్ని స్కాలర్‌షిలను ఆన్‌లైన్ ద్వారా విద్యార్థుల ఖాతాలో జమచేయాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో వీటిని కూడా చెక్కుల రూపంలో అందజేసి ప్రచార్భాటాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ఐఎఎస్, ఐపిఎస్‌లకు పదోన్నతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు సూపర్ టైం స్కేల్ కింద పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా ఉన్న జి రవిబాబును ప్రభుత్వ కార్యదర్శి, కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. 2005 బ్యాచ్ ఐపిఎస్ అధికారులు ఎస్ శ్యాం సుందర్, సిఎం త్రివిక్రమ వర్మ, కె కోటేశ్వరరావు, ఎల్‌కెవి రంగారావు, పి వెంకటరామి రెడ్డి, జి పాలరాజులకు స్పెషల్ గ్రేడ్ పదోన్నతి కల్పించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీగా ఉన్న ఎం జానకి, ఉపరాష్ట్రపతి ప్రయివేట్ సెక్రటరీగా ఉన్న ఎన్ యువరాజ్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె దమయంతి, కేంద్ర పాడిపరిశ్రమల శాఖ జాయింట్ సెక్రటరీ బి కిశోర్, విశాఖపట్నం పోర్ట్ చైర్మన్ ఎంటి కృష్ణబాబు, టిటిడి జెఇఒగా ఉన్న పి భాస్కర్, ఎపిఎస్పిడిసిఎల్ ఎండిగా ఉన్న ముడావత్ ఎం నాయక్‌లకు స్పెషల్ గ్రేడ్ పదోన్నతిని కల్పించారు. కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీ నవీన్ గులాటీ, విజయవాడ నగర డిసిపి కాంతి రాణా టాటాలకు డిఐజిలుగా, టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్‌కు, దేవాదాయ శాఖ కమిషనర్ యువి అనురాధకు అదే పదవిలో సూపర్‌టైం స్కేల్ పదోన్నతిని కల్పించారు. సాధారణ పరిపాలన శాఖ సెక్రటరీ గోపాల కృష్ణ ద్వివేదీని అదే శాఖ ముఖ్య కార్యదర్శిగా, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బి ఉదయ లక్ష్మికి అదే శాఖ ముఖ్య కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు. బెంగళూరు సిబిఐలో ఉన్న మనీష్ కుమార్ సిన్హా, సౌత్ కోస్టల్ జోన్ డిఐజి కెవివి గోపాలరావు, విజయవాడ జాయింట్ సిపి బివి రమణ కుమార్, ఎపి ఎసిబి అడిషినల్ డైరెక్టర్ పి హరి కుమార్‌లకు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజి) హోదాను కల్పించారు.

26 నుంచి 'దళిత తేజం-తెలుగు దేశం'

ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా దళిత వాడల్లో ఈ నెల 26 నుంచి 'దళిత తేజం-తెలుగు దేశం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి కెఎస్ జవహర్ వెల్లడించారు. ఏప్రెల్ 20న విజయవాడలోని పవిత్ర సంగమం వద్ద నిర్వహించే రాష్ట్ర దళిత మహాసభతో ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు. సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత వాడల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాల్ని వివరిస్తామన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు సిఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. టిడిపి ఆవిర్భావంతోనే దళితులకు రాజకీయ ప్రాధాన్యత లభించిందని, తనతో పాటు ఎందరో దళిత నేతలు టిడిపిలో కీలక పదవుల్లో ఉన్నారన్నారు. అమ్మకు వందనం పేరుతో అంబేద్కర్‌ను స్మరించుకునే అవకాశం కలిగిందన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టడంలోనూ, భారతరత్న ఇవ్వడంలోనూ టిడిపి పాత్ర మరువలేనిదన్నారు. స్మృతి వనం పేరుతో అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రత్యేకం

అటవీ భూముల వివాదం పరిష్కారమయ్యేనా?

రిజర్వ్ ఫారెస్ట్‌లోకి వచ్చేదెప్పుడు?

నోటిఫై చేయాల్సిన భూమి 5.10 లక్షల హెక్టార్లు

రెవెన్యూ వివాదాలే కారణమా?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో దాదాపు 5 లక్షల హెక్టార్లకు పైగా అటవీ భూమి ఉన్నప్పటికీ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి రావడంలేదు. వివిధ వివాదాల్లో ఉన్న అటవీ భూమి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడంలేదని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. రెవెన్యూ శాఖ వద్ద కొన్ని సమస్యలతో పాటు భూ వివాదాల్లో మరికొన్ని సమస్యలు ఉండటం వల్ల రాష్ట్రంలో 184 అటవీ బ్లాకుల్లో భూమి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2259 బ్లాకుల్లో 37.22 లక్షల హెక్టార్లలో అటవీ భూమిని గుర్తించారు. అయితే అందులో 184 అటవీ బ్లాకుల్లో ఉన్న 5.10 లక్షల హెక్టార్ల భూమి మాత్రం కొన్ని దశాబ్దాలుగా రిజర్వ్ ఫారెస్ట్ కింద నోటిఫై కాకుండా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్న ఆ భూమిని నోటిఫై చేయడంలో, భూవివాదాల్ని పరిష్కరించడంలో జాప్యం చేస్తోందనే విమర్శలొస్తున్నాయి. సాధారణంగా రెవెన్యూ శాఖలో పరిధిలో ఉన్న అటవీ బ్లాకుల్ని రిజర్వ్ ఫారెస్ట్ కింద ప్రకటించాలంటే ప్రభుత్వం ఏపి అటవీ చట్టం సెక్షన్ 4 నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. నోటిఫికేషన్ జారీ చేశాక కూడా అందులో పేర్కొన్న భూమికి సంబంధించి ఏమైనా వివాదమున్నా, సమస్య ఉన్నా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఒ) పరిష్కరించాల్సి ఉంటుంది. రెవెన్యూ శాఖలో ఆర్డీవో స్థాయి అధికారి ఎఫ్ఎస్ఒగా ఉంటారు. తొలుత సెక్షన్ 4 కింద జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం సంబంధిత భూ వివాదాలన్నీ పరిష్కరించాక, అటవీ బ్లాకుల్లో ఉన్న భూమిని రెవెన్యూ శాఖ నుంచి రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించాలంటే సెక్షన్ 15 ప్రకారం తుది నోటిఫికేషన్ జారీ చేయాలి. అప్పుడే ఆ భూమి పూర్తిగా రిజర్వ్ ఫారెస్ట్‌గా అటవీ శాఖ పరిధి లోకొస్తుంది. ఆమేరకు దశాబ్దాల నుంచి పెండింగ్ లో ఉన్న అటవీ బ్లాకుల్ని సెక్షన్ 15 ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాలని అటవీ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రభుత్వం పేర్కొన్న 184 అటవీ బ్లాకుల్లో చాలా వరకు సెక్షన్ 4 ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చినవే. అయితే పూర్తిస్థాయి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకొచ్చేందుకు ఆయా జిల్లాల ఎఫ్ఎస్ఒలు సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించి తుది నోటిఫికేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ప్రభుత్వాన్ని కోరింది.

సెక్షన్ 15 ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాల్సిన అటవీ బ్లాకుల వివరాలు

సర్కిల్ పరిధి	అటవీ బ్లాకులు	విస్తీర్ణం (హెక్టార్లలో)
విశాఖపట్నం	52	2.84 లక్షలు
కర్నూలు	6	8,315
తిరుపతి	10	53,505
అనంతపురం	42	55,792
మొత్తం	184	5.10 లక్షలు

పరిహారంగా ఇచ్చే భూమినీ నోటిఫై చేయాల్సిందే...

పలు అభివృద్ధి ప్రాజెక్టులకు అటవీ శాఖ భూమిని డీ నోటిఫై చేయాల్సి వస్తే ముందుగా ఆ భూమి పూర్తిగా అటవీ శాఖ పరిధిలోకి రావాలి. అంటే రిజర్వ్ ఫారెస్ట్ అయి ఉండాలి. జలవనరుల, రోడ్డు రవాణా, పరిశ్రమలు తదితర శాఖలు అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అటవీ భూమి తీసుకుంటే అందుకు తగిన పరిహారం కింద వేరే ప్రాంతాల్లో అంతే మొత్తంలో భూమిని అటవీ శాఖకు ఇవ్వాలి. అయితే పరిహారంగా ఇచ్చే ఆ భూమి విషయంలో రెవెన్యూ పరిధిలో ఏమైనా సమస్యలుంటే అటవీ శాఖ ఆ భూమి తీసుకోదు. సెక్షన్ 15 ప్రకారం నోటిఫికేషన్ జారీ చేస్తే రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకొస్తుంది.

సంక్షిప్తం

గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా రావత్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అధికారి ఎస్ఎస్ రావత్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రావత్ ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖకు ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు గిరిజన సంక్షేమ శాఖకు ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ఆర్‌పి సిసోడియాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా నియమించడం వల్ల అతని స్థానంలో రావత్‌ను నియమించారు. అంతేకాకుండా స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్స్‌కు ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక నుంచి రావత్ మూడు శాఖలకు ముఖ్య కార్యదర్శిగా వ్యవహరించనున్నారు.

కమీషన్ పెంపుపై రేషన్ డీలర్ల సంఘం హర్షం

సంక్రాంతి కానుకపై కమీషన్‌ను రూ.5 నుంచి రూ.10కి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దివి లీలా మాధవరావు ఒక ప్రకటనలో హర్షాన్ని వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా కమీషన్‌ను పెంచాలని తాము ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని, దీంతో ప్రభుత్వం కమీషన్‌ను పెంచిందన్నారు. పండుగ కానుక పంపిణీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు రూ.6.50 కోట్లు విడుదల చేసిందన్నారు.

తాగు నీటికి రూ.15,730 కోట్లు

రాష్ట్రంలో ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందించేందుకు ఎపి డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రూ.15,730 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట (తూర్పుగోదావరి)

సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సామర్లకోటకు చెందిన వేలంకి రమణ(25), వేపాటి రమణ వేట్లపాలెంలోని వీర వెంకట విఘ్నేశ్వర ఫైర్‌వర్క్‌లో రోజు కూలీలుగా పని చేస్తున్నారు. సోమవారం బాణసంచా తయారు చేస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో వెలంకి రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. వేపాటి రమణకు కాళ్లు కాలిపోయాయి. అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనాస్థలిని పెద్దాపురం డిఎస్‌పి చిలకా రామారావు, ఎస్‌ఐ కృష్ణభగవాన్ పరిశీలించారు.



విశాఖలో అమ్మకు వందనం కార్యక్రమాన్ని సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు, చిత్రంలో ఎంపీ హరిబాబు, ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు, చాగంటి కోటేశ్వరరావు తదితరులు

'అమ్మకు వందనం' ప్రారంభం

విశాఖలో చంద్రంపాలెం హైస్కూల్‌ను సందర్శించిన మంత్రి గంటా

ప్రజాశక్తి-మధురవాడ (విశాఖ)

విశాఖలోని స్థానిక చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'అమ్మకు వందనం' కార్యక్రమాన్ని మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో మానవీయ విలువలు, సంస్కృతి గొప్పవని ప్రపంచ దేశాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని, నిత్యం మన ఆలోచనల్లో తల్లి ఉండాలని సూచించారు. తల్లి పట్ల ప్రేమ, అభిమానం పిల్లలందరిలో అంతర్లీనంగా ఉంటుందన్నారు. విద్యార్థులందరూ తల్లి ప్రాధాన్యత తెలుసుకోవాలని, విద్యార్థులకు మొదటి గురువు తల్లేనని అన్నారు. అంతకుముందు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. వసంత పంచమి రోజున రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులతో అమ్మకు వందనం ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు వారి తల్లి పాదాలను కడిగి పూలు అక్షింతలతో పాదపూజ చేసి వారి ఆశీర్వాదాన్ని స్వీకరించారు. అనంతరం తల్లిని గౌరవిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ హరిబాబు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

జబ్బు చేసిన పిహెచ్‌సిలు

మందులు, సిబ్బంది కొరత
పట్టించుకోని వైద్య శాఖ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కావాల్సిన మందులు, సిబ్బంది లేక నిరుపేదలకు సరైన వైద్యం అందడం లేదు. కొన్ని పిహెచ్‌సిల్లో రెగ్యులర్ వైద్యులు లేక పోవడంతో కాంట్రాక్టు వైద్యులే వైద్య సేవలు అందిస్తున్నారు. దీనికి తోడు జ్వరానికి తప్ప ఇతర రోగాలకు మందులు బయటనే కొనాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు.

మదర్ పిహెచ్‌సిలో మందులు లేవు : కర్నూలు

జిల్లా ఓర్వకల్లు మండలం హుస్సేనాపురంలోని పిహెచ్‌సిని మదర్ పిహెచ్‌సి అనవచ్చు. ఎందుకంటే ఇటు పాణ్యం మండలం నుంచి అటు బేతంచెర్ల నుంచి ఎవరికైనా రోడ్డు ప్రమాదాలు జరిగినా, గర్భిణులను కాన్పులకు వచ్చినా మార్గ మధ్యలో బస్టాండుకు దగ్గరలో ఉన్న ఈ పిహెచ్‌సి ఎంతో కీలకమైంది. బేతంచెర్ల బండల గనుల్లో పనిచేసే కార్మికులకు గాయాలయినా, రోడ్డు ప్రమాదాల్లో గాయపడినా, శకునాల గ్రామంలోని సోలార్ ప్రాజెక్టులో ప్రమాదాలకు గురైన వారిని తరలించే సమయంలో వారిని కాపాడేందుకు అవసరమైన పరికరాలు, మందులు, సిబ్బందిని అందుబాటులో ఉంచితే తాత్కాలిక చికిత్స చేసి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించవచ్చు.

పిహెచ్‌సి ఇంకా పాత విధానంలోనే...

హుస్సేనాపురం పిహెచ్‌సిలో ఒక ఎంబిబిఎస్ డాక్టర్, ఒక ఆయుష్ డాక్టర్ ఉన్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సిన చోట ఇద్దరే ఉన్నారు. ఉన్న ఒక్క పబ్లిక్ హెల్త్ నర్సు రిటైర్ అయ్యారు. ఈ పిహెచ్‌సి కింద 8 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ప్రతి సబ్ సెంటర్లో ఇద్దరు చొప్పున ఎఎన్‌ఎంలు ఉండాలి. కానీ ఒక్కొక్కరే ఉంటున్నారు. బినాపల్లి సబ్‌సెంటర్‌కు ఎఎన్‌ఎంలు లేరు. పిహెచ్‌సిలో నెలకు 8 నుంచి 10 కాన్పులు అవుతాయి. కేవలం మూడు బెడ్లు మాత్రమే ఉన్నాయి. 30 బెడ్ల ఆస్పత్రిగా చేయాలని ప్రతిపాదించి సర్వే కూడా చేసినా కదలిక లేదు. సాయంత్రం 4 గంటల నుంచి ఒక స్టాఫ్ నర్సు, ఆయా మాత్రమే ఉంటారు. ల్యాబ్ టెక్నీషియన్ లేరు. ఇది హుస్సేనాపురంలోని పిహెచ్‌సి పరిస్థితి మాత్రమే కాదు ప్రతి పిహెచ్‌సిల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

నూతన విధానం ప్రకారం...

పిహెచ్‌సి కింద 4 సబ్ సెంటర్లు మాత్రమే ఉండాలి. కానీ 8 సబ్ సెంటర్లు ఉన్నాయి. ప్రతి సబ్ సెంటర్‌కు ఇద్దరు ఎఎన్‌ఎంలు ఉండాలి. ముగ్గురు మెడికల్ ఆఫీసర్లు ఉండాలి. అందులో ఒక ఫిమేల్ మెడికల్ ఆఫీసర్ ఉండాలి. ఒక ల్యాబ్ లెక్నీషియన్, ఒక ఫార్మసిస్టు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక మేల్ సూపర్‌వైజర్, ఒక ఫిమేల్ సూపర్‌వైజర్, ఒక పబ్లిక్ హెల్త్ నర్సు ఉండాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు.

వేధిస్తున్న మందుల కొరత

రెగ్యులర్‌గా అవసరమైన మందులు జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల్లో లేవు. నొప్పులకు అవసరమైన డైక్లోఫినాక్ ఇంజక్షన్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ సిరప్, బి కాంప్లెక్స్, మిథైల్ కొబాలమెంట్, కాల్షియం టాబ్లెట్లు లేవు, ప్రస్తుతానికి ప్యారాసిటమల్ 500 ఎంజి మాత్రలు మాత్రమే ఉన్నాయి. రోలర్ బ్యాండేజీలు లేవు, గ్యాస్ ట్రబుల్, కడుపులో మంటకు వాడే ఇంజక్షన్లు, రాన్‌టాక్ మందులు లేవు. (మందుల కోసం మూడు నెలలకు ఒకసారి ఇండెంట్ పెడతారు. ప్రసుతం ఇండెంట్ పెట్టి నెల దాటినా మందులు రాలేదు)



కర్నూలు జిల్లా హుస్సేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సౌకర్యాలు పెంచితే మంచి వైద్యం



ఎంతో కీలకమైన ఈ పిహెచ్‌సిలకు కావాల్సినంత మంది సిబ్బందిని పెంచితే, సమయానికి అవసరమైన మందులు సరఫరా చేస్తే మంచి వైద్య సేవలు అందించవచ్చు. బయోమెట్రిక్ పనిచేయడం లేదు, కంప్యూటర్ సిపియు పనిచేయడం లేదు. రిపోర్టులు తయారు చేయాలంటే డెటా ఎంట్రా ఆపరేటర్ లేడు.

డాక్టర్ ఎం. భాస్కర్‌రెడ్డి

ధాన్యం బిల్లుల కోసం బ్యాంకుల చుట్టూ గిరగిరా

పక్షం దాటినా చెల్లించని దుస్థితి

'విజయనగరం'లో రూ.వంద కోట్ల బకాయిలు

దళారుల బారిన రైతులు



చీపురుపల్లి మండలంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వం విధించిన వెబ్‌ల్యాండ్, ఇ-క్రాప్ నిబంధనలతో విజయనగరం జిల్లాలో అధిక శాతం మంది రైతులు రైతులు దళారుల బారిన పడుతున్నారు. దీన్ని అధిగమించిన రైతులకు బ్యాంకుల్లో మరో రకమైన సమస్య ఎదురవుతోంది. రూ.50 వేలు మొత్తం దాటిన రైతులు తప్పనిసరిగా పాన్ కార్డు చూపించాలంటూ బ్యాంకు అధికారులు మెలికపెడుతున్నారు. ఈ పేరుతో వారాల తరబడి చెల్లింపుల్లో జాప్యం చేస్తున్నారు. తీరా పాన్‌కార్డు లేదా దానికి సంబంధించిన ఎకనాలడ్జ్‌మెంట్ చూపించాక రోజుకు రూ.పది వేలకు మించి ఇవ్వ లేమంటూ బ్యాంకు అధికారులు పీటముడి వేస్తున్నారు. ఇదేమంటే 'ప్రభుత్వం అధిక మొత్తాలను బ్యాంకుల్లో జమ చేయడం లేదు. అందువల్ల మా వద్ద ఉన్న కొద్ది మొత్తాన్నే సర్దుబాటు చేస్తున్నాం.' అంటూ చేతులెత్తేస్తున్నారు. గజపతినగరం మండలం పురిటిపెంటకు చెందిన ఆదాడ సింహాద్రికి ఇటువంటి సమస్యే ఎదురైంది. తాను పండించిన 280 బస్తాలను గజపతినగరం కొనుగోలు కేంద్రంలో విక్రయించాడు. బస్తాకు రూ.1,550 చొప్పున మొత్తం బస్తాలకు రూ.4.34 లక్షలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఆయన బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం లక్ష రూపాయలు మాత్రమే జమ చేసింది. ఇది కూడా తీసుకునేందుకు బ్యాంకర్లు సహకరించడం లేదు. పాన్‌కార్డు ఉండాలని మెలికపెట్టడంతో చేతిలో డబ్బులు లేక ఆ రైతు సంక్రాంతి పండగను కూడా సరిగా చేసుకోలేకపోయాడు. ఇది కేవలం సింహాద్రి సమస్య మాత్రమే కాదు. రూ.50 వేల విలువకు మించిన ధాన్యం ఇచ్చినవారంతా ఇదే సమస్యతో సతమతమవుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకూ సేకరించిన ధాన్యానికి రూ.270 కోట్ల చెల్లించగా, మరో రూ.వంద కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. దీన్నిబట్టి బిల్లుల చెల్లింపులో ఎంత జాప్యం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇ-క్రాప్, వెబ్‌ల్యాండ్ నమోదు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, బ్యాంకర్ల నిబంధనలు వంటి కారణాలతో కొంతమంది రైతులు వరి చేనును ఇంకా కళ్లాలకు చేర్చలేదు. నూర్పులు చేసిన వారు కళ్లాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 2.78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అయితే, రైతుల సంఖ్య 30 వేలకు దాటకపోవడం బినామీ బాగోతానికి అద్దం పడుతోంది.

రైతులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు : మంత్రి సోమిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి



గుంటూరులో బిపిటి వరి కంకులను పరిశీలిస్తున్న మంత్రి సోమిరెడ్డి

రైతులకు ప్రభుత్వం, చట్టాలు అండగా ఉంటాయని, ఆత్మహత్యలకు పాల్పడొద్దని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. గుంటూరు సమీపంలోని లాంలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సోమవారం నిర్వహించిన కిసాన్ మేళాలో ఆయన మాట్లాడారు. రూ.24 కోట్లతో నిర్మించనున్న వివిధ భవనాలకు పౌర సరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.కోటి వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లను రైతులకు అందించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. రుణమాఫీ కింద రూ.3,300 కోట్లు విడుదల చేశామని, ఏడాదిలో రూ.8,200 కోట్లను మాఫీ చేస్తామన్న మంత్రి రుణమాఫీ నిధులతో రాజధాని నిర్మాణమే చేపట్టొచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతోపాటు వ్యవసాయ పరిశోధనలూ కొనసాగాల్సిందేనన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా 10 వేల మెట్రిక్ టన్నుల మినుముల కొనుగోలుకు నిర్ణయించామన్న మంత్రి 'రైతు రథం' కింద 12,800 ట్రాక్టర్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రావెల కిషోర్‌బాబు, డి.నరేంద్రకుమార్, టి.శ్రావణ్‌కుమార్, వ్యవసాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, వర్సిటీ విసి వి.దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

నాల్గో పారిశ్రామిక విప్లవం రానుంది

అంతర్జాతీయ సదస్సులో బెంగుళూరు ఐఐఎస్‌సి ప్రొఫెసర్



గుంటూరులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎఎన్‌యు విసి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు)

రాబోయే కాలంలో డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ రాబోతుందని, అదే నాల్గో పారిశ్రామిక విప్లవం కానుందని బెంగుళూరు ఐఐఎస్‌సి ప్రొఫెసర్ యు.రామ్మూర్తి పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఎఎన్‌యు) ఇంజినీరింగ్ కాలేజీ మెకానికల్ విభాగంలో 'అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజినీరింగ్' అంశంపై మూడ్రోజుల సదస్సు సోమవారం ప్రారంభమైంది. సభకు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ఇ.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యు.రామ్మూర్తి.. మాన్యుఫ్యాక్చరింగ్ అనేది ప్రస్తుతం ప్రపంచానికే సవాల్ అనేలా ఉందన్నారు. చైనాలో ఉత్పాదక పరిశోధనలన్నీ సవాళ్ళ నేపథ్యంలోనే కొనసాగుతున్నాయని చెప్పారు. ఎఎన్‌యు విసి ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. పరిశోధకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ నూతనత్వాన్ని జోడిస్తూ మరింత అభివృద్ధి దిశగా సాగాలన్నారు. పరిశోధనల్లో నాణ్యతను పెంచుకోవాలని సూచించారు. కృష్ణా యూనివర్సిటీ విసి ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ.. వస్తువులు మరింత సూక్ష్మ స్థాయికి వెళ్లేందుకు పరిశోధనలు చేస్తున్న క్రమంలో సిల్క్ బ్యాగ్స్, ప్యాకింగ్ మెటీరియల్స్, కారు మెటీరియల్స్, మెగా మెటీరియల్స్, నానో క్రస్టల్స్ మొదలగు అంశాల మీద పరిశోధనలు విస్తృతంగా చేస్తున్నారని చెప్పారు. రక్షణ శాస్త్రవేత్త జి.మధుసూదనరెడ్డి మాట్లాడుతూ.. సిస్టమ్ మ్యానుఫ్యాక్చరింగ్, డిజైన్ ఆఫ్ మైక్రో స్ట్రక్చర్ పరిశోధనలు విస్తృతమైతే భారత ఆర్థిక వ్యవస్థ మరింత అభివృద్ధి అవుతుందన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.గోపికృష్ణ మాట్లాడుతూ.. 190 పరిశోధనా పత్రాలు రాక 80 పత్రాలనే ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీటిని ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురిస్తామని చెప్పారు. సదస్సులో న్యూఢిల్లీ ఐఐటి ప్రొఫెసర్ డి.రవికుమార్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ విసి కె.రంజీ, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్‌బిఆర్.మోహనరావు, ఇంజినీరింగ్ కళాశాల డీన్ పి.సిద్ధయ్య పాల్గొన్నారు.

దివిసీమ పాలిటెక్నిక్‌కు ర్యాంకుల పంట

మెకానికల్ విభాగంలో స్టేట్ మొదటి ర్యాంకు

ప్రజాశక్తి - అవనిగడ్డ (కృష్ణా)

పాలిటెక్నిక్ పరీక్షా ఫలితాల్లో కృష్ణాజిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రపురంలో గల దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. మూడో సెమిస్టర్ ఫలితాల్లో మెకానికల్ విభాగంలో టి.శ్రీను 886 /900మార్కులు సాధించి మొదటి ర్యాంకు, ఇ.నిరంజన్‌రెడ్డి 875/900 మార్కులు సాధించి 3వ ర్యాంకు, సివిల్ విభాగంలో కె.దుర్గాప్రసాద్ 880/900 మార్కులు సాధించి 4వ ర్యాంకు, ఇసిఇ విభాగంలో ఎ.భరద్వాజ్ 883/900 మార్కులు మూడో ర్యాంకు, ఇఇఇ విభాగంలో కె.విజయప్రకాష్ 865/900 మార్కులతో ర్యాంకులు సాధించారు. 3వ సెమిస్టర్‌లో ఇసిఇ విభాగంలో పి.సాయి పద్మావతి 990/1000 మార్కులు సాధించి 2వ ర్యాంకు, సివిల్ విభాగంలో పి.ప్రవల్లిక 900/874 మార్కులు సాధించి 3వ ర్యాంకు, మెకానికల్ విభాగంలో కె.నవీన్‌సాయి 958/1000 మార్కులు సాధించి 5వ ర్యాంకుల్లో నిలిచారు.

గన్నవరం సమీపంలో రోడ్డు ప్రమాదం

ఐద్వా జిల్లా నేత కుమార్తె మౌనిక దుర్మరణం

తండ్రి ఆంజనేయులకు గాయాలు



మౌనిక (ఫైల్‌పోటో)

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

కృష్ణాజిల్లా గన్నవరం ఆంజనేయస్వామి గుడికి సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, గన్నవరం మాజీ జెడ్‌పిటిసి జయమ్మ దంపతుల కుమార్తె మౌనిక (23) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. ఆర్‌టిసి హైర్ బస్సు మృత్యువు శకటమై ఆమెను నిర్జీవిని చేసింది. ఇదే ప్రమాదంలో మౌనిక తండ్రి ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. మృతురాలి తల్లి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మల్లంపల్లి జయమ్మ శోక సంద్రంలో మునిగిపోయింది. వివరాల్లోకి వెళితే.. బుద్దవరం శివారు రాజీవ్‌నగర్‌లో ఉంటున్న మల్లంపల్లి ఆంజనేయులు సెంట్రింగ్ కార్మికుడు. రెండు దశాబ్దాల నుంచి ప్రజానాట్యమండలిలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం పిఎన్‌ఎం జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కుమార్తె మౌనిక ఎంఫార్మసీ చదువుతోంది. దంత సమస్య రావడంతో పరీక్షలు చేయించుకోవడానికి తండ్రి ఆంజనేయులుతో కలిసి చిన ఆవుటపల్లి దంత వైద్య కళాశాలకు టివిఎస్‌పై బయలుదేరి వెళ్తోంది. గ్రామం వెలుపల ఉన్న ఆంజనేయ స్వామి గుడికి సమీపంలోకి వెళ్లే సరికి అతి వేగంగా దూసుకొచ్చిన ఆర్‌టిసి హైర్ బస్సు వారిని ఢీకొని ముందుకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో మౌనిక తల భాగం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది. ఆంజనేయులు తీవ్ర గాయాల పాలయ్యాడు. మృతురాలు మౌనిక మృత దేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నం

శ్రీకాకుళం, గుంటూరు


కలెక్టరేట్ల వద్ద రైతుల ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న అర్జీదారులు, కలెక్టరేట్ సిబ్బంది
- బాధితులకు న్యాయం చేసేలా ఆయా కలెక్టర్లు ఆదేశాలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం సిటీ/గుంటూరు

శ్రీకాకుళం, గుంటూరు జిల్లా కలెక్టరేట్ల వద్ద సోమవారం ఇద్దరు రైతులు ఆత్మ హత్యాయత్నానికి పాల్పడారు.

శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బాతువా గ్రామానికి చెందిన టంకాల మోహనరంగ ఉద్యోగ ప్రయత్నంలో విఫలమై తనకున్న 1.57 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఆ భూమిని తనకు విక్రయించాలంటూ ఐదేళ్లుగా అదే గ్రామానికి చెందిన రేషన్ డీలరు, టిడిపి నాయకుడు కె.కూర్మారావు ఒత్తిడి చేస్తున్నాడు. ఇందుకు నిరాకరించినందుకు మోహనరంగపై కక్షకట్టాడు. అధికారులపై ఒత్తిడి చేసి బోరుకు విద్యుత్ కనెక్షన్ మంజూరు కాకుండా చేశాడు. దీనిపై బాధితుడు తహశీల్దార్, విద్యుత్ శాఖ అధికారులను కలిసినా, సిఎం కాల్ సెంటర్ 1100కు పలు దఫాలు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రజావాణి అర్జీలను నమోదు చేసే కాల్‌సెంటర్ వద్ద తన వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కిరోసిన్ వాసన రావడంతో అక్కడున్న అర్జీదారులు, సిబ్బంది అప్రమత్తమై అడ్డుకున్నారు. కలెక్టర్ కె.ధనంజయరెడ్డి ఆ రైతును పరామర్శించారు. తన చావుకు తహశీల్దార్, విద్యుత్ శాఖ అధికారులు కారణమని తాను రాసిన లేఖను కలెక్టర్‌కు బాధితుడు ఇచ్చాడు. దీనిపై కలెక్టర్ స్పందించి తహశీల్దార్, విద్యుత్ శాఖ ఎస్ఇతో ఫోన్లో మాట్లాడారు. తక్షణం కలెక్టరేట్‌కు వచ్చి బాధితునితో కలిసి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించాలని, రెండు రోజుల్లో విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు.



మోహనరంగ



ప్రసన్నబాబు

గుంటూరు కలెక్టర్ ఎదుట నాదెండ్ల మండలం బుక్కాపురానికి చెందిన యువ రైతు శివప్రసన్నబాబు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వ్యవసాయంలో అప్పుల పాలయ్యాయని, ఆదుకోవాలని పలు మార్లు అధికారుల్ని కోరినా ఫలితం లేదని చెప్పిన శివబాబు సోమవారం 'మీకోసం'లో కలెక్టర్, అధికారులందరి ఎదుటే ఒంటిపై పెట్రోలు పోసుకున్నాడు. ఉలిక్కిపడిన అధికారులు వెంటనే తేరుకొని అతన్ని వారించటంతో ప్రమాదం తప్పింది. బాధితుడు పదేళ్ల నుండి కొంత సొంత భూమి, మరికొంత కౌలుకు తీసుకొని వివిధ రకాల పంటలు వేస్తున్నాడు. అయితే ప్రతి ఏటా ఏదో ఒక రూపంలో తీవ్ర నష్టాలొస్తున్న క్రమంలో ఇప్పటి వరకూ రూ.8 లక్షల వరకూ అప్పుల పాలయ్యాడు. దీంతో తనకు డైరీ ఫామ్ ఏర్పాటుకు రుణం ఇవ్వాలని ఎన్నో సార్లు అధికారుల్ని కోరాడు. 'మీకోసం'లోనూ పలుమార్లు విన్నవించాడు. అయినా ఫలితం లేదు. ఆర్థిక సాయం అందించాలని సిఎంను కోరగా రూ.25 వేలు మంజూరు చేసినా ఆ ప్రయత్నమూ విఫలమైంది. దీంతో అప్పుల నుండి తేరుకోలేక, తన ఆత్మహత్యతోనైనా ప్రభుత్వం మేల్కొనాలనే ఈ చర్యకు పాల్పడినట్లు చెప్పాడు. ప్రసన్నబాబుతో మాట్లాడిన కలెక్టర్ డైరీ ఫామ్ ఏర్పాటుకు రుణం ఇప్పిస్తామని హామీ ఇస్తూ, వెంటనే దానికి సంబంధించిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు.



శ్రీకాకుళం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సమీక్షిస్తున్న మండలి హామీల కమిటీ చైర్మన్ గాలి ముద్దుకృష్ణమనాయుడు

వనరుల సద్వినియోగానికి సమిష్టి కృషి

గాలి ముద్దుకృష్ణమ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం జిల్లాలో మానవ వనరులతోపాటు ప్రకృతి సిద్ధమైన వనరులన్నింటినీ సద్వినియోగ పరుచుకోవాలని శాసన మండలి హామీల కమిటీ చైర్మన్ గాలి ముద్దుకృష్ణమనాయుడు సూచించారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శాసన మండలి హామీలపై జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సమీక్షించారు. వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బాహుదా వంటి నదులు ఉండడంతో జిల్లా సస్యశ్యామలం కావడానికి ఎన్నో అవకాశాలున్నాయన్నారు. 193 కిలోమీటర్ల పొడవైన సముద్రతీర ప్రాంతం ఉండటంతో అభివృద్ధికి అపార అవకాశాలున్నాయని తెలిపారు. ఖనిజ నిక్షేపాలు పెద్ద ఎత్తున ఉన్నాయని, వీటిని సద్వినియోగ పర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలో నిర్మించ తలపెట్టిన అణు విద్యుత్ కేంద్రం పూర్తయితే ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయని పేర్కొన్నారు. అయితే, నిర్వాసితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకూడదని అన్నారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి పూర్తి బాధ్యతలున్న ఇఒను నియమించేందుకు, మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రభుత్వం సాయపడేలా శాసన మండలి తరపున సూచిస్తామని హామీ ఇచ్చారు. ఆలయానికి ట్రస్టు బోర్డును నియమించాలని సిఎం చంద్రబాబును కోరతామని తెలిపారు.

నాటక అకాడమీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి సత్యనారాయణపురం (విజయవాడ)

విజయవాడ మారుతీనగర్‌లోని మసీదు వీధిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ కార్యాలయాన్ని అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కళారంగాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కళారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. త్వరలో 'మహా నాటక సమ్మేళనం' పేరుతో భారీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.

సంపాదకీయం

శాస్త్రీయ భావాలతో ప్రజల మస్తిష్కాలు 'కలుషితం' అయిపోకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, దాని కాషాయ పరివారం ఈ మూడున్నరేళ్లలో చేయని దారుణం లేదు. శాస్త్ర విజ్ఞానంపై దాడి చేయడం, కుహనా శాస్త్రాలకూ, అశాస్త్రీయ అంశాకు ప్రచారం కల్పించడం, పుక్కిటి పురాణాలనే శాస్త్రాలుగా నమ్మించడానికి ప్రయత్నించడం... ఒకటేమిటి అన్ని రకాల అశాస్త్రీయ అరాచకాలకూ పాల్పడుతున్నారు. ఇందులో సామాన్య హిందూత్వ కార్యకర్తలే కాదు ఎంఎల్‌ఎలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు చివరికి ప్రధాన మంత్రితో సహా పరివారం యావత్తూ నిత్యం పాల్గొనడం చూస్తే ఈ కార్యక్రమం వారి ఎజెండాలో ఎంతటి ప్రాధాన్యత సంతరించుకుందో అర్ధమవుతుంది. అన్నీ వేదాల్లోనే ఉన్నాయష అంటూ ఆధునిక యుగంలో కూడా వేదాలను పట్టుకు వేలాడే ప్రబుద్ధులను గురజాడ వారు హేళన చేస్తే ఆ ప్రబుద్ధులం మేమే నంటూ ప్రధాన మంత్రి నుండి కింది కార్యకర్త వరకు రుజువు చేస్తూ ఉన్నారు. మన పురాణ కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ చేసేవారనీ, గణపతి దానికి ఉదాహరణ అని ప్రధాని అంతటి వాడు సాక్షాత్తూ భారత సైన్సు కాంగ్రెస్‌లోనే ప్రకటించి ఆ గొప్ప వేదికను కలుషితం చేస్తే ఇంక కింది గణం ఊరుకుంటారా? మన వాళ్లు వేల సంవత్సరాల క్రితమే విమానాలు తయారు చేసేశారు అని ఒకాయన అదే సదస్సులో ఏకంగా పత్రమే ప్రవేశ పెట్టాడు. ఇంక చిన్నా పెద్దా కాషాయ కార్యకర్తలు ప్రతిరోజూ వెళ్ల గక్కుతున్న అశాస్త్రీయ అవకతవక వాదనలకు అంతే లేదు.

ఉలిపికట్టె వాదన

తాజాగా అటువంటి వాదనల్లో చేరిపోయింది చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన మానవ పరిణామ సిద్ధాంతం. కొన్ని లక్షల సంవత్సరాల కాలంలో కోతి జాతుల నుంచి మనిషి పరిణామం చెందాడన్న డార్విన్ సూత్రీకరణను కొట్టిపారేశారు కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్. డార్విన్ సిద్ధాంతం అశాస్త్రీయమంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. స్కూళ్లు, కాలేజీల్లో పాఠ్యాశాలుగా ఉన్న డార్విన్ సిద్ధాంతాన్ని తొలగిస్తామని ప్రకటించారు. తిరుగులేని శాస్త్రీయ ఆధారాలతో నిరూపితమైన, అనేక సవాళ్లనూ, అగ్ని పరీక్షలనూ ఎదుర్కొని నిలిచిన డార్విన్ సిద్ధాంతం ఇటువంటి ఉలిపికట్టె గాళ్ల తాటాకు చప్పుళ్లకు అదిరిపోదు, చెదిరిపోదు. డార్విన్ ఆషామాషీగా తన సిద్ధాంతాన్ని సూత్రీకరించలేదు. తన జీవిత కాంలో కొన్నేళ్లపాటు శాస్త్రీయంగా పలు కోణాల్లో పరిశీలించిన మీదట, పలు రుజువులతో జీవ పరిణామ సిద్ధాంతాన్ని నిర్వచించారు. ఆ సిద్ధాంతాన్ని ప్రపంచ సైన్సు సమాజం ఆమోదించింది. ఆ వెలుగులోనే పలు పరిశోధనలు, నిర్ధారణలు సాగుతూనే ఉన్నాయి. అటువంటి ప్రామాణిక సిద్ధాంతాన్ని తప్పుపట్టడానికి సత్యపాల్‌సింగ్ ఎంచుకున్న విధానం మరీ జుగుప్సాకరం. మన పూర్వీకులెవ్వరూ కోతి నుంచి మనుషులుగా రూపాంతరం చెందినట్లు అస్సలు చెప్పనే లేదని విడ్డూరమైన వితండ వాదాన్ని వినిపిస్తున్నారు. ఏ పుస్తకంలోనూ ఏ శాసనాల్లోనూ ఆ విధంగా లేదని అతితెలివి ప్రదర్శిస్తున్నారు. వానరుడు నరుడిగా మార్పు చెందే పరిణామ క్రమాన్ని తాతలు, అమ్మమ్మలు చెప్పరు దానికి శాస్త్రీయ పరిశోధనలు చదవాలన్న ఇంగిత జ్ఞానం కూడా ఈ మంత్రివర్యునికి లేకపోవడమే ఆశ్చర్యం. పైగా తాను సైన్స్ విద్యార్థినని, ఢిల్లీ యూనివర్శిటీలో రసాయ శాస్త్రంలో పిహెచ్‌డి చదివానని చెబుతున్నారంటే ఆయన సైన్సు డిగ్రీపై అనుమానాలు రాకతప్పవు.

బిజెపి అధికారంలోకొచ్చాక ఆర్‌ఎస్‌ఎస్ పరివారం ఏదో ఒక మార్గంలో మతతత్వ భావజాలాన్ని నూరి పోయడానికి ప్రయత్నిస్తోంది. అయితే వారి తిరోగమన భావజాలాన్ని ప్రజల భావజాలంగా మార్చాడానికి విజ్ఞాన శాస్త్రాలు అడ్డొస్తున్నాయి. ఆ అడ్డు తొలగించుకోడానికే వారు విజ్ఞాన శాస్త్రంపై దాడికి దిగుతున్నారు. సత్యపాల్ సింగ్ డార్వినిజంపై దాడి చేస్తుంటే, ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంచాలక్ మోహన్ భగవత్ దేశంలో ఐఐటిలు దండగ అంటున్నారు. అసలు యూనిర్శిటీలే వద్దంటున్నారు. ఆ తానులో ముక్క అయిన ప్రకృతి వ్యవసాయ నిపుణుడుగా భుజకీర్తులు తగిలించుకున్న పాలేకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాలను మూసేయమంటున్నాడు. శాస్త్ర పరిశోధనలు అవసరం లేదంటున్నాడు. వాళ్ల దృష్టిలో వాస్తు, జోతిష్యం, పిల్లి శాస్త్రాలు, బల్లి శాస్త్రాలు.. ఇవే 'శాస్త్రాలు'. వీటిని పట్టుకుని పయనిస్తే మన దేశం తాలిబన్ల ఆఫ్ఘనిస్తాన్‌లాగా అటవిక రాజ్యంగా మారిపోతుంది.

ఇదీ విషయం



కార్పొరేట్ సేద్యం
చూడండిక చోద్యం...
అన్నం పెట్టే నేలపై
విష పురుగుల రాజ్యం!

రైతే రాజన్నారుగా
విగ్రహాలు పెట్టండిక...
కడుపు మండితే మరి
ఆగ్రహాలు చూడండిక!

- కొల్లూరు వెంకట్

ఏపి వెనుకబాటులో ప్రథమ ముద్దాయి ఎవరు?

విశ్లేషణ

మూడున్నరేళ్ల తర్వాత ఇన్నాళ్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నోట కఠోర వాస్తవాలు, కేంద్రంపై కొంత ఆగ్రహం వ్యక్తమైంది. అంతమాత్రానే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ముఖ్యమంత్రిని అభినందించే స్థితిలో లేరు. పైగా గతంలో తొమ్మిదేళ్ల తన పరిపాలనలో తమకు జరిగిన తీవ్ర నష్టానికి ఆగ్రహంతో వున్నారు.

'హైదరాబాద్‌లో కష్టపడి పని చేసి... అక్కడ అభివృద్ధికి తోడ్పాటు ఇచ్చి... తిరిగి ఇక్కడ కష్టపడాల్సి వస్తోంది' జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగ వాక్యాలివి. గతంలో తన తొమ్మిదేళ్ల పాలనలో హైదరాబాద్ అభివృద్ధి గురించి పలుమార్లు ఆయనే చెప్పిన సందర్భాలున్నాయి. ప్రస్తుతమూ వుటంకిస్తున్నారు. అయితే రాష్ట్ర విభజన తదుపరి వెనుకబాటుతనంలో వున్న ఏపి లోటు భర్తీ చేయాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరడం వర్తమానంలో సమంజసంగా కన్పించవచ్చు. అయినా ఒకమారు వెనుతిరిగి వెనుకబాటు తనంలో తన బాధ్యత ఎంత వుందో ముఖ్యమంత్రి ఆత్మావలోకనం చేసుకోకుండా... తను ముద్దాయిగా వుండి కూడా ఇతరులను నిందించడం సరికాదు. ముఖ్యమంత్రి తర్వాతనే మిగతా అందరూ ఎపికి అపకారం చేసిన వారి జాబితాలో వుంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో అసంబద్ధ, అపసవ్య, కేంద్రీకృత విధానాలు అవలంబించినందున సంపద మొత్తం హైదరాబాద్‌లో కేంద్రీకృతమైంది. ఆ రోజుల్లో హైదరాబాద్‌తో పాటు సీమాంధ్రలో కూడా ఏ ఒక్క నగరాన్నైనా ఎందుకు అభివృద్ధి చేయలేదని ఏపి ప్రజలు నేడు నిలదీస్తే ముఖ్యమంత్రి జవాబు చెప్పాల్సిన బాధ్యత వుంది.



వి శంకరయ్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అశాస్త్రీయంగా విభజించినందువల్లనే ఏపి వెనుకబాటుతో వుందని ప్రస్తుతం ముఖ్యమంత్రి చెప్పే కబుర్లకు ఏ మాత్రం ప్రాతిపదిక లేదు. ఆ రోజుల్లో ప్రాంతీయ అసమానతలు లేకుండా ముఖ్యమంత్రి జాగ్రత్తపడి వుంటే రాష్ట్ర విభజన జరిగినా సీమాంధ్ర ఆర్థికంగా, పారిశ్రామికంగా ఇంతగా వెనకబడి వుండేది కాదు. పరిశ్రమలన్నీ హైదరాబాద్ చుట్టే నెలకొల్పారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రతిష్టాత్మక విద్య, వైద్య, వైజ్ఞానిక, శాస్త్రీయ సంస్థలన్నీ హైదరాబాద్‌లోనే నెలకొల్పడం చంద్రబాబు హయాంలోనే జరిగింది. దూరదృష్టి, దార్శనికత వున్న నేతగా చెప్పుకునే ముఖ్యమంత్రి సీమాంధ్ర ప్రాంతంలో ఏ ఒక్క నగరాన్నైనా హైదరాబాద్‌తో సమానంగా కాకున్నా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత విస్మరించి ఈ రోజు బీద అరుపులు అరిస్తే ప్రజలు క్షమిస్తారా?

సీమాంధ్ర ప్రాంతం నుండి పెట్టుబడులన్నీ ఎక్కువ భాగం చంద్రబాబు హయాంలోనే హైదరాబాదుకు తరలి వెళ్లాయనేది వాస్తవం కాదా! హైదరాబాద్‌లో ఆ పాటికే బేగం పేట విమానాశ్రయం వున్నా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చేసిన కృషిలో కొద్ది శాతమైనా వినియోగించి ఓ మోస్తరుగా విజయవాడలో విమానాశ్రయం నెలకొల్పి మౌలిక సదుపాయాలు కల్పించి వుంటే ఏపి ప్రాంతంలో కూడా పరిశ్రమలు విస్తరించేవి. వాస్తవం కళ్ల ముందు కన్పిస్తున్నా ఇప్పటికీ తన తప్పిదాన్ని మరుగు పరచి హైదరాబాద్ అభివృద్ధి తన వలననే జరిగిందని నిత్యం గొప్పలు చెప్పుకుంటే ఆ సమయంలో నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైన సీమాంధ్ర ప్రజల హృదయాలను గాయపరచినట్టే కదా? అశాస్త్రీయ విభజన వల్లనే ఏపి వెనుకబడిందని... సీమాంధ్రులకు సమర్ధత లేక కాదని... నాటి పాలకులదే ఈ పాపమని ముఖ్యమంత్రి ఈ రోజు వక్కాణిస్తుంటే గతంలో తను చేసిన అపకారాన్ని మరుగు పరచడం కాక మరేంటి? ఏపి ప్రజల ప్రమేయం లేకుండా విభజన చేశారని ముఖ్యమంత్రి తరచూ మరో ఆరోపణ చేస్తుంటారు. ఇందులో ఏ మాత్రం పస లేదు. రాష్ట్ర విభజనకు అంగీకరిస్తూ తెలుగుదేశం అధినేతగా రెండు దఫాలు కేంద్రానికి లేఖలు ఇచ్చిన సందర్భం లో బాధ్యతగల నేతగా విభజన ఎలా జరగాలో ఏమైనా సూచించారా? రాష్ట్ర విభజన ఖాయమని తేలిన తర్వాత కూడా ఉమ్మడి రాష్ట్రానికి తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా పదేళ్లు ప్రతి పక్షనేతగా వుండి కూడా ఢిల్లీ వెళ్లి బిజెపి నేతలతో సమాలోచనలు సాగించిన సందర్భంలోగానీ నిరసన దీక్ష పట్టిన సందర్భంలో గానీ రాష్ట్ర విభజనకు శాస్త్రీయమైన ముసాయిదా ఎందుకు సమర్పించలేదు? కేవలం రాష్ట్ర విభజనను అడ్డుకోవడానికి సీమాంధ్రలో హీరోగా నిలిచేందుకు తాపత్రయపడటం వాస్తవం కాదా? ఈ సందర్భంలో అన్ని పాలక పార్టీల నేతలు వహించిన నిర్లక్ష్యమే సీమాంధ్ర పాలిట శాపంగా మారింది. శాస్త్రీయమైన విభజనకు ముఖ్యమంత్రి ముసాయిదా ఇస్తే తెలంగాణ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ ఇబ్బందుల పాలవుతుందని భావించి రెండు కళ్ల సిద్ధాంతంతో పుణ్యకాలం గడిపేసి ప్రస్తుతం ఇతరుల మీద నెపం వేయడం అనుభవజ్ఞుడైన నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు సరికాదు. ఎవరైనా సరే కొంతకాలం కొందరిని మోసం చేయవచ్చు. ఎల్లకాలం అందరినీ మోసం చేయడం కుదరదు. అందుకే మూడున్నరేళ్ల తర్వాత కోర్టుకెళతాననే డైలాగులు ముఖ్యమంత్రి నోట వచ్చాయి. ఇది కూడా ఒక ఎన్నికల స్టంటే. బిజెపి విష కౌగిలి నుండి ముఖ్యమంత్రి బయటపడి ప్రజాతంత్ర శక్తులతో కలిసి పోరాటం సాగిస్తే తప్ప కోర్టుకెళ్లే అవకాశాలు ఏమాత్రం లేవు. కాకుంటే ప్రజలను మాయ చేసేందుకు ఈ ప్రకటనలు పనికొస్తాయి. కేంద్రానికి వ్యతిరేకంగా ఆర్థిక అంశాలలో ముఖ్యమంత్రి కోర్టుకెక్కే సాహసం ఏ మాత్రం చేయలేరు. కేంద్రానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఒక్క పూట కూడా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి 'పైన పటారం లోన లొటారంగా' ఉంది. ప్రతి నెలాఖరుకు రిజర్వు బ్యాంకు వద్దకు వెళితేనే పూట గడుస్తుంది. ఈ మూడేళ్ల కాలంలో కోట్లాది రూపాయలు అప్పు చేస్తే సృష్టించిన ఆస్తులు ఏమీ లేవు. ఈ ఏడు రూ.18,766 కోట్లు అప్పు చేస్తే వడ్డీల కింద (గతంలో చేసిన అప్పులకు కూడా కలిపి) రూ.12,661 కోట్లు చెల్లించవలసి వుంది. అయితే విరివిగా అప్పులు చేసేందుకు ఇతరుల మెప్పు పొందేందుకు తప్పుడు గణాంకాలతో బడ్జెట్ ప్రతిపాదనల రిపోర్టులు సృష్టిస్తున్నారు. అందుకే రెండంకెల వృద్ధి రేటు వున్న రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎందుకని? నీతి అయోగ్ సభ్యులు రాజీవ్ కుమార్ ప్రకటిస్తే ముఖ్యమంత్రితో సహా అందరూ తెల్ల మొహం వెయ్యాల్సి వచ్చింది.

> అశాస్త్రీయ విభజన వల్లనే ఏపి వెనుకబడిందని... సీమాంధ్రులకు సమర్ధత లేక కాదని... నాటి పాలకులదే ఈ పాపమని ముఖ్యమంత్రి ఈ రోజు వక్కాణిస్తుంటే గతంలో తను చేసిన అపకారాన్ని మరుగు పరచడం కాక మరేంటి?రాష్ట్ర విభజన ఖాయమని తేలిన తర్వాత కూడా ఉమ్మడి రాష్ట్రానికి తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా పదేళ్లు ప్రతి పక్షనేతగా వుండి కూడా ఢిల్లీ వెళ్లి బిజెపి నేతలతో సమాలోచనలు సాగించిన సందర్భంలోగానీ నిరసన దీక్ష పట్టిన సందర్భంలో గానీ రాష్ట్ర విభజనకు శాస్త్రీయమైన ముసాయిదా ఎందుకు సమర్పించలేదు?




ప్రత్యేక హోదా ఏ రాష్ట్రానికి చట్టం ద్వారా అమలు జరగకున్నా ఏపి విభజన చట్టంలో ప్రత్యేక హోదా లేదని కేంద్రం అడ్డు చెబితే ముఖ్యమంత్రి మౌనంగా వుండిపోయారు. పైగా ప్రత్యేక హోదాతో సమానంగా కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తే ఎందుకు ఆమోదించకూడదని ప్రతి ఉపన్యాసం లోనూ ఎదురుదాడికి దిగారు. తుదకు ప్రత్యేక ప్యాకేజీ బండారం బయట పడగానే దిగాలు పడిన గొంతుతో నాబార్డు నుండి నిధులు ఇప్పించాలని ముఖ్యమంత్రి కోరుతున్నారంటే పతనావస్థ ఏ స్థితికి చేరిందో ఏపి ప్రజలు గమనిస్తూనే వున్నారు. ప్రత్యేక హోదా ఏ రాష్ట్రానికి ఇవ్వబడదని ప్రకటించిన కేంద్రం దొంగచాటుగా 11 రాష్ట్రాలకు పన్ను రాయితీలు కల్పిస్తూ క్యాబినెట్‌లో తీర్మానం చేసిన తదుపరి మాట మాత్రంగా కూడా ముఖ్యమంత్రి అడగలేకపోయారు. ఇలా చెప్పుకుపోతే రాజధాని, పోలవరమే కాకుండా చట్టబద్ధంగా వెనకబడిన ప్రాంతాలకు లభించాల్సిన ప్రత్యేక ప్యాకేజీ విషయమై కూడా ఏ సందర్భంలోనూ ప్రశ్నించలేకపోయారంటే ముఖ్యమంత్రి దశల వారీగా ఏర్పడిన రాజకీయ బలహీనత, లొంగుబాటుతనం ఈ రోజు కాకున్నా మున్ముందు బహిర్గతం కాక తప్పదు. కాకుంటే శాసనసభ నియోజక వర్గాల పెంపు అంశంపై కోర్టుకు వెళ్చొచ్చునేమో! కమలనాథుల దగ్గర ముఖ్యమంత్రి ఎంతగా లొంగుబాటు ప్రదర్శించారంటే ఎపికి చెందిన విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య సంఘటన దేశం మొత్తం మీద సంచలనం సృష్టించినా కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించ లేకపోయారంటే ఏమనుకోవాలి? రాజధాని శంకుస్థాపన సందర్భంగా వచ్చిన ప్రధాని పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లు తెచ్చి ఇచ్చి వెళ్లిన తదుపరి చిరాకెత్తిన పార్లమెంట్ సభ్యులు జయదేవ్ నిరసన వ్యాఖ్య చేస్తే వెంటనే ముఖ్యమంత్రి పిలిచి అదుపు చేయాల్సి వచ్చింది. కమలనాథుల చెంత ఇంతగా దిగజారి వ్యవహరించినందు వల్లనే నేడు ప్రత్యేక ప్యాకేజీ ప్యాకప్ అయిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టే విధానంలోను వ్యవహార సరళిలోనూ కారణాలు ఏవైనా కేంద్రం వద్ద లొంగుబాటు తనం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. ఇంత జరిగిన తర్వాత కూడా ఇప్పటికైనా ప్రత్యేక హోదా, ఇతర ఆర్థికపరమైన అంశాలపై కేంద్రానికి వ్యతిరేకంగాను, న్యాయపరంగాను, ప్రజా క్షేత్రంలోను, ముఖ్యమంత్రి కార్యాచరణ చేపడితే గత పాపం తుడిచి పెట్టుకున్న వారవుతారు.

(రచయిత విశ్రాంత పాత్రికేయుడు,
సెల్ : 9848394013)

చర్చ

ఛార్లెస్ డార్విన్ సత్యపాల్ సింగ్



'ఓ వానరం మానవుడిగా పరిణామం చెందటం గురించి మన పూర్వీకులెవరూ కూడా అటు లిఖిత పూర్వకంగా కానీ, ఇటు మౌఖికంగా కానీ ఎక్కడా పేర్కొనలేదు. అమ్మమ్మలు, నానమ్మలు తాతయ్యలూ చెప్పిన కథల్లో ఎక్కడా, ఎలాంటి ప్రస్తావన లేదు. కాబట్టి డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం శాస్త్రీయంగా తప్పని' భారత మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయమంత్రి సత్యపాల్‌సింగ్ ఒక సభలో అన్నారు. ఒక సిద్ధాంతాన్ని ఖండించటానికైనా ఆ సిద్ధాంతానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకొని వుండాలన్న ప్రాథమిక జ్ఞానం కూడా లేనివారే ఇలా మాట్లాడుతారు. ఒక సిద్ధాంతానికి సంబంధించిన సమాచారంలోని అసమగ్రత లేదా అస్పష్టత లాంటి వాటిని ఆధారంగా చేసుకొని సిద్ధాంత చర్చలు లేవదీస్తే దాన్ని అర్థం చేసుకోవచ్చు గానీ మన అమ్మమ్మలూ, నానమ్మలూ చెప్పిన కథల్లో దాని వివరణ లేకపోతే, ఆ సిద్ధాంతమే చెల్లదు పొమ్మనేంత జగదేక మూర్ఖులకు ఎవరు సమాధానం చెప్తారు?

డిఎన్‌ఎ, ఆర్‌ఎన్‌ఎ లాంటి సంక్లిష్టమైన విషయాల గురించి చదువుకోని అమ్మమ్మలకూ, తాతయ్యలకూ తెలియదు. అందుకే వీటి ప్రస్తావన వాళ్లు చెప్పే కథల్లో వుండదు. మన పూర్వీకుల రాతల్లో కూడా లేదు. అయితే ఇవి పచ్చి అబద్ధాలని శాసనం చేస్తారా! మహాజ్ఞాని-మంత్రివర్యా మన అమ్మమ్మలు, నానమ్మలు చెప్పే కథల్లో పక్షులు, జంతువులు మాట్లాడుతాయి. అవి నిజంగానే ప్రపంచంలో అలా మాట్లాడుతున్నాయా? పది తలకాయలున్న రాక్షసులూ, పెద్ద పెద్ద పళ్లూ-కోరలు గల వింత ఆకారాల ఊహా చిత్రాలు మన పూర్వీకులు రాసిన-చెప్పిన కథల్లో బండ్ల కొద్దీ వున్నాయి. వాళ్లనెవ్వరైనా-ఎప్పుడైనా బయట చూసిన సందర్భాలున్నాయా? వాళ్లు చెప్పిన కథల్లో-రాసిన రాతల్లో వున్న పాత్రలే నిజమైన ప్రపంచంలో అస్తిత్వంలో లేనప్పుడు ఆ కథలకూ-రాతలకూ విలువ ఎంత? ఇట్లాంటి పుక్కిటి పురాణాల్లాంటి కథల్లో చెప్పనంత మాత్రాన డార్విన్ సిద్ధాంతానికి శాస్త్రీయత లేనట్టా? ఒక సిద్ధాంతానికి శాస్త్రీయత మన అమ్మమ్మలూ, తాతయ్యలూ చెప్పే కథల్లోని ప్రస్తావనల వల్ల వస్తుందా?

అయ్యగారు అంతటితో ఆగినా బాగుండేది. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని తన అపార అజ్ఞాన బలంతో తుత్తునియలు చేశానన్న వీర గర్వంతో దీనికి సంబంధించి పాఠశాల, కళాశాలల కరిక్యులంను మార్చాల్సి వుందని కూడా ప్రకటించి పారేశారు. అధికార మదం అలా వుంటుంది మరి. ప్రపంచం ఒక వైపు శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అందుకోలేనంత వేగంతో ముందుకు వెళ్తుంటే మనం మాత్రం పాత కాలంలోనే సాధించేశాం, అని కాళ్లు బార్లా చాపుకొని కూర్చుందాం.

450 కోట్ల సంవత్సరాల కిందట భూమి ఏర్పడింది. 200 కోట్ల ఏళ్ల విపరీతమైన వేడి కారణంగా ఎలాంటి ప్రాణి ఆవిర్భవించలేదు. 250 నుండి 50 కోట్లు మాత్రమే వుండేవి. ఏడున్నర నుంచి ఇరవై లక్షల మధ్యకాలంలో కోతులు, చింపాంజీలు, గిబ్బన్‌లూ, నర వానరాలూ-వాటి నుండి నియాండర్తల్ మానవులూ అవతరించారని స్థూలంగా డార్విన్ సిద్ధాంతం చెప్పింది. ఈ క్రమాన్నంతా అర్థం చేసుకోకుండా 'కోతుల నుంచి మనిషి పుడతాడా? అని ప్రశ్నిస్తే పోయేది సత్యపాల్‌సింగ్ పరువే కాదు, దేశం పరువు కూడా!

అన్ని మత గ్రంథాలూ-మనిషిని దేవుడే నేరుగా తయారు చేశాడని రకరకాల సృష్టి కథలు రాశాయి. ఛార్లెస్ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతి పాదించడంతో ఆ మతాలకూ-వాటి రాతలకూ విలువలేకుండా పోయింది. డార్విన్ సిద్ధాంతం మీద వాద ప్రతివాదాలు జరిగాయి. చివరికి సత్యమే గెలిచింది. డార్విన్ తదనంతరం జరిగిన పరిశోధనలన్నీ-జీవపరిణామ సిద్ధాంతాన్ని బలపరిచాయి. మతాల నడ్డి విరిచింది కాబట్టే జీవపరిణామ సిద్ధాంతం మీద మతం చాటు బిడ్డలు అప్పుడప్పుడు ఇలా ప్రత్యక్షంగా- పరోక్షంగా దాని మీద దాడికి ప్రయత్నాలు చేస్తుంటారు. ఇలా దాడికి దిగినప్పుడల్లా బయటపడేది ఆ దాడి చేసిన వాడి అజ్ఞానమే. కొసమెరుపేమిటంటే మూర్ఖ శిఖామణులు ఇలా దాడి చేసిన సందర్భాల్లోనే సిద్ధాంతాలు ఇంకొంతమంది ప్రజలకు చేరువవుతాయి.


తోకల రాజేశం, సెల్ : 9676761415

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

ప్రచారం సరే... పథకాలకు నిధులేవీ...

సందర్భం

దేశంలో పేదలకు పౌష్టికాహారం అందించడం, స్త్రీ-శిశు మరణాలను తగ్గించడం, మెరుగైన వైద్యం, విద్య, వయోజన విద్య అందించడం, పేదరిక నిర్మూలన తదితర ఘనమైన లక్ష్యాలతో వివిధ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించాయి. తాము ఈ ఆశయాల కోసం కట్టుబడి ఉన్నామని ప్రచారం చేసుకుంటున్నాయి. కాని అచరణలో ఈ పథకాలకు సరిపడా నిధులను కేటాయించటం లేదు. ఫలితంగా లబ్ధిదారులకు సహాయం తగ్గిపోతున్నది. తద్వారా లక్ష్యాలను పూర్తి చేయాల్సిన ప్రభుత్వమే ఈ పథకాలను నిర్వీర్యం చేస్తున్నది. పథకాలలో పని చేసే ఉద్యోగులు, కార్మికులకు భద్రత లేకుండా చేస్తున్నది. ఈ విధానాలను నిరసిస్తూ నవంబర్‌లో ఢిల్లీలో కేంద్ర కార్మిక సంఘాలు 'మహాపడావ్' నిర్వహించాయి. దానికి కొనసాగింపుగా స్కీం వర్కర్ల దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. 2018-19లో సంవత్సర బడ్జెట్‌లో అవసరమైన నిధుల కేటాయింపు, కనీస వేతనం రూ. 18,000, పెన్షన్ రూ. 3,000లు, పిఎఫ్, గ్రాట్యూటీ, వైద్య సౌకర్యం, పథకాలలో నగదు బదిలీ విధానాన్ని రద్దు చేయాలని, పథకాల ప్రయివేటీకరణ విధానాలు ఆపాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మన రాష్ట్రంలో జనవరి 23న సమ్మె జరగనుంది.



ఎ వి నాగేశ్వరరావు

ఘనమైన లక్ష్యాలు - అరకొర కేటాయింపులు

మోడీ ప్రభుత్వం వివిధ స్కీం లకు బడ్జెట్ తగ్గించింది. అన్ని స్కీంలకు కలిపి మొత్తంగా 2014 -15 కి రూ.2.52 లక్షల కోట్ల నుండి 1.69 లక్షల కోట్లకు తగ్గించింది. (రూ.83 వేల కోట్లు) స్కీంల వారీగా చూస్తే ఐసిడిఎస్‌కి రూ.18,108 కోట్ల నుండి రూ.8,425 కోట్లకు, మధ్యాహ్న భోజన పథకానికి రూ.15,150 కోట్ల నుండి రూ.9 వేల కోట్లకు తగ్గించారు. అనేక పోరాటాల ఫలితంగా ఐసిడిఎస్ కి ఈసంవత్సరం రూ.15 వేల కోట్లు మాత్రం కేటాయించారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలకు చేసిన కేటాయింపులు ప్రజలకు పూర్తి సేవలు అందించడానికి సరిపోవు. అన్ని ప్రభుత్వ పథకాలు ప్రజలకు మెరుగ్గా అమలు చేయటానికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు ప్రభుత్వాలు చేయాలి. కాని ఈ దిశగా ప్రభుత్వ చర్యలు లేవు.

కార్పొరేట్ల ప్రయోజనం కోసమే..

ప్రభుత్వ పథకాలన్నింటినీ ఇస్కాన్, వేదాంత, అక్షయ పాత్ర, అపోలో, పిరామిల్, బివిజి వంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి చేతులు దులుపుకోవాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. తద్వారా కార్పొరేట్ కంపెనీలకు వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కట్టబెడుతున్నాయి. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారు. దేశంలో 4 వేల అంగన్‌వాడీ కేంద్రాలను వేదాంత సంస్థకు అప్పగించారు.అంగన్‌వాడీ సెంటర్లను కుదించి గ్రామ పంచాయితీలకు అప్పగించాలనుకుంటున్నది. నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టి వర్కర్లు, హెల్పర్లు, లబ్ధిదారులందరికీ ప్రభుత్వం తీరని ద్రోహం చేయడానికి పూనుకున్నది. అంగన్‌వాడీ సెంటర్ల మెర్జర్ల పేరుతో ఉన్న ఉపాధికి గండికొడుతున్నది. 40 వేల మంది ఆశాలతో పనిని బట్టి పారితోషికం పేరిట నామమాత్రపు రుసుములతో పని చేయించుకుంటున్నది. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల వ్యవస్థను రద్దు చేసి 13 వేల మంది ఉపాధికి ఎసరు తెచ్చింది. వైద్య, ఆరోగ్య రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూడా ప్రయివేటీకరించేందుకు రంగం సిద్ధం చేసింది. బలవంతంగా కార్పొరేట్ వైద్యం వైపు పేద ప్రజలను బలవంతంగా నెట్టి కార్పొరేట్ యాజమాన్యాలకు లాభాలను చేకూర్చే పని చేస్తున్నది. నేషనల్ హెల్త్ మిషన్, సర్వశిక్షా అభియాన్‌లలో దాదాపు 70 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదు. అతి తక్కువ వేతనాలతో, ఎటువంటి సౌకర్యాలు లేకుండా పని చేయిస్తున్నది.



నేడు స్కీం వర్కర్ల సమ్మె

దయనీయమైన స్కీం వర్కర్ల పరిస్థితి

పలు రకాల పై స్కీంలలో పని చేస్తున్న వర్కర్ల పరిస్థితి దయనీయంగా మారింది. దశాబ్దాల తరబడి పని చేస్తున్నా కార్మికులుగా గుర్తించడం లేదు. 'పార్ట్‌టైం, గౌరవ వేతనం, పారితోషికాలు, మిత్రులు, వాలంటీర్లు' వంటి పేర్లు తగిలించి కనీస వేతనాలు ఇవ్వడంలేదు. అతి తక్కువ వేతనాలతో బండచాకిరి చేయించుకుంటున్నారు. సంబంధం లేని అనేక పనులను చేయిస్తున్నారు. పిఎఫ్, పెన్షన్, ఆరోగ్య సౌకర్యాలతో కూడిన సామాజిక భద్రత కల్పించకుండా ప్రభుత్వాలు వీరితో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయి. అక్షరాస్యత పెరిగిందని, స్త్రీ-శిశు మరణాలు తగ్గాయని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ... అందుకు కారణమైన కార్మికులను పట్టించుకోకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనం. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాలు, సాంఘిక సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని 2013 లో జరిగిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 45 వ సమావేశం తీర్మానించింది. ఈ తీర్మానాన్ని గత యుపిఎ, ప్రస్తుత బిజెపి ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో 7 వ వేతన కమిటీ కనీస వేతనం రూ.17,000 సిఫార్సు చేసింది. కానీ ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వారికి నెలకు రూ.400 నుండి రూ.7,000లలోపు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారు. ఈ నామమాత్రపు వేతనాలను సహితం ప్రతి నెలా చెల్లించడంలేదు. 7-8 నెలలు పెండింగ్ పెడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు 1994లో నిర్ణయించిన గౌరవ వేతనం రూ.400 నేటికీ ఒక్క రూపాయి కూడా పెంచలేదు. స్కీంలలో పని చేస్తున్న ఉద్యోగులను, కార్మికులను ప్రభుత్వం ఉద్యోగుల లెక్కలోనే చూపించడం లేదు. ఒక ఆదర్శ యజమానిగా ప్రభుత్వం పని చేయడం లేదు. కనీస వేతనం, సౌకర్యాలు కల్పించకుండా కార్మికుల శ్రమని ప్రభుత్వమే దోపిడి చేస్తున్నది. మరో వైపు ప్రభుత్వం పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్నది. కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చివేస్తున్నది.


ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలి

స్కీం వర్కర్లు ఐక్యంగా నిర్వహిస్తున్న ఈ సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గం. అంగన్‌వాడీలు ఈ నెల 23న డ్యూటీలో ఉండాలని, ఆ రోజు పౌష్టికాహారం అందించాలని, అలా లేని అంగన్‌వాడీల హాజరు తీసుకుని వెంటనే రాష్ట్ర డైరెక్టరేట్ కి పంపించాలని, సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలను తొలగిస్తామని రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో ఆదేశాలు ఇప్పించడం సిగ్గుచేటు. 22 రోజుల ముందుగా సమ్మె నోటీసు ఇస్తే ఇప్పటి వరకు కనీసం పిలిచి సమస్యలపై చర్చించటానికి ప్రభుత్వానికి తీరికలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి బెదిరింపు చర్యలు మాని పై సమస్యలను ఇప్పటికైన పరిష్కరించాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు కోరుతున్నాయి. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మన రాష్ట్రంలో నేడు నిర్వహించే సమ్మెను బెదిరింపులతో విచ్ఛిన్నం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ కుట్రలను సమ్మెను జయప్రదం చేయడం ద్వారా తిప్పి కొట్టాలని స్కీం వర్కర్లకు విజ్ఞప్తి చేస్తున్నాయి.

(రచయిత ప్రధాన కార్యదర్శి, నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సెల్ : 94900 98031)

జన వాక్యం

పొగాకు కష్టాలు



ఈ ఏడాది కూడా గతంలో మాదిరిగానే రాష్ట్రంలో పొగాకు రైతుల పరిస్థితి దారుణంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. పొగాకు బోర్డు వారు నిర్దేశించిన మేరకే పంట విస్తీర్ణం సాగు చేస్తున్నారు. ఈ ప్రమాదం నుండి బయటపడాలంటే తక్షణం కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులను అరికట్టాలి. పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే పొగాకు రైతు క్షేమంగా ఉంటాడు. అప్పులకు, ఆత్మహత్యలకు దూరంగా హాయిగా ఉండగలుగుతాడు. ఇవేమీ లేకుంటే వారి జీవితాల పాలిట పొగాకు 'పగాకు' గా మారే అవకాశం ఉంది. రైతు బతుకు చితికే ప్రమాదం దాపురి స్తుంది. పాలకులు, బోర్డు అధికా రులు వారి అభివృద్ధికి, సంక్షేమానికి కొత్త సంస్కరణలు చేపట్టాలి. అప్పుడే 'పొగాకు' రైతుల పాలిట 'పసిడి ఆకు'గా మారుతుంది.

టి తులసీమోహన్,
పెదకాకాని.

పల్లె సీమల్లో ఓ పశువుల కాపరి పదం కట్టాడు. జానపదంతో గళం విప్పాడు. మూఢ విశ్వాసాలపైనా, కార్పొరేట్ మాయాజాలంపైనా కదం తొక్కాడు. 'వెలుగు జాడా ఓ గురజాడా..!' అంటూ గురజాడ పుట్టిన నేలపై మోగిన ఆ డప్పు సామాన్యుల బాధలను, సామ్రాజ్యవాద మాయల గురించి తట్టి చెబుతోంది. అదే డప్పుశ్రీను పాట. విజయనగరంలో ఈ పేరుకు పరిచయం అవసరం లేదు. అది ప్రజా ఉద్యమమైనా, సామాజిక సదస్సైనా డప్పు శ్రీను పాట పాడాల్సిందే. సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి, పేదరికంతో చదువుకు దూరమైనా సమాజంలో తనకంటూ ప్రత్యేకత నిలుపుకుంటున్న గంద్రేటి శ్రీనివాసరావు అలియాస్ డప్పు శ్రీను 'జీవన' గమనం ఆయన మాటల్లోనే ..



మూఢవిశ్వాసాలపై గళమెత్తే డప్పు

మాది విజయనగరం జిల్లా మెంటాడ గ్రామం. పేరుకు మండల కేంద్రమైనా గిరిజనులు ఎక్కువగా నివసించే ప్రాంతం మాది. వ్యవసాయ ఆధారిత కుటుంబం. అమ్మానాన్నలు అప్పలరాము, బంగారయ్యకు చదువులేదు. నాకు ఇద్దరు అన్నయ్యలు, ముగ్గురు అక్కలు. అమ్మ పుట్టినిల్లు విజయనగరం కావడంతో పిల్లల్ని బాగా చదివించాలనే తపన ఉండేది. కానీ మా అన్నయ్య అప్పలనాయుడును మాత్రమే చదివించారు. ఆర్థిక ఇబ్బందులతో నా చదువు అర్ధాంతరంగా ఆగిపోయింది.

పశువుల కాపరిగా మొదలైన పాట

మెంటాడ హైస్కూల్లో ఏడో తరగతి ఫెయిలయ్యాక వ్యవసాయ పనుల్లో నాన్నకు సాయంగా చదువు మానేయాల్సి వచ్చింది. పగలంతా పశువులు కాస్తూ, వ్యవసాయం చేస్తూ, రాత్రిళ్లు కోలాటం నేర్చుకునేవాడిని. అప్పటికే మా పెదనాన్న, మా అన్నయ్య పాటలు పాడేవారు. వారి నుంచి పాటలు పాడడం నాకు అలవాటయ్యింది. హైస్కూల్ పక్కనే ఉండడంతో నేను పశువులు కాస్తూ పాడుతున్న పాటలు పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు వినిపించేవి. ఓ రోజు నా పాట విన్న పల్లె తిరుపతిరావు మాస్టారు నా దగ్గరకు వచ్చి, నన్ను మెచ్చుకున్నారు. అప్పటి నుంచీ నాతో స్కూల్లో పాటలు పాడించేవారు. నాకు కొత్తకొత్త పుస్తకాలు ఇచ్చి, చదివించేవారు. పాటలతో పాటు పుస్తకాలు చదవడం అలవాటైంది.

జనవిజ్ఞాన వేదిక వైపు

పల్లె తిరుపతిరావు మాస్టారు జనవిజ్ఞాన వేదిక నాయకులుగా ఉండడంతో నన్ను ఆ కార్యక్రమాలకు పిలిచేవారు. అప్పుడే డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో కర్నూలులో జరిగిన శిక్షణా తరగతులకు నన్ను పంపించారు. మాట, పాట, మ్యాజిక్ అన్న అంశాలపై వందేమాతరం శ్రీనివాస్ బృందం మాకు శిక్షణ ఇచ్చింది. కొన్నాళ్ళ తర్వాత తిరుపతిరావు మాస్టారు అనారోగ్యంతో మృతి చెందారు. గుర్లగెడ్డలో జరిగిన ఆయన అంత్యక్రియల్లో వందలాది మంది ప్రజలు, జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు. ఆ సమయంలో 'సమాజ సేవ చేసే నిస్వార్థ నేస్తమా... ఐదు పదులు దాటకుండా అకాల మరణమా' అంటూ నేను రాసి, పాడిన పాటకు అంతా కంటతడి పెట్టారు. అప్పుడే జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎంవిఆర్ కృష్ణాజీ, ఎమ్‌విఎన్ వెంకట్రావు నన్ను సంఘంలోకి ఆహ్వానించారు. ప్రస్తుతం సాంస్కృతిక విభాగంలో రాష్ట్ర బాధ్యతలు చూస్తున్నాను.



ప్రజానాట్యమండలితో అనుబంధం

జనవిజ్ఞాన వేదికలో పనిచేసేందుకు విజయనగరం వచ్చిన నాకు ప్రజానాట్యమండలి, ప్రజా సంఘాలు నాకు వెన్నుదన్నుగా నిలిచాయి. సాహితీస్రవంతి, ప్రజాశక్తి నాపై చాలా ప్రభావం చూపాయి. లెక్కలేనన్ని కార్యక్రమాల్లోనూ, ఉద్యమాల్లోనూ పాటలు పాడాను. ఎక్కువగా గంటేడు గౌరినాయుడు, దాశరథి పాటలు పాడాను. ప్రజా కవులు సమస్యలపై రాసిన అనేక పాటలు పాడాను. నా భార్య నిర్మల ప్రోత్సాహం నా పాటలకు ఎంతగానో దోహద పడింది. నేను రాసిన పాటను మొట్టమొదట నిర్మలకే చూపించి, అభిప్రాయం తెలుసుకునేవాడిని. పొట్ట కూటికోసం ప్రతి సామాజిక, వాణిజ్య కార్యక్రమాల్లోనూ పాటలు పాడడం మొదలుపెట్టాను.



ఇద్దరు పిల్లల్ని అలాగే చదివించాను. అంటూ తన జీవితంలో పాట పాత్రను వివరించాడు.

డప్పు శ్రీనుగా

డప్పు కొడుతూ పాటలు పాడిన వారు అరుదుగా ఉంటారు. కానీ నేను డప్పు కొడుతూ.. పాట పాడడం జరుగుతోంది. దీంతో నన్ను అందరూ 'డప్పు శ్రీను' అని పిలవడం మొదలుపెట్టారు. సమైఖ్యాంధ్ర ఉద్యమంలో ఊరూరా తిరిగి పాటలు పాడాను. ఢిల్లీలోనూ జిల్లా తరుపున పాటలు పాడేందుకు వెళ్లాను. చత్తీస్‌ఘడ్‌లో ఏర్పాటు చేసిన తెలుగు మహాసభల్లో ప్రదర్శనలు ఇచ్చాను. మద్రాసులో తెలుగు అకాడమీ వారు ఏర్పాటు చేసిన గిడుగు రామ్మూర్తి తెలుగుభాషా దినోత్సవంలో పాల్గొని, ప్రదర్శనలిచ్చాను.

పాటల రచన

'వెలుగు జాడ... ఓ గురుజాడ!' అనే పాటను తొలిసారిగా రాసి, పాడాను. ప్రస్తుతం ఈ పాటను గురజాడ శతజయంతి వేడుకల్లో ప్రతిసారీ పాడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ పాటను అనువదించి, పాడడం జరుగుతోంది. గురజాడ పాటతో ప్రారంభమైన నా పాటల రచన అనేక సామాజికాంశాలపై సాగింది. సెల్‌ఫోన్‌పై, పెప్సీ, కోకోకోలా, కొవ్వాడ అణు రియాక్టర్లపై, పెద్దనోట్ల రద్దు, జియో సిమ్ము వంటి అనేక సామ్రాజ్యవాద పోకడలపై ఇలా అనేక పాటలు రాసి, పాడాను. 'జన జాగృతిపై జానపద గుండె చప్పుళ్లు', 'మార్పు రేపటి కోసం' అన్న ఆల్బమ్స్ రికార్డు అయ్యాయి.

ప్రోత్సాహకాలు

యువజనోత్సవాల్లో (2005) వైఎస్ రాజశేఖరెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నాను. హైదరాబాద్‌లో ఠాగూర్ నృత్యోత్సవానికి టైం కీపర్‌గా పనిచేశాను. అప్పటి తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య పురస్కారం అందించారు. సిబిఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఓ ప్రైవేటు కార్యక్రమంలో నా పాటను ప్రశంసించారు. ప్రతి ఏటా జరిగే విజయనగరం ఉత్సవాల్లో నా పాట కచ్చితంగా ఉంటుంది.

మౌనం వీడాలి



ప్రజాసాహిత్యం జనబాహుళ్యంలోకి వెళ్లాలి. సమాజ గమనాన్ని మార్చడానికి పాట ప్రధాన ఆయుధం. నాటి గరిమెళ్ల నుంచి నేటి గంటేడు గౌరినాయుడు వరకూ ప్రజల కోసం రాస్తున్న అనేకమంది రచయితలను స్ఫూర్తిగా తీసుకోవాలి. సమాజాన్ని సమూలంగా మార్చకపోయినా, ఆలోచనలు రేకెత్తించే రచనలు సమాజానికి కావాలి. నేటితరం అటువంటి రచనలపై దృష్టి పెట్టాలి. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న రోజులివి. ఈ సమయంలో మేధావులు మౌనం వీడాలి. రచనలతో చాంధసవాదుల భరతం పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- డప్పు శ్రీను

వి. నాగరాజు, విజయనగరం.

ఆడబిడ్డకు ఊరంతా అండగా!



కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే చాలు భూమ్మీదకు రాకుండానే చిదిమేస్తున్న సమాజమిది. ఆడపిల్లగా భూమ్మీద పడినా చివరికి ఏ చెత్త కుండీలోనో పడేస్తున్న అమానుష సంస్కృతి రాజ్యమేలుతోంది. అలాంటి పరిస్థితికి భిన్నంగా అమ్మాయి పుడితేచాలు అపురూపంగా చూసుకునే ఓ గ్రామం మన దేశంలోనే ఉంది. ఆ గ్రామంలో ఎవరికైనా అమ్మాయి పుడితే ఆ గ్రామ ప్రజలంతా కలిసి 31,000 రూపాయలు ఆ అమ్మాయి పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారు. ఈ విషయం మీకు ఆశ్చర్యంగా ఉంది కదూ! దాన్ని గురించి తెలుసుకోవాలంటే మనం రాజస్థాన్ వెళ్లాల్సిందే.



రాజస్థాన్‌లోని రాజ్‌సమంద్ జిల్లాలోని పిప్లాంత్రి అనే గ్రామం 2006 నుంచి ఈ సాంప్రదాయాన్ని పాటిస్తోంది. దీంతో ప్రపంచ దేశాలన్నింటికీ ఓ మంచి సందేశం ఇస్తోంది. ఆ ఊర్లో ఎవరికైనా అమ్మాయి పుట్టిందని తెలిస్తే చాలు ఊరంతా కలిసి ఆ అమ్మాయి పేరు మీద 111 చెట్లు నాటుతారు. ఇందులో వేప, ఉసిరి, మామిడితో పాటు కలబంద చెట్లు కూడా ఉంటాయి. ఆ అమ్మాయి ఎదిగిన కొద్దీ ఈ చెట్ల నుండి వచ్చే ప్రతి పైసా ఆ అమ్మాయికే దక్కేలా ముందుగానే వీలునామా రాసిపెడతారు.

అంతేకాదు అమ్మాయి పుడితే ఊరంతా కలిసి రూ. 21,000 లు జమచేసి, ఆ అమ్మాయి తల్లిదండ్రుల నుంచి రూ. 10,000 వసూలు చేసి, మొత్తం రూ.31,000 ఆ అమ్మాయి పేరు మీద బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారు. ఆ మొత్తాన్ని ఆ అమ్మాయి పెళ్ళికి మాత్రమే డ్రా చేసేలా అఫిడవిట్ రాస్తారు. మరో విషయం ఏమిటంటే ఆ అమ్మాయి ఇష్టప్రకారమే ఆమె పెళ్లినీ ఎవరితో చేయాలన్నదీ నిర్ణయిస్తారు.

ఈ నియమాన్ని ఈ గ్రామంలో ప్రవేశపెట్టింది శ్యామ్ సుందర్ పలివాల్ అనే గ్రామస్థుడు. వయస్సుకొచ్చిన తన కూతురు ఆకస్మికంగా చనిపోవడంతో కలత చెందిన పలివాల్ ఈ నియమాన్ని తీసుకొచ్చారు. ఆ గ్రామస్తులంతా ఈ నియమాన్ని గౌరవిస్తూ, తమ గ్రామంలో ఆడపిల్లలు పుట్టడాన్ని మహద్భాగ్యంగా భావిస్తూ దానిని కొనసాగిస్తున్నారు. ★

మీ కోసం



అల్యూమినియమ్ గిన్నెలు నల్లబడితే అందులో యాపిల్ తొక్కలు, నీళ్ళు పోసి కొద్దిసేపు మరగనిస్తే తళతళలాడతాయి.

జీవన సౌరభం

అర్ధరాత్రి ఆకలేస్తుందా?

మన చుట్టూ ఉన్న ఏవో కొన్ని అవరోధాలు మనల్ని ఆపుతాయనుకుంటే అది భ్రమ... ఆ భ్రమల్ని తొలగించి చూస్తే ఏ అవరోధమూ కనిపించదు.

కారణం ఏదైనాకానీ కొందరు అర్ధరాత్రివరకూ మేల్కొని ఉంటారు. అలాంటప్పుడు ఆకలేస్తే ఏదో ఒకటి తినడం మామూలే. కానీ ఆ విషయంలో చాలా జాగ్రత్తగా ఆహారం ఎంచుకోవాలంటున్నారు నిపుణులు. జీర్ణశక్తి అత్యంత తక్కువగా ఉండే సమయం అది. కాబట్టి క్యాలరీలు, నూనెలు, కొవ్వులూ తక్కువగా ఉండే ఆహారాన్ని ఎంచుకోవాలి.

పెరుగు: ప్రొటీన్లు పుష్కలంగా లభిస్తాయి. జీర్ణశక్తికి దోహదపడే ప్రో-బయోటిక్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఏ సమస్యా ఉండదు. క్యాలరీల సమస్యే లేదు. చల్లదనం వల్ల కాస్త చురుగ్గానూ అనిపిస్తుంది.

కీరా, క్యారెట్: కీరాలో 96 శాతం నీరు ఉంటుంది. ఆకలి అదుపులో ఉండి, కడుపునిండిన భావన కలుగుతుంది. పైగా శరీరంలోని నీటిశాతం తగ్గదు. అర్ధరాత్రి మేల్కొని ఉండటం వల్ల కళ్ళ ఎర్రబడడం, వేడిచేయడం వంటి సమస్యల్ని తగ్గించొచ్చు. సన్నగా తరిగిన క్యారెట్లు కూడా ఇదే ఫలితాన్నిస్తాయి.

గుడ్లు: ఉడకబెట్టుకుని తినేయడం మంచిది. పోషకాలు పుష్కలంగా అందుతాయి. అప్పటికప్పుడే ఆకలి తీరుతుంది. చక్కగా ఆమ్లెట్ వేసుకోవచ్చు, కానీ నూనె కాస్తంత తక్కువగా వాడాలి.

పాప్‌కార్న్: ఉప్పు శాతం ఎక్కువగా ఉండే బంగాళాదుంప చిప్స్ కన్నా పాప్‌కార్న్‌కి ప్రాధాన్యం ఇవ్వండి. వాటిని ఇంట్లోనే తయారుచేసుకుని, కొద్దిమాత్రంగానే ఉప్పు చల్లుకోండి. క్యాలరీల సమస్యా ఉండదు.. తేలిగ్గా అరుగుతాయి. ★



నిమ్మతో మచ్చలు మాయం



కొందరి ముఖంపై నల్లటి మచ్చలు ఉంటాయి. అవి మానసికంగా ఎంతో బాధిస్తుంటాయి. మచ్చల్ని పోగొట్టుకునేందుకు రకరకాల కెమికల్స్ ఉన్న క్రీముల్ని వాడుతుంటారు. అయితే ఈ నల్లటి మచ్చల్ని పోగొట్టడానికి నిమ్మరసమే సరైన ఔషధం అంటున్నారు నిపుణులు.

➤ విటమిన్స్‌లోపం, శరీరంలో మినరల్స్ తక్కువగా ఉండటం, సూర్యకిరణాలు ముఖంపై పడటంవల్ల ముఖంపై మచ్చలు వస్తాయి. దీంతోపాటు మానసిక ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యత, చీటికిమాటికి ట్యాబ్లెట్లు, మందులు వాడటం, పొంగు, ప్రెగ్నెన్సీ వల్ల ముఖంపై మచ్చలు ఏర్పడతాయి.

➤ ముఖాన్ని మొదట గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి. తర్వాత రెండు కప్పుల నీటిని వేడిచేసి ఆ నీటిలో కొన్ని చుక్కల నిమ్మరసాన్ని కలపాలి. ఆ నీళ్లు చల్లారిన తర్వాత మచ్చలున్న చోట్ల అప్లై చేయాలి. అరగంట తర్వాత ముఖాన్ని గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. అలా కొన్నాళ్లు చేస్తే చక్కటి ఫలితం వస్తుంది.

➤ ముఖంపై మచ్చలున్నచోట నేరుగా నిమ్మరసాన్ని అప్లై చేయాలి. బాగా ఆరిన తర్వాత ముఖాన్ని చల్లటి నీటితో కడిగేయాలి.

➤ నిమ్మరసానికి తగినంత పసుపు కలిపి పేస్ట్‌గా చేసుకుని ప్రతిరోజూ మచ్చలుండే ప్రాంతంలో అప్లై చేయటంవల్లా మచ్చలు తగ్గుముఖం పడతాయి.

➤ టేబుల్ స్పూన్ తేనెకి, ఐదు చుక్కల నిమ్మరసం కలిపి ముఖంలోని నల్లని మచ్చలకు పట్టించాలి.

➤ ముఖంపై కాస్త చల్లగా ఉన్నట్లు అనిపించాలంటే దోసకాయ రసం, నిమ్మరసం కలిపి మచ్చలకి అప్లై చేయాలి. ఇలా కొన్నాళ్లు చేస్తుంటే మంచి ఫలితాన్ని చూడవచ్చు.

నిమ్మ చౌకగా దొరికే ఫలం. అందరికీ అందుబాటులో ఉండే ఇంటి చిట్కా. ★

సెన్సెక్స్ ⬆ 286
35,798

నిఫ్టీ ⬆ 71
10,966

రూపాయి ⬇ 02 పై.
అమెరికా డాలరుకు రూ.
63.87



ప్లనోన్ విస్తరణ..

ప్లనోన్ ఇండియా 10వ వార్షికోత్సవం సందర్భంగా తమ ఇన్నోవేషన్ హబ్‌ను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఇంటిగ్రేటెడ్ వర్క్‌ప్లేస్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్‌ను అందించే తమ సంస్థ భారత్‌లో తమ కార్యకలాపాలను పెంచుతున్నట్లు ప్లనోన్ సిఇఒ పెర్రీ గెలెన్ పేర్కొన్నారు.



ఆసియన్ మంత్రుల భేటీ..

సోమవారం న్యూఢిల్లీలో ఆసియన్- ఇండియా బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మీట్ అండ్ ఎక్స్‌పో జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు ఆసియా దేశాల మంత్రులతో చేతులు కలిపారు. ఇందులో పలు ఆర్థిక ఒప్పందాలు చేసుకోవడం ద్వారా ఆసియా దేశాల మధ్య రాజకీయ తత్సంబంధాలు పెంచుకోవాలనేది ప్రధాన ఉద్దేశ్యం.

యాక్సిస్ బ్యాంకు లాభాల్లో 25% వృద్ధి

ముంబయి : ప్రముఖ ప్రయివేటు రంగ విత్త సంస్థ యాక్సిస్ బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 25 శాతం వృద్ధితో రూ.726 కోట్ల లాభాలు సాధించింది. నికర వడ్డీపై ఆదాయం మెరుగైన లాభాలకు దోహదం చేసింది. 2016-17 ఇదే క్యూ3లో రూ.579 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 9 శాతం పెరిగి రూ.4,730 కోట్లుగా చోటు చేసుకుంది. ఇతర ఆదాయం మాత్రం రూ.3,400 కోట్ల నుంచి రూ.2,590 కోట్లకు తగ్గింది. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 5.9 శాతం నుంచి 5.28 శాతానికి దిగివచ్చాయి. సోమవారం నిఫ్టీలో యాక్సిస్ బ్యాంకు షేర్ 3.61 శాతం పెరిగి రూ.611.55 వద్ద ముగిసింది.

ఐదు నిమిషాల్లో 'ఫార్మాసీ' డిజిటల్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



మీడియాతో మాట్లాడుతున్న మాధవ్, సురేష్

టార్నియా టెక్నాలజీ సోలుషన్స్ లిమిటెడ్ తెలుగు రాష్ట్రాలలోని రిటైల్ ఫార్మసీల కోసం గో డిజిటల్ కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ ప్రోగ్రాం లో భాగంగా రిటైలర్లు ఆన్‌లైన్‌లో తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చని ఆ సంస్థ సహ వ్యవస్థాపకులు మాధవ్ సీతారామన్, సురేష్ సత్యమూర్తి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ చిన్నపాటి ఫార్మసీని కేవలం అయిదు గంటలలో పూర్తిగా డిజిటల్ ఫార్మసీగా మార్చవచ్చన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న చిన్న పాటి ఫార్మసిలు కూడా ఒక సరసమైన ధరకే అత్యుతమ టెక్నాలజీ ఉపయోగించే దిశగా తీసుకురావాలనే ఒక ముఖ్య ఉద్దేశంతో టార్నియా పని చేస్తుందన్నారు. ఇప్పటి వరకు టార్నియా దేశవ్యాప్తంగా 31 లొకేషన్స్‌లో ఈ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ప్లంబింగ్ పైపుల తయారీలోకి హెచ్ఎస్ఐఎల్



హైదరాబాద్ : ప్రముఖ శానిటరీవేర్ కంపెనీ హెచ్ఎస్ఐఎల్ ప్లంబింగ్ పైపుల విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హెచ్ఎస్ఐఎల్ లిమిటెడ్ ఎండి సందీప్ సోమానీ మాట్లాడుతూ తెలంగాణలోని మెదక్ జిల్లాలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇది 30వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. 2020 నాటికి 60 వేల మెట్రిక్ టన్నులకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మరో లక్షన్నర కోట్ల దెబ్బ

బ్యాంకులకు మొండి బాకీల భారం
ఏడాదిలోనే పెరుగొచ్చు
వచ్చే మార్చి నాటికి మొత్తం 9.5 లక్షల కోట్లు
ఎఆర్‌సిలకు విస్తృతావకాశాలు



అసోచామ్-క్రిసిల్ రిపోర్టు

న్యూఢిల్లీ : భారత బ్యాంకింగ్ రంగాన్ని మొండి బాకీలు తీవ్ర సతమతం చేస్తున్నాయి. వచ్చే మార్చి ముగింపు నాటికి బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా రూ.9.5 లక్షల కోట్లకు చేరనున్నాయని అసోచామ్-క్రిసిల్ ఒక సంయుక్త రిపోర్టులో అంచనా వేశాయి. గతేడాది ఇదే మాసం ముగింపు నాటికి బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.8 లక్షల కోట్లుగా ఉన్నాయని ఈ రిపోర్టు పేర్కొంది. దీంతో పోల్చితే ఒక్క ఏడాదిలోనే బ్యాంకుల మొండి బాకీలు రూ.1.5 లక్షల కోట్లు ఎగిశాయి. మొండి బాకీల పరిష్కారంలో భాగంగా అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీల(ఎఆర్‌సి)లకు విస్తృతావకాశాలు లభించనున్నాయి. అదే విధంగా వాటికి సరిపడ మూల ధనం లేకపోవడం వల్ల ఎఆర్‌సిలు కూడా అనుకున్న స్థాయిలో పెరుగుదలను నమోదు చేయకపోవచ్చని ఈ రిపోర్టు పేర్కొంది. జూన్ 2019 నాటికి వీటి వృద్ధి 12 శాతం తగ్గొచ్చని అంచనా వేసింది.

ఒత్తిడి ఆస్తులు 11.5 లక్షల కోట్లు

2018 మార్చి ముగింపు నాటికి బ్యాంకుల స్థూల ఎన్‌పిఎ రూ.9.5 లక్షల కోట్లకు చేరొచ్చని, మొత్తం అడ్వాన్సుల్లో వీటి మొత్తం 10.5 శాతంగా ఉండొచ్చని విశ్లేషించింది. కాగా మొత్తం ఒత్తిడిలో ఉన్న ఆస్తులు విలువ ఏకంగా రూ.11.5 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. 2017 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంకుల జిఎన్‌పిఎ రూ.8.5 లక్షల కోట్లుగా ఉందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ సుక్లా ఈ మధ్య కాలంలోనే పార్లమెంట్‌కు తెలిపిన విషయాన్ని ఈ రిపోర్టు గుర్తు చేసింది.

కేటాయింపుల భారం..

మొండి బాకీల కోసం బ్యాంకులు అధిక కేటాయింపులు చేయాల్సి రావొచ్చని ఈ రిపోర్టు పేర్కొంది. అదే విధంగా ఈ పారు బకాయిలను విక్రయించడానికి మరింత డిస్కౌంట్లు అందించాల్సి రావొచ్చు. మార్కెట్‌లో ఉన్న మొండి బాకీలను కొనుగోలు చేయడానికి ఎఆర్‌సిలకు ప్రస్తుతం ఉన్న మూలధన స్థాయి మద్దతు చేయలేదు. రుణ రికవరీ విధానాన్ని మెరుగు పర్చాల్సిన అవసరం ఉంది. ఎఆర్‌సిల రికవరీ రేటు సూచీలు మెరుగ్గా ఉన్నాయని రిపోర్టు పేర్కొంది. రికవరీ నిష్పత్తి ఇది వరకున్న 38 శాతం నుంచి ప్రస్తుతం 44-48 శాతానికి చేరింది.

ఆ రంగాలే గుదిబండ

మొత్తం 50 మొండి బాకీల ఆస్తుల విలువ 40 శాతంగా ఉంది. ముఖ్యంగా లోహ, నిర్మాణ, విద్యుత్ రంగాల మొండి బాకీల విలువ వరుసగా 30 శాతం, 25 శాతం, 15 శాతంగా ఉన్నాయి. మిగితా రంగాల మొండి బాకీలు 30 శాతం విలువ చేస్తాయి. బ్యాంకు దివాలా చట్టం (ఐబిసి) వల్ల రికవరీ కొంత వేగంగా ఉండొచ్చని ఈ రిపోర్టు పేర్కొంది. ఇది వరకు మొండి బాకీల వసూల్లు క్లిష్టంగా ఉండేవని రిపోర్టు తెలిపింది. ఐబిసి బ్యాంకింగ్ పరిశ్రమ పటిష్టతకు మద్దతు చేయనుందని పేర్కొంది. 2018లో బ్యాంకింగ్ పరిశ్రమలో మరిన్ని సంస్థాగత మార్పులు చోటు చేసుకోవచ్చని అంచనా వేసింది.

హావెల్స్ ఇండియా లాభాలు రూ.194 కోట్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ హావెల్స్ ఇండియా 2017 డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో 27 శాతం వృద్ధితో రూ.194.36 కోట్ల నికర లాభాలు సాధించింది. 2016 ఇదే అక్టోబర్-డిసెంబర్ కాలంలో రూ.152.97 కోట్ల లాభాలు నమోదు చేసింది. గత క్యూ3లో కంపెనీ మొత్తం ఆదాయం రూ.1,650 కోట్ల నుంచి రూ.1,993.53 కోట్లకు చేరింది. జిఎస్‌టి పన్ను విధానం వల్ల విద్యుత్ ఉపకరణాలపై పన్ను తగ్గిందని, ఇది తమ మెరుగైన ఫలితాలకు దోహదం చేసిందని హావెల్స్ ఇండియా ఛైర్మన్ అనీల్ రాయ్ గుప్తా పేర్కొన్నారు. సోమవారం బిఎస్ఇలో ఈ కంపెనీ షేర్ 0.95 శాతం పెరిగి రూ.552.15 వద్ద ముగిసింది.

రూ.769లకే విమానయానం : స్పైస్‌జెట్

న్యూఢిల్లీ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్పైస్‌జెట్ ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. 'గ్రేట్ రిపబ్లిక్ డే సేల్' పేరుతో ఎంపిక చేసిన రూట్లలో రాయితీ ప్రయాణాలు కల్పిస్తున్నట్లు పేర్కొంది. రూ.769 నుంచి ఈ టికెట్ ధరలు ప్రారంభం అవుతాయని ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఆఫర్‌లో టికెట్ బుకింగ్స్ జనవరి 22 నుంచి జనవరి 25వ తేదీ వరకు చేసుకోవచ్చు. ఈ ఏడాది డిసెంబరు 12 వరకు ప్రయాణాలకు ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపింది. దేశీయంగా ఒక వైపు ప్రయాణానికి 769 రూపాయలకు, అంతర్జాతీయ రూట్లలో ప్రారంభ ధర రూ.2.469గా నిర్ణయించింది.

ఎయిర్‌టెల్ ప్లాన్లలో మార్పులు

న్యూఢిల్లీ : ప్రముఖ టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ తాజాగా రెండు ప్లాన్లలో మార్పులు చేసింది. రూ.399 ప్యాక్ వాలిడిటీని 70 రోజుల నుంచి 84 రోజులకు పెంచింది. దీంతో ఈ ప్యాక్‌పై 84 రోజుల పాటు రోజుకు 1జిబి 3జి లేదా 4జి డేటా, అపరిమిత లోకల్, ఎస్‌టిడి రోమింగ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లను అందిస్తున్నట్లు తెలిపింది. అదేవిధంగా 149 రూపాయల ప్యాక్‌పై ఇక నుంచి రోమింగ్‌పై కూడా అపరిమిత కాల్ ప్రయోజనాలను అందించనున్నట్టు ఎయిర్‌టెల్ పేర్కొంది. ఈ ప్యాక్‌పై ఇప్పటి వరకు ఎయిర్‌టెల్ టూ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌కు మాత్రమే అపరిమిత కాల్స్‌ను ఆఫర్ చేసేది. అదేవ విధంగా 28 రోజుల పాటు 1జిబి డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లను ఉచితంగా ఉపయోగించుకోవచ్చును.

టెట్ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

'సెంటూరియన్' అంటే ఎవరు ?



ఎవిపి.రాజు
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

భారతదేశ చరిత్ర - మధ్యయుగం

1. మహ్మద్-బిన్-తుగ్లక్ తన రాజధానిని ఎక్కడ నుంచి ఎక్కడకు మార్చారు ?

మహ్మద్-బిన్-తుగ్లక్ అధికారంలోకి రాగానే చాలా వివాదాస్పదమైన నిర్ణయం తీసుకున్నాడు. క్రీ.శ 1327లో తన రాజధానిని ఢిల్లీ నుంచి దౌలతాబాద్ లేదా దేవగిరి అనే పట్టణానికి మార్చాలని నిర్ణయించాడు. ఈ నిర్ణయానికి ప్రధానంగా రెండు కారణాలున్నాయి.

1. సుల్తాను సామ్రాజ్యం విపరీతంగా విస్తరించడం వల్ల సామ్రాజ్యంలో ఒక మూల ఉన్న ఢిల్లీ నుంచి మొత్తం సామ్రాజ్యాన్ని అదుపు చేయడం కష్టమైపోయింది.
2. విశాలమైన దక్కనుప్రాంతం కొత్తగా ఢిల్లీ సుల్తానుల రాజ్యంలో చేరింది. దక్కనులోని సామంత రాజులు ఏమాత్రం అవకాశం దొరికినా సుల్తానులపై తిరుగుబాటు చేసేవారు. కప్పం చెల్లించకుండా ఎగ్గొట్టేవారు. సామంతరాజులను తొలగించి ముస్లిం ప్రతినిధులను నియమిస్తే వారు కూడా ఢిల్లీ సుల్తాను నుంచి స్వాతంత్ర్యం ప్రకటించుకోడానికి ప్రయత్నం చేశారు. దీంతో విసిగిపోయిన సుల్తాను ఢిల్లీ నుంచి దక్కను పీఠభూమిని అదుపు చేయడం అసాధ్యం అన్న నిర్ణయానికి వచ్చేశాడు. అందువల్ల రాజధానిని ఢిల్లీ నుంచి దేవగిరికి మార్చాలని నిర్ణయించాడు.

2. తుగ్లక్ పాలనలోని ముఖ్యాంశాలు

తుగ్లక్ భారత ద్వీపకల్పం లోని ప్రాంతాలను జయించి తన సామ్రాజ్య విస్తరణకు నడుంకట్టాడు. దక్షిణ ప్రాంతాలపై పట్టు కొరకు తన రాజధానిని ఢిల్లీ నుండి దేవగిరి కి మార్చాడు. ఢిల్లీ నుండి 700 మైళ్ళ దూరాన దక్కను లోగల దేవగిరిని, దౌలతాబాదు గా పేరుమార్చి రాజధానిగా ప్రకటించాడు. తన ప్రభుత్వకార్యాలయాను మాత్రమే మార్చక, మొత్తం ప్రజానీకానికి దౌలతాబాదుకు మకాం మార్చాలని హుకుం జారీ చేశాడు. దౌలతాబాదులో ప్రజా సౌకర్యాలు కలుగజేయడంలో విఫలుడైనాడు. కనీస వసతులైన నీటి సరఫరా కూడా చేయలేకపోయాడు. కేవలం రెండేళ్లలో, తిరిగి రాజధానిగా ఢిల్లీని ప్రకటించి, ప్రజలందరికీ తిరిగీ ఢిల్లీ చేరాలని ఆజ్ఞలు జారీచేశాడు. ఈ అసంబద్ధ నిర్ణయానికి బలై, వలసలతో ఎందరో జనం మరణించారు. తుగ్లక్ భారతదేశంలోనే మొదటిసారిగా నాణెముల మారకవిధానాన్ని ప్రారంభించాడు, వీటిని చైనీయుల నమూనాల సహాయంతో ఇత్తడి లేదా రాగి నాణేలను విడుదల చేశాడు. మునుపు వున్న బంగారం మరియు వెండి నాణేలను వెనక్కు తీసుకుని ఖజానా లో భద్రపరిచాడు. ఈ మార్పిడి ఈ ఉపాయం విఫలమైనది, ఖజానాలో రాగి మరియు ఇత్తడి నాణేలు సంవత్సరాల తరబడీ గుట్టలుగా పేరుకుపోయాయని చరిత్రకారులు చెబుతారు. తుగ్లక్ పర్షియా మరియు చైనా పై దండయాత్ర సలపబోతున్నాడనే వార్త, ప్రజలలో వ్యాపించింది. ఇలాంటి విపరీత బుద్ధులతో తుగ్లక్, సమకాలీనులలో విమర్శలకు లోనయ్యాడు.

3. సెంటూరియన్ ఎవరు ?

రైతుల నుంచి భూమిశిస్తు వసూలు చేయడానికి దాదాపు పాతపద్ధతులనే వినియోగించేవారు. అయితే బకాయిల వసూలుకు 'సెంటూరియన్' అనే కొత్త అధికారులను సుల్తాను నియమించాడు. భూమిశిస్తు ఎప్పటికప్పుడు వసూలు చేయడమే కాకుండా, బకాయిలు పేరుకుని పోకుండా ఈ సెంటూరియన్లు చూసేవారు. ముఖద్దంలు, చౌదరీల పనిని ఈ సెంటూరియన్లు పర్యవేక్షించేవారు.

4. 'దివాన్-ఇ-కోహి' అనే శాఖ ఎందుకు ఏర్పాటు చేశారు ?

వ్యవసాయానికి సంబంధించిన వ్యవహారాలను చూడటానికి సుల్తాన్ 'దివాన్-ఇ-కోహి' అనే ప్రత్యేక శాఖను ఏర్పాటు చేశాడు. మైదానాల్లో వ్యవసాయాన్ని విస్తృతం చేయడానికీ, మెరుగుపరచడానికీ అనేక చర్యలు తీసుకున్నాడు. ఖాళీగా పడివున్న మైదాన ప్రాంతాన్ని కేంద్రబిందువుగా చేసుకుని అక్కడ సుల్తాను జనావాసాలను ఏర్పాటు చేసి, చుట్టూ ఉన్న భూమి అభివృద్ధి చేసి వ్యవసాయయోగ్యం చేశాడు. ఈ భూమిని అనేక బ్లాకులుగా విభజించారు. రైతులు సాధారణంగా పండించే బార్లీల స్థానంలో మేలైన గోధుమలు పండించడానికి రైతులను సుల్తాను ప్రోత్సహించేవాడు.

5. సుల్తాన్ ప్రవేశపెట్టిన కొత్త నాణెంపేరు ఏమిటి ?

సుల్తాన్ ప్రవేశపెట్టిన నాణేలు అందంగా రూపుదిద్దుకోవడం ప్రారంభించాయి. 'దొకాని' పేరుతో కొత్త నాణేన్ని సుల్తాన్ ప్రవేశపెట్టాడు. చిన్న నాణేలను ఎక్కువ సంఖ్యలో ముద్రించి సామాన్య ప్రజలకు నాణేల కొరత లేకుండా సుల్తాన్ జాగ్రత్తవహించాడు. ఈ కాలంలోనే సుల్తాను నామమాత్రపు కరెన్సీ (కోకెన్ కరెన్సీ) ప్రవేశపెట్టాడు.

6. వెండిటంకాతో సమానమైన విలువ ఉండే రాగి నాణేన్ని ప్రవేశపెట్టాలని మహ్మద్-బిన్-తుగ్లక్ ఏ సంవత్సరంలో నిర్ణయించారు? **- 1330లో (క్రీ.శ 1329-30)**

7. మహ్మద్-బిన్-తుగ్లక్ పరిపాలనా కాలం ? **- క్రీ.శ 1325-1351**

8. సమకాలీన చరిత్రకారులు ఏ సుల్తానును 'విరుద్ధగుణాల నిలయుడు'గా వర్ణించారు ? **- మహ్మద్-బిన్ -తుగ్లక్**

9. మహ్మద్-బిన్-తుగ్లక్ ఆస్థానంలో ఉన్నత ఉద్యోగాన్ని పొందిన మొరాకో దేశస్తుడు? **- ఇబన్‌బటూటా**

10. హిందువులు పండగలైన దీపావళి, హోళి మొదలైన వాటిల్లో పాల్గొన్న మొదటి సుల్తాన్ ఎవరు ? **- మహ్మద్-బిన్-తుగ్లక్ హిందూ దేవాలయాలను సందర్శించాడు. జైన, బౌద్ధ, హిందూ మునులతో చర్చలు నిర్వహించేవాడు. సాంఘిక దురాచారాలైన 'సతి'ని రూపుమాపడానికి ప్రయత్నం చేశాడు.**

11. మహ్మద్-బిన్-తుగ్లక్ సంస్కరణల్లో మొదటిది ? **- దోఆచ్ ప్రాంతంలో భూమిశిస్తు రేటు పెంచడం**

12. క్రీ.శ 1326-27 మధ్య కాలంలో జరిగిన ప్రధాన సంఘటన ? **- మహ్మద్-బిన్-తుగ్లక్ దౌలతాబాద్ నుంచి ఢిల్లీకి రాజధానిని మార్చడం.**

13. మహ్మద్-బిన్-తుగ్లక్ అంతర్వేది ప్రాంతంలో భూమిశిస్తురేటును బదౌని ప్రకారం ఎన్ని రెట్లు పెంచాడు ? **- భూమిశిస్తును 10 లేదా 20 రెట్లు పెంచాడు**

14. సమకాలీన ముస్లిం చరిత్రకారుల కథనం ప్రకారం ఢిల్లీ నుంచి దౌలతాబాద్ (దేవగిరి) మధ్య ఉన్న దూరం ? **- 700 మైళ్లు (1500 కిలోమీటర్లు)**

15. మహ్మద్-బిన్-తుగ్లక్ రాజధాని మార్పిడి (ఢిల్లీ-దౌలతాబాద్, దౌలతాబాద్ నుంచి ఢిల్లీకి) వృథా ప్రయాసకు చిహ్నంగా నిలిచిపోయింది) అని ఏ చరిత్రకారుడు అభిప్రాయపడ్డాడు ? **- లేన్‌పూల్ (ఏ మూమెంట్ ఆఫ్ మిస్‌డైరెక్టర్ ఎనర్జీ)**

16. మహ్మద్-బిన్-తుగ్లక్ పరిపాలనా కాలంలో ద్రవ్యోల్బణం ఏర్పడడానికి ఏ సంస్కరణ ప్రధాన కారణమైంది ? **- నాణేల సంస్కరణ**

17. పర్షియాకు చెందిన ఏ చక్రవర్తి మహ్మద్-బిన్-తుగ్లక్‌కు నాణేల సంస్కరణలో మార్గదర్శకుడిగా నిలిచాడు ? **- కైఖటుఖాన్**

18. మహ్మద్-బిన్-తుగ్లక్ కాలంలో దక్షిణాపథంలో చెలరేగిన విమోచనోద్యమ ప్రధాన నాయకుడు ? **- ముసునూరి ప్రోలయనాయకుడు**

19. క్రీ.శ 1351లో మహ్మద్-బిన్-తుగ్లక్ ఏ ప్రదేశంలో మరణించాడు ? **- థట్టా (సింధూ సమీపంలో)**

20. ఫిరోజ్‌షా విధించిన పన్నులు ఏవి ? **- ముస్లిం పవిత్రగ్రంథం 'ఖురాను' నిషేధించిన అన్ని పన్నులనూ సుంకాలనూ ఫిరోజ్‌రద్దు చేశాడు. ఖురాను చట్టానికి అనుగుణంగా ప్రజలపై నాలుగు రకాల పన్నులు మాత్రమే విధించాడు.**

1. ఖామ్స్ - యుద్ధ సమయంలో దోపిడీ చేసిన మొత్తంలో 1/5 వంతు.
2. జకత్ - ముస్లింలవద్ద నుంచి ముస్లిం పవిత్రస్థలాలు అభివృద్ధి కోసం ముస్లిం ఆస్తిపై విధించే 2 1/2 శాతం పన్ను.
3. జిజియా - ముస్లిమేతరుల నుంచి వసూలుచేసే పన్ను. అనంతర కాలంలో ఫిరోజ్‌సేద్యపు పొలాలపై పంటలో పదిశాతం నీటి తీరువా (షుబ్) కింద వసూలు చేశాడు.
4. ఖరజ్ - పంటలు పండించడానికి అనువుగా ఉన్న పొలంలోని ఉత్పత్తిలో 1/10 వంతు.


21. ఫిరోజ్ ప్రజాహిత కార్యాలు చేపట్టే శాఖపేరు ఏమిటి ? **- దివాన్-ఇ-ఖైరత్ అనే ప్రత్యేకశాఖను ఏర్పాటు చేసి ఫిరోజ్ అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాడు**

22. వ్యవసాయ భూములకు నీటిని సరఫరా చేయడానికి ఏ ఢిల్లీ సుల్తాన్ యమునా, సట్లెజ్ నదులకు కాలువలు నిర్మించాడు ? **- ఫిరోజ్-షా-తుగ్లక్**

23. ఢిల్లీలో పేదరోగుల కోసం ఫిరోజ్-షా-తుగ్లక్ స్థాపించిన ఆస్పత్రిపేరు ? **- దార్-ఉల్-షాపా**

24. ఫిరోజ్ తుగ్లక్ పరిపాలనా కాలం ? **- క్రీ.శ 1351-1388**

25. ఫిరోజ్‌షా, మహ్మద్-బిన్- మధ్యగల మతవిధానానికి మధ్యగల బేదం ఏమిటి ? **- ఫిరోజ్‌షా తనకు తాను ఖలీఫా**



ప్రతినిధినని ప్రకటించుకున్నాడు. మహ్మద్ ఖలీఫా ఆధిపత్యాన్ని తిరస్కరించాడు.

26. ఏ కాకతీయ చక్రవర్తి పాలనాకాలంలో వరంగల్ రాజ్యం ఢిల్లీ సుల్తాన్‌తో విలీనమైంది ? **- రెండో ప్రతాపరుద్రుడు**

27. బరనీ, షామ్సిసి-సిరాజ్, ఆఫీఫ్ అనే చరిత్రకారులను పోషించిన ఢిల్లీ సుల్తాన్ ? **- ఫిరోజ్-షా-తుగ్లక్**

28. ఫిరోజ్‌షాకు వాస్తు నిర్మాణంలో ఉన్న అభిలాషను కొనియాడుతూ సర్ వుల్సీహేగ్ సుల్తాన్‌ను ఏరోమన్ చక్రవర్తితో పోల్చాడు ? **- ఆగస్టస్**

29. 'దివాన్-ఇ-ఇన్‌షా' అనే సంస్థ ఎందుకు ఫిరోజ్‌షా ఏర్పాటు చేశాడు ? **- 'దివాన్-ఇ-ఇన్‌షా' అనే సంస్థను స్థాపించి ప్రభుత్వానికి సేవలందించి పదవీ విరమణ చేసిన పండితులకు, విద్వాంసులకు ఆర్థిక సహాయం చేశారు.**

30. ఉపాధి కల్పన సంస్థను ఎవరు స్థాపించారు ? **- ఫిరోజ్‌షా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి, ఢిల్లీ కొత్వాల్ నాయకత్వాన 'ఉపాధి కల్పన సంస్థ'ను స్థాపించాడు. యువతకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాడు.** ★

ఉద్యోగాలు

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో 101 ఖాళీలు

హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) లిమిటెడ్.. ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లాలో నిర్వహిస్తున్న ఐరన్ ఓర్ మైన్‌లో 101 ట్రెనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎన్ఎండీసీ.. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందింది.

పోస్టు-ఖాళీలు : మెయింటెనెన్స్ అసిస్టెంట్ ట్రెనీ-92 (మెకానికల్-45ం ఎలక్ట్రికల్-47), అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్ గ్రేడ్ (3) ట్రెనీ -1, అసిస్టెంట్ ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ (3) ట్రెనీ-1, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ గ్రేడ్ (3) ట్రెనీ-1, అసిస్టెంట్ డైటిషియన్ గ్రేడ్ (3) ట్రెనీ-1, హెచ్ఈఎం (మెకానికల్) గ్రేడ్(3) ట్రెనీ/ ఎంసీవో గ్రేడ్ (3) ట్రెనీ-5.

అర్హతలు : మెయింటెనెన్స్ అసిస్టెంట్ ట్రెనీకి ఐటీఐ (వెల్డింగ్/ ఫిట్టింగ్/ మోటార్ మెకానిక్/ డీజిల్ మెకానిక్/ ఆటో ఎలక్ట్రీషియన్/ ఎలక్ట్రికల్), అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌కు బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫిజియోథెరపీ (బీపీటీ), అసిస్టెంట్ ల్యాబ్ టెక్నీషియన్‌కు గ్రాడ్యుయేషన్ (సైన్స్)తోపాటు మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్ సర్టిఫికెట్ (లేదా) పదోతరగతితోపాటు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా, అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌కు పదోతరగతి/ డిగ్రీతోపాటు ఫార్మసీలో డిప్లొమా/ సర్టిఫికెట్ (లేదా) డిగ్రీ ఇన్ ఫార్మసీ, అసిస్టెంట్ డైటీషియన్‌కు బీఎస్సీ/ బీహెచ్ఎస్సీండిప్లొమా ఇన్ డైటిటిక్స్ (లేదా) బీఎస్సీ (న్యూట్రిషన్/ డైటిటిక్స్/ ఫుడ్ న్యూట్రిషన్), హెచ్ఈఎం/ ఎంసీవోకు ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్). వీటితోపాటు పోస్టును బట్టి నిబంధనల మేర ఉద్యోగానుభవం తప్పనిసరి.

వయసు : 18-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్/ జాబ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్.

రాతపరీక్ష విధానం : దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో పార్ట్-1 కింద సబ్జెక్ట్ నాలెడ్జ్ నుంచి 30 మార్కులకు, పార్ట్-2లో జనరల్ నాలెడ్జ్ నుంచి 50, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో అర్హత సాధించిన అభ్యర్థులకు ట్రేడ్ టెస్ట్/ జాబ్-ప్రొఫిషియెన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. దీన్ని అర్హత పరీక్షగా పరిగణిస్తారు.

దరఖాస్తు ఫీజు : రూ.150, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మాజీ సైనికోద్యోగ/ డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : జనవరి 27, 2018.

వెబ్‌సైట్ : www.nmdc.co.in

ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో 150 పోస్టులు

తమిళనాడులోని నైవేలీలో ఉన్న నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్.. 150 గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది భారత ప్రభుత్వానికి చెందిన ప్రీమియర్ నవరత్న ప్రభుత్వరంగ సంస్థ.

పోస్టు : గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెనీ (జీఈటీ).

వేతనం : ఏడాది శిక్షణలో నిబంధనల మేర వేతనం చెల్లిస్తారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకొని నియామకం పొందాక రూ.20,600-రూ.46,500 వేతన శ్రేణి ఉంటుంది.

విభాగాల వారీ ఖాళీలు : మెకానికల్-50, ఎలక్ట్రికల్ (ఈఈఈ)-35, ఎలక్ట్రానిక్స్ (ఈసీఈ)-10, సివిల్-20, కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్-20, కంప్యూటర్-5, మైనింగ్-10.

అర్హతలు : సంబంధిత విభాగాలను బట్టి కనీసం 60 శాతం(ఎస్సీ/ ఎస్టీలకు 50 శాతం) మార్కులు/ గ్రేడ్‌తో ఇంజనీరింగ్ డిగ్రీతో పాటు గేట్-2018 స్కోర్. తుది సంవత్సరం విద్యార్థులూ అర్హులే.

వయసు : 2018, జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : గేట్ -2018 ఆధారంగా, మెరిట్, ఇంటర్వ్యూ.

దరఖాస్తు ఫీజు : జనరల్/ ఓబీసీ-రూ.300, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మాజీ సైనికోద్యోగ/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : జనవరి 27, 2018.

వెబ్‌సైట్ : www.nlcindia.com

కమీషన్ పెంచాలని 'మీసేవ' నిర్వాహకుల ఆందోళనలు

ప్రజాశక్తి- విశాఖపట్నం

తమకు కమీషన్ పెంచాలని కోరుతూ విశాఖ జిల్లాలోని పలు మండలాల్లో మీ సేవా నిర్వాహకులు కేంద్రాలను మూసివేసి తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. నిర్వహణ వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో తమకు కమీషన్ పెంచడంతో పాటు నెలసరి వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విశాఖ జిల్లా బుచ్చెయ్యపేట, తదితర మండలాల్లో మండల రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి సంబంధిత తహశీల్దార్లకు వినతిపత్రాలను సమర్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నామని, మీసేవ కేంద్రాల నిర్వహణ భారమైందని వారు వాపోయారు.



ధర్నా సమస్యలు పరిష్కరించాలని తూర్పుగోదావరి జిల్లా చింతూరు ఐటిడిఎ వద్ద సోమవారం సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న గిరిజనులు

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని ఐటిడిఎ ముట్టడి

ప్రజాశక్తి-చింతూరు (తూర్పుగోదావరి)

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు సిపిఎం ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా చింతూరు ఐటిడిఎను సోమవారం ముట్టడించారు. చింతూరు కేంద్రంగా డిగ్రీ, బిఇడి, డిఇడి కళాశాలలను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక ఏజెన్సీ డిఎస్‌సిని నిర్వహించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, బొప్పెన కిరణ్ మాట్లాడారు. 2012 నుంచి తునికాకు బోనస్ పెండింగ్‌లో ఉందని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్ల నుంచీ గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. మారుమూల గ్రామాలకు మంజూరైన రోడ్లను నిర్మించాలన్నారు. హక్కుపత్రాలు ఇచ్చిన భూముల్లో ఉపాధి పనులకు ఫారెస్ట్ అధికారులు అడ్డంపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న భూముల్లో ఫారెస్ట్ అధికారులు కందకాలు ఆపాలని, పోలవరం ముంపు గ్రామాల్లో అభివృద్ధి పనులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కూనవరం, విఆర్‌పురం, చింతూరు ఎంపిపిలు కొమరం పెంటయ్య, కారం శిరమయ్య, చిచ్చడి మురళి ఆధ్వర్యాన కలెక్టర్ కార్తికేయమిశ్రాకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సంతోష్, కోట్ల కృష్ణ, సుబ్బమ్మ, భారతి, సావిత్రి, జయ, సుబ్బారావు, రమేష్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో 'తుమ్మపాల' కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి- అనకాపల్లి (విశాఖ)

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కార్మికులను అర్థాంతరంగా తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని నిరసిస్తూ కార్మికులు సోమవారం సుగర్ ఫ్యాక్టరీ గేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. తొలగించిన 146 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, 37 నెలలుగా చెల్లించాల్సిన జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా చేపట్టి, ఆర్‌డిఒకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డి. దిలీప్‌కుమార్, సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, సిఐటియు నాయకులు ఎం భాస్కరరావు తదితరులు మాట్లాడుతూ.. 37 నెలలుగా జీతాలు చెల్లించకపోగా వారిని విధుల నుండి తొలగించడం దుర్మార్గమన్నారు.ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పూనుకుంటుందన్నారు. ఇప్పటికే వారు దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, ఈ నిర్ణయం వారిని వేదనకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒంగోలులో చర్మ, డప్పుకళాకారుల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

మాదిగ చర్మ, డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభంజనం పేరుతో ధర్నా నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తిరివీధి బాబు మాదిగ మాట్లాడుతూ రోడ్ల మీద చెప్పులు కుట్టుకుంటూ హీనమైన పరిస్థితులలో చర్మకారులు, డప్పుకళాకారులు జీవిస్తున్నారని విమర్శించారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.3000 పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కడప ఉక్కు అందరి హక్కు

- ప్రత్యేక హోదా వద్దని, ప్యాకేజీయే ముద్దని టిడిపి, బిజెపిల సన్నాయినొక్కులు
- నోట్ల రద్దుతో క్షీణించిన అభివృద్ధి రేటు
- న్యాయ వ్యవస్థ కన్నీళ్లుపెట్టుకుంది
- దాడులతో ప్రశ్నార్థకంగా ప్రజాస్వామ్యం
- సిపిఎం కడప జిల్లా 10వ మహాసభను ప్రారంభిస్తూ ఉమామహేశ్వరరావు వెల్లడి



సిపిఎం కడప జిల్లా 10వ మహాసభలో ప్రారంభోపన్యాసం చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు. వేదికపై సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఓబులు

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

విశాఖ ఉక్కు పోరాట స్పూర్తితో 'కడప ఉక్కు అందరి హక్కు' అన్న నినాదంతో కడప జిల్లా ప్రజలు ముందుకు సాగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. రెండ్రోజులపాటు నిర్వహించే సిపిఎం జిల్లా కడప జిల్లా పదవ మహాసభలు ఉత్సాహపూరిత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. తొలుత అరుణ పతాకాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.నారాయణ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద మహాసభకు అరుదెంచిన ప్రతినిధులు నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. మహాసభల పరిశీలకులుగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ ఓబులు హాజరయ్యారు. మహాసభలో వి.ఉమామహేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న హామీలను ప్రభుత్వం చట్టంలో చేర్చిందన్నారు. నాలుగేళ్లు పూర్తవుతున్నా దాని ఊసే లేకుండా పోయిందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని కల్పించేలా హామీ ఉందన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని సూచించిందని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా గురించి నొక్కి చెప్పిన టిడిపి, బిజెపిలు నేతలు ప్యాకేజీయే ముద్దంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ ద్వారా జిల్లాలో 30 వేల మందికి ప్రత్యక్ష్యంగానూ, మరో లక్ష మందికి పరోక్షంగానూ ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాలో ఉపాధిలేక లక్షల మంది యువకులు రోడ్డున పడాల్సి వస్తోందన్నారు. పిల్లలను, వృద్ధులను వదిలి వివిధ ప్రాంతాలకు వలసెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ పని తప్పనిసరిగా కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం ఉపాధిని చూపడం లేదన్నారు. పని చేసిన వారికి కనీసం బిల్లులు చెల్లించడం లేదున్నారు. మహాసభలు ప్రజల కోసం, ప్రజా పోరాటాల కోసమేనని తెలిపారు. మూడు సంవత్సరాలుగా జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ చేసిన పోరాటాలను ఈ మహాసభల్లో సమీక్షించి.. ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు అవసరమైన ప్రణాళికలను ఈ మహాసభలు రూపొందిస్తాయని తెలిపారు. పోరాటాలకు ప్రజలను చైతన్యం చేయాలని పేర్కొన్నారు. అనంతరం మహాసభల నివేదికను జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ప్రవేశపెట్టారు. మహాసభలకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు ఐఎన్ సుబ్బమ్మ, సత్యనారాయణ, అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

తహశీల్దార్ వేధింపులపై దర్యాప్తు జరపరా?

ఎపి విఆర్‌ఒల సంఘం ప్రశ్న

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండల తహశీల్దార్ ఎన్.శ్రీధర్ వేధింపులపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని ఎపి విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆంజనేయకుమార్(చంటి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం రెవెన్యూ అసోసియేషన్ భవనంలో సోమవారం సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ప్రవర్తనలతో విఆర్‌ఒలు విసిగిపోతున్నారన్నారు. కొందరు తహశీల్దార్లు విఆర్ ఒలను వేధింపులకు గురిచేస్తున్నారని, అసభ్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కొత్తపేట తహశీల్దార్ వేధింపులను తట్టుకోలేక వానపల్లి విఆర్‌ఒ బండారు సత్యనారాయణ సూసైడ్ నోట్ రాసి అదృశ్యమయ్యారని, ఇప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదని వివరించారు. ఈ నెల 28వ తేదీన విజయవాడలో రాష్ట్ర కమిటీ సమావేశం జరగనుందని, ఇందులో విఆర్‌ఒల సమస్యలపై చర్చిస్తామని చెప్పారు.

బహుజన కులాల ఐక్యతకే జెఎసి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

రాష్ట్రంలోని అన్ని బహుజన కులాలను ఐక్యం చేయాలనే ఉద్దేశ్యంతోనే బహుజన కులాల రాజ్యాధికార సాధన జెఎసిని ఏర్పాటు చేసినట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ఫ్రాన్సిస్ అన్నారు. విజయవాడ సోషల్ సర్వీస్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీల ఐక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటికీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీల సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితి చూస్తే సామాజిక న్యాయం సమాధి జరిగినట్లు నిర్ధారణ అవుతోందన్నారు. రాష్ట్రంలో కేవలం రెండు సామాజిక వర్గాలే విడతల వారీగా అధికారాన్ని అనుభవిస్తున్నాయని చెప్పారు. మొత్తం సహజ సంపద అనుభవిస్తున్న పై రెండు పాలక వర్గాలను మినహాయించి మిగిలిన సామాజిక వర్గాల జనాభా నిష్పత్తి ప్రకారం ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న చిన్న చిన్న పార్టీలను ఏకం చేసి మూడో ఫ్రంట్‌గా ఏర్పడి అతి పెద్ద రాజకీయ శక్తిగా తయారవ్వడానికి రాజ్యాధికార సాధన జెఎసిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో బహుజనులు రాజ్యాధికారాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో 13 జిల్లాల నుంచి నాయకులు పాల్గొన్నారు.



కాకినాడ కలెక్టరేట్ ధర్నా చేస్తున్న భాషా పండితులు

పంచాయతీ కార్మికులపై చిత్తశుద్ధి ఏదీ?

దీక్షల ప్రారంభంలో ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

పచ్చదనం, పరిశుభ్రత గురించి నిత్యం మాట్లాడే ప్రభుత్వానికి పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు విమర్శించారు. గ్రామాలను శుభ్రంగా ఉంచటంలో కీలక పాత్ర పోషించే వర్కర్ల సమస్యలను పరిష్కరించకుండా ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షను ఎమ్మెల్సీ సోమవారం ప్రారంభించారు. దీక్షలకు హాజరైన సిఐటియు, ఎఐటియుసి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏడో వేతన సంఘం సిఫార్సుల మేరకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని, రాష్ట్రంలో పదో పిఆర్‌సి ప్రకారం చూసినా కనీసం రూ.14 వేలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. అయితే రూ.6 వేల వేతనంతో పారిశుధ్య కార్మికులు వెట్టిచాకిరీ చేయాల్సి వస్తోందన్నారు. అవి కూడా సకాలంలో విడుదల చేయట్లేదని, విధుల్లో అవసరమయ్యే రక్షణ వస్తువులనూ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకుమాను నాగేశ్వరరావు, తదితరులు ప్రసంగించారు.



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజా ఉద్యమాలకు 'సంకెళ్లు'

- ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు నమోదు
- సిపిఎం, సిఐటియు నాయకుల అరెస్టు, రిమాండ్

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లాలో ఇటీవల కాలంలో సిపిఎం ముఖ్య నేతలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. గతేడాది జూన్‌లో మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల సమస్యలపై ధర్నా చేశారనే నెపంతో పోలీసులు మళ్లీ అక్రమ కేసులు బనాయించారు. ఈ కేసుకు సంబంధించి సోమవారం సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి మూలం రమేష్, రూరల్ కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, నగర, రూరల్ సిఐటియు కార్యదర్శులు జి.నాగేశ్వరరావు, అల్లాడి గోపాల్, సిఐటియు నాయకులు ఎస్‌కె.జిలానీ, మున్సిపల్ వర్కర్స్ నాయకులు చిన్నాపై కేసు నమోదు చేశారు. 2, 3, 4వ పోలీసు స్టేషన్లలో వివిధ సెక్షన్లపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం ఫిబ్రవరి 5వ తేదీ వరకు రిమాండ్‌కు తరలించారు.

మంత్రి నారాయణ ప్రోద్బలంతో అక్రమ కేసులు
సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సొసైటీ రద్దు కాకుండా చేశారనే ఆక్రోశంతో కమిషనర్ ద్వారా మంత్రి నారాయణ నాయకులపై అక్రమ కేసులు బనాయించారని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ విమర్శించారు.

సోమవారం తమ పార్టీ నాయకులను జైలుకు పంపుతున్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసులు ఒక్క కేసే అని చెప్పి స్టేషన్‌లో సరెండర్ అయిన తర్వాత, మరో రెండు, మూడు అక్రమ కేసులు నాయకులపై బనాయించి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు.

టెట్‌లో న్యాయం చేయండి

కాకినాడ కలెక్టరేట్ ఎదుట భాషా పండితుల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

టెట్‌లో తమకు న్యాయం చేయాలని కోరుతూ 200 మంది భాషా పండితులు తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. టెట్ సిలబస్ మార్చి పరీక్షకు సమయం ఇవ్వకపోవడాన్ని వ్యతిరేకిస్తూ శ్రీనగర్ ఆదిత్య విద్యాసంస్థల ప్రాంగణం నుంచి కలెక్టరేట్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ పదో తరగతి వరకూ ఉన్న సిలబస్‌ను పిజి స్థాయి సిలబస్‌గా మార్చేశారని తెలిపారు. పరీక్షలకు ముందుగా సిలబస్ మార్చేసి, చదువుకునేందుకు సమయం ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం సరికాదని అన్నారు. భాషా పండితులకు ఫిబ్రవరి 5 నుంచి 15 వరకూ టెట్ పరీక్షల తేదీని ప్రకటించారని, ఆ తేదీని వాయిదా వేయాలని, సిలబస్ పదో తరగతి వరకూ మాత్రమే ఉంచాలని డిమాండ్ చేశారు.

ఏలూరులో కౌలు రైతుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

కౌలురైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ ఎదుట కౌలురైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. కౌలురైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి నశించాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ధర్నానుద్దేశించి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కష్టపడి పంట పండించిన కౌలురైతుల పేరుతో కాకుండా భూయజమానుల పేరుతో ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లయీస్, ఐకెపి కేంద్రాల నిర్వాహకులు చెప్పడం దారుణమన్నారు. కౌలురైతుల నుంచి ధాన్యం సేకరించొద్దని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు చెప్పడం అన్యాయమన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు సాగుతున్నాయని విమర్శించారు. కౌలురైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేసి వారి బ్యాంకు ఖాతాలకే నగదు చెల్లించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ కౌలురైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ సివి కొండయ్యను ఆదేశించారు.

ప్రజ్ఞ

జవాబులు

1. గౌహతి
2. జైరాంపూర్ (అరుణాచల్ ప్రదేశ్)
3. సుదీప్ లఖ్తకియా
4. ఓం ప్రకాష్ రావత్
5. సోలోమాన్ డెక్సిసా (ఇథోపియా)

టిటిడిలో ఉద్యోగుల తొలగింపు ప్రయత్నాలు

- రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇఒపై చర్యలు తీసుకోవాలి
- సిఐటియు, ఎఐటియుసి డిమాండ్

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

టిటిడిలో 45 మంది హైందవేతరులను తొలగించడానికి టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మధురానగర్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిటిడి ఇఒ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే రీతిలో 45 మంది టిటిడి ఉద్యోగులకు టెర్మినేషన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. కొన్ని నెలల్లో పదవీవిరమణ కానున్నవారు, 28 నుంచి 30 ఏళ్లుగా సర్వీసులో ఉన్నవారు, వివాద రహితంగా ఉన్నవారు, వృత్తి విషయంలో అంకిత భావంతో ఉన్న ఉద్యోగులను కేవలం హైందవేతరులనే పేరుతో తొలగించాలనుకోవడం అప్రజాస్వామికమేనని వాపోయారు. షోకాజ్ నోటీసులను తక్షణమే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. టిటిడిలో చాలా మంది హైందవేతరులు వివిధ శాఖల్లో పనిచేస్తున్నారని, వారు లేకుంటే కొన్ని పనులు జరిగే స్థితిలో లేవని వివరించారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తున్నారే గానీ ఎక్కడ అన్యమత ప్రచారాలు చేయడం లేదని గుర్తుచేశారు. ఇప్పటికే టిటిడి హాస్టల్స్‌లో ముస్లిములకు, క్రిస్టియన్లకు సీట్లు ఇవ్వకుండా ఉత్తర్వులు జారీచేయడం దారుణమన్నారు. స్వామి వారిని అన్ని మతాల వారు దర్శించుకుంటున్నారని, ఆలయంలో బిబినాన్‌చారీ విగ్రహం ఉందని, శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చాలామంది ముస్లిములు పూలు, ఇతర వస్తువులు సరఫరా చేస్తున్నారని తెలిపారు. టిటిడి ఆస్థాన విద్యాంసుడుగా సుభాన్‌ఖాసీం ఉన్నారని గుర్తుచేశారు. తిరుపతి నవాబ్‌పేటలో ముస్లిములు తిరుమల శనివారాలను పాటిస్తున్నారన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలు విషప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఇఒ తీసుకున్న నిర్ణయం వెనక పెద్దలు ఎవరు ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని 45 మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు జిబిఎస్ మణ్యం, నారాయణబాబు, నాగరాణి, ఎఐటియుసి జిల్లా నాయకులు మురళి, రాధాకృష్ణ, ఎన్‌డి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షలు

కార్మికుల పక్షం కాదు.. కాంట్రాక్టర్ల తొత్తు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్
- రాష్ట్రవ్యాప్తంగా మూడోరోజు విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలు



కడపలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలకు మద్దతు తెలియజేస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి - కడపఅర్బన్

వేలాదిగా ఉన్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పక్షాన నిలబడకుండా కాంట్రాక్టకర్లకు తొత్తుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ నిశితంగా విమర్శించారు. విద్యుత్ కార్మికుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల నిరాహారదీక్షలు మూడో రోజు మంగళవారం కూడా రాష్ట్రంలో పెద్దఎత్తున జరిగాయి. కడప కలెక్టరేట్ ఎదుట మూడో రోజు దీక్షలను ప్రారంభించిన గఫూర్ మాట్లాడుతూ.. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఎన్నికల సమయంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేస్తామని చెప్పిన హామీని ఇప్పటి వరకు నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. 23 వేల మంది కార్మికుల కుటుంబాల్లో వెలుగు నింపేదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్మికులు ఈ నెల 20 నుంచి దీక్షలు చేపట్టారని చెప్పారు. 26వ తేదీలోపు ప్రభుత్వం స్పందించకపోతే 27వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకు సిఐటియు మద్దతు ఇస్తుందనీ, ప్రభుత్వం కార్మికుల సంగతి చూడకపోతే, మనమే ప్రభుత్వ సంగతి చూద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, విద్యుత్ కార్మికుల ఐక్య వేదిక చైర్మన్ కె.మల్లికార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు బ్రహ్మానందరెడ్డి, ఎస్‌పిడిఎల్‌ఎల్ జాయింట్ సెక్రటరీ నాగమునిస్వామి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీలు నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పాయకాపురంలో 40 షాపులు ధ్వంసం

ప్రజాశక్తి - సింగ్‌నగర్ (విజయవాడ)

విజయవాడ పాయకాపురంలో ఉన్న 40 షాపులను నగర కార్పొరేషన్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం ధ్వంసం చేశారు. దీంతో అధికారులకు, బాధితులకు మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ క్రమంలో ఒక వ్యక్తి చేయి విరిగింది. ఎటువంటి హెచ్చరికా లేకుండానే షాపులను ధ్వంసం చేయడంతో బాధితులకు సిపిఎం, సిఐటియు, హాకర్స్ యూనియన్ నాయకులు అండగా నిలిచారు.

ఈ సందర్భంగా కార్పొరేషన్ వాహనాన్ని అడ్డగించి ఆ వాహనం ముందే బాధితులు, నాయకులు ధర్నాకు దిగారు. ధర్నాలో పాల్గొన్న సిపిఎం నగర నాయకులు రమణారావు మాట్లాడుతూ.. అధికారులొచ్చి సమస్య పరిష్కరించే వరకూ ధర్నా విరమించేది లేదని స్పష్టం చేశారు. షాపుల ముందు ఉన్న నాపరాళ్లను సైతం ముక్కలు ముక్కలుగా పగలగొట్టడం దారుణమన్నారు. ఈ ధర్నా మూడు గంటల వరకూ కొనసాగింది. దీంతో డిప్యూటీ టౌన్‌ప్లానింగ్ అధికారి ధర్మారావు, టౌన్‌ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్ శారద సమక్షంలో సైడ్ కాలువ పూడిక తీసేందుకు, చేయి విరిగిన వ్యక్తికి తగిన చికిత్స చేయించేందుకు, షాపులను యథావిధిగా ఉంచేందుకు అంగీకరించారు. అనంతరం నాయకులు ధర్నా విరమించారు. ఈ ధర్నాలో సిపిఎం నగర నాయకులు సిహెచ్.శ్రీనివాస్, హాకర్స్ యూనియన్ నాయకులు (సిఐటియు) సాంబిరెడ్డి, వెంకటరెడ్డి, 59వ డివిజన్ నాయకులు, షాపుల బాధితులు, మహిళలు పాల్గొన్నారు. ఎస్‌ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది సంఘటనా ప్రాంతాన్ని పర్యవేక్షించారు.

రామ్‌గోపాల్‌వర్మను అరెస్టు చేయాలి

జాయింట్ సిపికి ఐద్వా వినతి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

టీవీ లైవ్‌షోలో ప్రత్యక్షంగా మహిళలను అసభ్యకరమైన పదజాలంతో అవమానపరిచిన సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా డిమాండ్ చేసింది. సోమవారం విశాఖ పోలీసు కమిషనరేటు కార్యాలయంలోని జాయింట్ సిపి నాగేంద్రకుమార్‌ను ఐద్వా నేతలు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐద్వా నగర కార్యదర్శి ఆర్ఎన్.మాధవి మాట్లాడుతూ, మహిళలను చులకన చేస్తూ రామ్‌గోపాల్ వర్మ తీసిన 'జిఎస్‌టి' సినిమాను నిషేధించాలని డిమాండ్ చేశారు. టివి9లో ఈ నెల 18న జిఎస్‌టి సినిమా గురించి ఏర్పాటు చేసిన చర్చలో పాల్గొన్న ఐద్వా నగర సహాయకార్యదర్శి పి.మణిని ఉద్దేశించి రామ్‌గోపాల్‌వర్మ చేసిన వ్యాఖ్యలు అసభ్యకరంగా ఉన్నాయన్నారు. అశ్లీల చిత్రాలు తీసి యువతను పక్కదారి పట్టించకూడదని ఆమె వ్యాఖ్యానించడంతో అది మింగుడుపడని వర్మ ఆమెనే తన సినిమాకు హీరోయిన్‌గా పెట్టి తీస్తానని ఎద్దేవా చేయడమే కాకుండా ఆమె అందం గురించి నీచంగా మాట్లాడటం కూడా యావత్తు మహిళాలోకాన్నే అవమాన పర్చడమేనని అన్నారు. మూడోపట్టణ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఈ విషయంపై ఐద్వా ఫిర్యాదు చేసింది. జాయింట్ సిపిని కలిసి ఫిర్యాదు చేసినవారిలో ఐద్వా నాయకులు పి.మణి, కుమారి, బేగం, ఎల్.చిన్నారి, పద్మావతి, సుమిత్ర, సిఐటియు నాయకులు జ్యోతీశ్వరరావు ఉన్నారు.

రూపాయికే బిఎస్ఎన్ఎల్

అపరిమిత డేటా.. !

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బిఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్)తో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా, కెనడాకు చెందిన డేటా విండ్ సంస్థ బంపర్ ఆఫర్‌ను ప్రకటించేందుకు సిద్ధమైంది. రోజుకు కేవలం ఒక్క రూపాయితో అపరిమిత డేటాను అందించనున్నట్లు డేటావిండ్ వెల్లడించింది. నెలకు రూ.30 ఖర్చుతో డేటావిండ్ స్మార్ట్ ఫోన్లలో నెలంతా అన్ లిమిటెడ్ డేటాను ఆస్వాదించవచ్చని సంస్థ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే బిఎస్ఎన్ఎల్‌తో డీల్ చివరి దశకు వచ్చిందని, ఫిబ్రవరి నెలాఖరులోగా ఈ ప్లాన్ కస్టమర్లకు అందుబాటులోకి వస్తుందని తెలిపాయి.



సాహసబాలలు

వివిధ సందర్భాలలో ప్రమాదాలకు ఎదురునిలిచి సాహసాన్ని ప్రదర్శించి సాహసబాలల అవార్డు అందుకున్న బాలలతోసైన్యాధ్యక్షుడు బిపిన్‌రావత్

సిబిఐ జడ్జి లోయా మృతిపై విచారణ సుప్రీంకు బదిలీ

విచారణ జరుపుతున్న దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం

న్యూఢిల్లీ : సిబిఐ జడ్జి బిహెచ్ లోయా అనుమానాస్పద మృతికి సంబంధించి బోంబే హై కోర్టులో దాఖలైన రెండు కేసులను సుప్రీం కోర్టు సోమవారం తమ వద్దకు బదిలీ చేయించుకుంది. లోయా మృతికి సంబంధించిన ప్రజాహిత వ్యాజ్యాలను విచారణ జరపొద్దని ఇతర హైకోర్టులను ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది. లోయా మృతి కేసుకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పత్రాలలో అంశాలు చాలా తీవ్రంగా ఉన్నాయని, సుప్రీం కోర్టు పేర్కొంది. లోయా మృతికి సంబంధించిన పత్రాలు ఏవైనా ఉంటే తమకు సమర్పించాలని అన్ని పార్టీలను కోరింది. లోయా మృతిపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ బోంబే లాయర్స్ అసోసియేషన్ ఈ నెల 8న బోంబే హై కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. లోయా మృతి చుట్టు అలుముకున్న పరిస్థితులను నిష్పక్షపాతంగా, ఓర్పుతో పరిశీలిస్తామని సుప్రీం కోర్టు సోమవారం తెలిపింది. లోయా మృతిపై వివాదం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని తెలిపింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎ.ఎం. ఖన్విల్కర్, డి.వై. చంద్రచూడ్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం లోయా మృతిపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరపనున్నది.

అభివృద్ధి పనులు నిలువరించడమే కేంద్రం లక్ష్యం

ప్రజలకు రాసిన బహిరంగ లేఖలో మనీష్ శిసోడియా విమర్శ



న్యూఢిల్లీ : లాభదాయక పదవుల కేసులో ఆప్‌కి చెందిన 20మంది ఎంఎల్ఎలను అనర్హులుగా ప్రకటించడం ద్వారా వచ్చే రెండేళ్ళ కాలంలో అభివృద్ధి పనులేవీ జరగకుండా నిలువరించాలని కేంద్రం భావిస్తోందని ఢిల్లీ డిప్యూటీ ముఖ్యమంత్రి మనీష్ శిసోడియా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన నగర ప్రజలనుద్దేశించి బహిరంగ లేఖ రాశారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రజాదరణ పొందుతున్నారని కేంద్రం భయపడిందని అన్నారు. ఇక రాష్ట్రంలో ఉప ఎన్నికలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల నిబంధనావళి అమల్లోకి వస్తుందని, దాంతో అభివృద్ధి కార్యకలాపాలన్నీ నిలిచిపోతాయని శిసోడియా పేర్కొన్నారు. 2019లో లోక్‌సభ ఎన్నికలకు ముందు మళ్ళీ ఎన్నికల నిబంధనావళి అమల్లోకి వస్తుందన్నారు. ఆ తర్వాత వెంటనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వస్తాయని శిసోడియా తన లేఖలో పేర్కొన్నారు. అంటే ఈ 20 నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహించడం ద్వారా వచ్చే రెండేళ్ళలో మొత్తంగా అభివృద్ధి కార్యకలాపాలను బిజెపి నిలువరించిందని ఆయన విమర్శించారు. ఇప్పుడీ 20 సీట్లకు ఎన్నికలు నిర్వహించడమంటే డబ్బును వృథా చేయడమేనని అన్నారు. గతమూడేళ్ళుగా ఆప్‌ను ఇబ్బందులు పాల్జేయడానికి కేంద్రం తీసుకోని చర్య అంటూ లేదని విమర్శించారు. ఇతరత్రా అన్ని రకాలుగా ప్రభుత్వ అభివృద్ధి కార్యకలాపాలను ఆపు చేయడానికి కేంద్రం అనేక రీతుల్లో ప్రయత్నించిందని, కానీ అవన్నీ విఫలం కావడంతో ఇక అనర్హత వేటు అస్త్రాన్ని ఉపయోగించిందన్నారు.

ఆప్ ఎమ్మెల్యేల వేటుపై శివసేన ప్రశ్నలు

ముంబయి: 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై తొందరపాటుగా వేటు వేయడంపై శివసేన ప్రశ్నలు సంధించింది. ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి విచారణ చేయకుండా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు వివరణ ఇచ్చే అవకాశం ఇవ్వకుండా వారిపై వేటు చాలా తప్పు అని శివసేన విమర్శించింది. పార్టీ అధికారిక పత్రికలు సామ్నా, దోపహర్ కా సామ్నా తమ సంపాదకీయాల్లో ఈ వ్యాఖ్యలు చేశాయి. అవినీతి, అన్యాయాలపై పోరాటం చేస్తున్న కారణంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇలాంటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ బిజెపి ఏజెంటు మాదిరిగా వ్యవహరిస్తున్నాడని విమర్శించింది. కేజ్రీవాల్ స్థానంలో ఒక బిజెపి ముఖ్యమంత్రి వుంటే ఆయన ఆ విధంగా వ్యవహరించగలడా..అని ప్రశ్నించింది. ఈ వివాదంతో కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కూడా రాజకీయ ఆయుధంగా వాడుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, ఎన్నికల కమిషన్ విశ్వసనీయతపైనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించింది.

ఎన్నికల కమిషన్ సిఫార్సులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేయడాన్ని కూడా శివసేన విమర్శించింది.

కనోజ్ నుండి అఖిలేష్, మైన్‌పురి నుండి ములాయం

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న సమాజ్‌వాది పార్టీ

లక్నో: 2019లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు యుపిలో సమాజ్‌వాదిపార్టీ ఇప్పటి నుండే సన్నాహాలు ప్రారంభించింది. ఈ ఎన్నికల్లో తాను కనోజ్ స్థానం నుండి పోటీ చేస్తానని పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. ప్రస్తుతం ఈ స్థానం నుండి ఆయన భార్య డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. తన తండ్రి, పార్టీ మాజీ అధ్యక్షుడు ములాయంసింగ్ యాదవ్ మైన్‌పురి స్థానం నుండి బరిలోకి దిగుతారని ఆయన మీడియాకు చెప్పారు. 2014 ఎన్నికల్లో ములాయం అజంగఢ్, మైన్‌పురి స్థానాల నుండి విజయం సాధించిన విషయం తెలిసిందే. తరువాత అజాంగఢ్ స్థానాన్ని తాను వుంచుకుని మైన్‌పురిని ఖాళీ చేయటంతో తరువాత జరిగిన ఉప ఎన్నికలో ఆయన మనుమడు తేజ్ ప్రతాప్‌యాదవ్ గెలిచారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయిన సమాజ్‌వాది పార్టీకి రానున్న లోక్‌సభ ఎన్నికలు కీలకంగా మారుతున్న విషయం తెలిసిందే. 2012లో యుపి ముఖ్యమంత్రి పగ్గాలు స్వీకరించటానికి ముందు అఖిలేష్ యాదవ్ కనోజ్ స్థానం నుండి లోక్‌సభకు మూడు సార్లు ప్రాతినిధ్యం వహించారు.

బిజెపి సర్కారు ఫెయిల్

రాష్ట్రంలోని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలలో ఘోరంగా విఫలమైందని అఖిలేష్ విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్రంలో శాంతి, భద్రతల పరిస్థితి గతంలో ఎన్నడూ లేనంతగా క్షీణించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కనోజ్, మథుర తదితర ప్రదేశాలలో చోటు చేసుకున్న ఘటనలను ఆయన ప్రస్తావిస్తూ పోలీసులు ప్రజలపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమాజ్‌వాది పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకోసం పోరాడుతుందన్నారు. బిజెపి సమాజాన్ని చీలుస్తోంటే సమాజ్‌వాది పార్టీ ఏకం చేయటానికి పాటు పడుతోందన్నారు.

కర్ణాటకలో బంద్ వివాదం

- మహదాయి జలాల పంపిణీపై కొనసాగుతున్న ఆందోళనలు
- 25న బంద్‌కు పిలుపునిచ్చిన రైతు సంఘాలు, కన్నడ సంస్థలు
- అమిత్ షా పర్యటనకు ప్రతిబంధకం కానున్న బంద్
- రాహుల్ పర్యటన సమయంలో కూడా బంద్ ప్రకటిస్తామంటున్న బిజెపి
- 27న అఖిలపక్షం ఏర్పాటు చేసిన సిద్ధరామయ్య



బెంగళూరు (ప్రజాశక్తి ప్రతినిధి): కర్ణాటకలో అధికార కాంగ్రెస్‌కు, ప్రధాన ప్రతిపక్షమైన బిజెపికి మధ్య "బంద్ వార్" జరుగుతున్నది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహాయ నిరాకరణను, మహదాయి నదీ జలాల పంపిణీపై ప్రధాని మౌనాన్ని నిరసిస్తూ కర్ణాటకలోని వివిధ కన్నడ సంస్థలు, రైతు సంఘాలు ఈ నెల 25న బంద్‌కు పిలుపునిచ్చాయి. ఉత్తర కర్ణాటకకు చెందిన రైతులు దాదాపు 1000 రోజులుగా తాగునీటి కోసం ఆందోళన చేస్తున్నారు. ఇప్పుడు రాష్ట్రంలోని వివిధ సంస్థలు, సంఘాలు రైతులతో చేతులు కలిపి కర్ణాటక బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో రాష్ట్ర బిజెపి ఆందోళనకు గురవుతున్నది. అదే రోజున బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సొంత ఊరైన మైసూర్‌ను సందర్శించి, పరివర్తన ర్యాలీలో పాల్గొననున్నారు. అటు కాంగ్రెస్ కన్నడ సంఘాల బంద్, ఇటు పరివర్తన ర్యాలీ నేపథ్యంలో రవాణా సౌకర్యాలు, కనీస అవసరాల లేమిని ఎదుర్కోవాల్సి ఉంటుందేమోనని బిజెపి కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

కన్నడ నేత వటల్ నాగరాజ్ నేతృత్వంలోని కర్ణాటక ఆర్గనైజేషన్ ఫిబ్రవరి 4న బెంగళూరు బంద్‌కు పిలుపునిచ్చింది. అదే రోజున బెంగళూరులో జరగనున్న బిజెపి ర్యాలీలో పాల్గొనేందుకు ప్రధాని మోడీ వస్తున్నారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఫిబ్రవరి 10 నుండి రాష్ట్రంలో జరిపే పర్యటన సందర్భంగా ఈ తరహా బంద్‌లనే నిర్వహిస్తామంటూ బిజెపి కార్యకర్తలు బెదిరింపులకు దిగుతున్నారు. ఇది ప్రభుత్వ ప్రోత్సాహంతో జరుగుతున్న బంద్ అంటూ వస్తున్న విమర్శలను సిద్ధరామయ్య తోసిపుచ్చారు. వీటిని రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న ఆరోపణలుగా ఆయన వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, దీనిపై జెడిఎస్ తన వైఖరిని వెల్లడించాల్సి వుంది. ఈ క్రమంలో సిద్ధరామయ్య ఈ నెల 27న అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రైతు సంఘాల ప్రతినిధులను కూడా ఆహ్వానించారు. నీటి పంపిణి విషయంలో ప్రధాని జోక్యాన్ని కోరేందుకు మరో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని పంపే విషయమై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాగా, మహదాయి నదీ జలాల పంపిణీ వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన వైఖరిని వెల్లడించాలని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు యడ్యూరప్ప డిమాండ్ చేస్తున్నారు. అంతకుముందు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న సోనియా గాంధీ మహదాయి జలాలను కర్ణాటకకు విడుదల చేయడాన్ని వ్యతిరేకించారు. నదీ జలాల ట్రిబ్యునల్ తీర్పు పెండింగ్‌లో ఉన్నందున కర్ణాటకకు నీటిని విడుదల చేయడంపై చర్చించేందుకు గోవా ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ మాజీ ప్రధాని హెచ్.డి. దేవేగౌడ వ్యక్తిగతంగా చేసిన అభ్యర్థనపై ప్రధాని మోడీ నుంచి ఎటువంటి స్పందన రాలేదు.



మళ్ళీ శివసేన అధ్యక్షుడిగా ఉద్ధవ్ థాకరే.?

ముంబయి : శివసేన పార్టీ జాతీయ అధ్యక్షునిగా మరోసారి ఉద్ధవ్ థాకరేను ఎన్నుకొనేందుకు రంగం సిద్ధమైంది. ముంబయిలో మంగళవారం జరగనున్న జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఉద్ధవ్ థాకరే ఏకగ్రీవంగా ఎన్నికకావచ్చని భావిస్తున్నారు.. శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరే మరణించిన దాదాపు రెండు నెలల అనంతరం ఆయన వారసునిగా ఉద్ధవ్ థాకరే జనవరి 23, 2013 న అధ్యక్ష పదవి చేపట్టారు. ఆ రోజు థాకరే జయంతి కావడం విశేషం. తిరిగి పార్టీ పగ్గాలు చేపట్టిన అనంతరం 2019లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలకు కూడా ఆయన కార్యకర్తలను కర్తవ్యోముఖులను చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు.

2008 గుజరాత్ పేలుళ్ల సూత్రధారి అరెస్ట్

న్యూఢిల్లీ: 2008 నాటి గుజరాత్ పేలుళ్ల సూత్రధారిగా భావిస్తున్న మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది, సిమి అగ్రనేత అబ్దుల్ సుభాన్ ఖురేషిని దాదాపు దశాబ్దంపాటు వేట అనంతరం ఢిల్లీ పోలీసులు సోమవారం ఇక్కడ అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని ధృవీకరించిన డిసిపి ప్రమోద్ ఖుష్వాహా మీడియాతో మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా పోలీసులు గాలిస్తున్న ఖురేషి తన నేతృత్వంలోని ఇండియన్ ముజాహిదీన్ సంస్థను పునరుద్ధరించే లక్ష్యంతో ఇటీవలే అజ్ఞాతం నుండి బయటకు వచ్చాడని చెప్పారు. ఫోర్జరీ పత్రాలతో ఇప్పటి వరకూ నేపాల్‌లో నివశించిన ఖురేషీ ఇటీవల భారత్‌కు తిరిగి వచ్చాడని వివరించారు. కొద్దిపాటి ఎదురు కాల్పుల అనంతరం ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం ఖురేషిని అరెస్ట్ చేసిందని, అతడిని కోర్టులో ప్రవేశపెట్టగా రెండు వారాలు పోలీసు రిమాండ్‌కు పంపారని ఆయన చెప్పారు. 2008 జులై 26న గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో వరుసగా 21 బాంబు పేలుళ్లు సంభవించిన విషయం తెలిసిందే. ఈ బాంబులకు తామే బాధ్యత వహిస్తున్నట్లు ఇండియన్ ముజాహిదీన్‌కు చెందిన అల్ అరబీ అనే విభాగం పేరిట వచ్చిన ఇ-మెయిల్‌తో గుజరాత్ పోలీసులు సుభానీని ఈ కేసులో అనుమానితుడిగా ప్రకటించారు. ఖురేషీ అలియాస్ తకీర్ ఢిల్లీ, బెంగళూరు ఉగ్రవాద దాడుల కేసుల్లోనూ, 2006 ముంబయి పేలుళ్ల కేసులోనూ వాంటెడ్ నిందితుడని డిసిపి వివరించారు.

రెండు లక్షల మందికి ఐటి నోటీసులు

న్యూఢిల్లీ : రెండు లక్షల మందికి ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేసింది. రూ.500, రూ.1000 నోట్ల రద్దు సమయంలో రూ.20 లక్షల వరకు డిపాజిట్ చేసిన వారిలో 2 లక్షల మంది ఈలెక్కలు చూపలేదు. వారి చాల సమయమిచ్చి వేచి చూసినా స్పందన లేదని, రిటర్న్ దాఖలు చేయలేదని అధికారులు తెలిపారు. దీంతో వెంటనే రిటర్న్ చేయమని నోటీసులు పంపినట్లు సీనియర్ ఆదాయపు పన్ను అధికారి ఒకరు వెల్లడించారు.

వికలాంగుల జాబితాలో మార్పులు చేసిన రైల్వే శాఖ

న్యూఢిల్లీ : వికలాంగులకు జారీ చేసిన రాయితీ సర్టిఫికెట్ జాబితాను ఆయా తరగతులుగా రైల్వే మంత్రిత్వశాఖ అధికారిక మార్పులు చేసింది. వికలాంగులకు బదులు దివ్యాంగులుగా పేర్కొనాలని 2015 లో ప్రధాని నరేంద్రమోడీ ప్రతిపాదన చేశారు. ఈ మార్పులను చేయడానికి రైల్వే శాఖకు రెండు సంవత్సరాలు పట్టింది. అంధత్వం ఉన్న వారిని దృష్టిలోపం గల వ్యక్తులుగా, చెవిటి, మూగ వారిని వినికిడి, సంభాషణ లోపం గల వ్యక్తులుగా, వికలాంగులను దివ్యాంగ్ జన్‌గా పేర్కొనాలని మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. మినహాయింపు సర్టిఫికేషన్ కోసం అవసరమైన మార్పులను చేయాలని సంబంధిత శాఖను మంత్రిత్వ శాఖ కోరింది. ఈ ఆదేశాలు ఫిబ్రవరి 1 నుండి వర్తిస్తాయి. ప్రయాణ రాయితీని పొందడానికి అంగ వైకల్యం సర్టిఫికేట్లను జారీ చేయడానికి మార్పులను చేయాలని తాము భావించినట్లు రైల్వే మంత్రిత్వశాఖ సీనియర్ అధికారొకరు పేర్కొన్నారు. దివ్యాంగులు, సీనియర్ పౌరులు, విద్యార్థులు మరియు రక్షణ సిబ్బంది వంటి వివిధ వర్గాల ప్రయాణీకులకు రైల్వేలు రాయితీలు అందిస్తున్నాయి, వీటిపై రైల్వేలు ఏడాదికి రు. 1,600 కోట్లు ఖర్చు చేస్తున్నాయి.

శానిటరీ నాప్‌కిన్స్‌కు జిఎస్‌టి సుప్రీం 'స్టే'



న్యూఢిల్లీ : శానిటరీ నాప్‌కిన్స్‌పై వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ని విధించ డానికి సంబంధిచిన అంశాలపై ఢిల్లీ, ముంబయి హై కోర్టులలో జరుగుతున్న విచారణపై సుప్రీం కోర్టు సోమవారంస్టే విధించింది. శానిటరీ నాప్‌కిన్స్‌పై జిఎస్‌టి విధించడానికి సంబం ధించిన అన్ని కేసులపై తామే స్వయంగా విచారణ జరుపుతామని తెలిపింది. శానిటరీ నాప్‌కిన్స్‌పై ప్రస్తుతం 12 శాతం జిఎస్‌టి రేటు విధించారు. వీటిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ గ త ఏడాది జెఎన్‌యు పిహెచ్‌డి విద్యార్థి జర్మినా ఇస్రార్ ఖాన్ ఢిల్లీ హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాప్‌కిన్స్‌పై పన్ను విధించడం అక్రమం, చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. కాటుక, కుంకుమ, బొట్టు బిళ్ళలు, సింధూరం, అల్తా, ప్లాస్టిక్, అద్దాల గాజులు, వినికిడి పరికరాలు, పాసింజర్ బ్యాగ్‌లు, అన్ని రకాల పూజా సామాగ్రి, అన్ని రకాల గర్భనిరోధక సాధనాలను పన్ను శ్లాబు నుండి ప్రభుత్వం మినహాయించింది. కాని మహిళల ఆరోగ్యానికి సంబంధించిన శానిటరీ నాప్‌కిన్స్‌పై అనుచితంగా పన్ను విధించిందని జర్మినా తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

140 అగ్నిమాపక అధికారుల రాజీనామా?

కమల మిల్స్ కేసు


ముంబయి : కమల మిల్స్ అగ్ని ప్రమాదం కేసులో అగ్నిమాపక అధికారులంతా ఏకం కానున్నారు. ఈ కేసులో అనుమతి ఇచ్చిన అధికారిని సస్పెండ్ చేయడంతోపాటు, మరో అధికారి అరెస్టు చేసినందుకు నిరసనగా 140 మంది అగ్నిమాపక అధికారులు రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ముఖ్య అగ్నిమాపక అధికారి పిఎస్ రహంగ్దాలే నేతృత్వంలో ఆదివారం జరిగిన ముంబయి ఫైర్ బ్రి గ్రేడ్ ఆఫీసర్ అసోసియేషన్ సమావేశంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలో వీరు తమ రాజీనామాలను సమర్పిస్తారు. పరిస్థితులు అన్ని సక్రమంగా ఉన్న కారణంగానే అనుమతులు ఇచ్చారని, ఇప్పుడు వారిని బాధ్యులను చేయడం సరికాదని అధికారులు అంటున్నారు. 'మేము ఫైర్ ఫైటర్స్. సంఘటనా ప్రదేశాల్లో పోరాటం చేస్తాము కానీ, ఆఫీసుల్లో కాదు' అని అసోసియేషన్‌కు చెందిన ఒక అధికారి చెప్పారు.డిసెంబరు 29న కమల మిల్స్ ప్రాంగణంలో జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే.

కేరళ గవర్నర్ అనుచిత వైఖరి

ప్రభుత్వ విధాన ప్రకటనలో 'కోతలు'

కేంద్రంపై విమర్శల భాగాన్ని పక్కన పెట్టిన సదాశివం

తిరువనంతపురం : కేరళలో సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రూపొందించిన విధాన ప్రకటన పత్రాన్ని పూర్తిగా చదవకుండా, బిజెపిని విమర్శించే అంశాలను ప్రక్కనబెట్టి గవర్నర్ సదాశివం అనుచితంగా వ్యవహరించారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాల విధాన ప్రకటనకు సంబంధించిన పత్రాన్ని గవర్నర్లు యథాతథంగా చదవడం సాంప్రదాయంగా వుంది. అయితే ఆ సాంప్రదాయాన్ని ఉల్లంఘించి తనకు 'నచ్చని' అంశాలను వదిలివేస్తూ అసెంబ్లీలో సోమవారం గవర్నర్ ప్రసంగించిన తీరు తీవ్ర విమర్శలకు గురైంది. తొలుత ప్రభుత్వ విధాన ప్రకటనకు సంబంధించి రూపొందించిన ప్రసంగ పాఠాన్ని శాసన సభ్యులకు, మీడియాకు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని పక్కనపెట్టి సహకార సమాఖ్య సాంప్రదాయాలను కాలరాస్తూ, స్థానిక సంస్థలతోనూ, జిల్లా అధికారులతోనూ కేంద్ర ప్రభుత్వం నేరుగా సంప్రదిస్తున్న వైఖరిని విమర్శిస్తూ చేసిన ప్రస్తావనలను గవర్నర్ తన ప్రసంగంలో చదవకుండా పూర్తిగా విడిచిపెట్టారు. అలాగే కేరళలో అల్లర్లను ప్రేరేపిస్తున్న కొన్ని మత సంస్థల కుట్రలను గురించిన ప్రస్తావనలను కూడా ఆయన తన ప్రసంగంలో పూర్తిగా వదిలిపెట్టారు. "శాంతి భద్రతల నిర్వహణలో దేశంలోనే అగ్రస్థానంలో వున్న రాష్ట్రంగా కేరళ మరోసారి గుర్తింపు పొందింది. ప్రజలకు నాణ్యమైన జీవనాన్ని అందిస్తున్న రాష్ట్రాలలో దేశంలోనే మొదటి ర్యాంకింగ్‌లో ఉంది. కొన్ని మత సంస్థలు కుట్ర పన్నితే జరిగినవే తప్ప రాష్ట్రంలో మత ఘర్షణలకు సంబంధించిన దృష్టాంతాలు ఏవీ లేవు." అని ప్రసంగ పాఠంలో ఉంది. గవర్నర్ సదాశివం ఇలా కొన్ని అంశాలను వదిలిపెడుతూ



చేసిన ప్రసంగంపై ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించగా దీనిపై వ్యాఖ్యానించేందుకు సిద్ధంగా లేమని చెప్పారు.

రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితికి సంబంధించి కొన్ని మత సంస్థలు ఏడాది కాలంగా సామాజిక, సాంప్రదాయ మీడియాల్లో ప్రచారం జరుపుతున్న విషయాన్ని సదాశివం ప్రస్తావించారు. "శాంతి భద్రతల నిర్వహణలో దేశంలోనే ఉత్తమమైన రాష్ట్రంగా గుర్తింపు తెచ్చుకున్న రాష్ట్రంలో అస్పష్టమైన కారణాలతో కొన్ని మత సంస్థలు అల్లర్లకు పాల్పడుతున్నాయంటూ దేశ వ్యాప్తంగా నెల రోజులపాటు ప్రచారం జరిగింది" అని అన్నారు. ఈ ప్రచారంపై రాష్ట్ర ప్రజలు హ్యాష్ ట్యాగ్‌లతో ప్రతిస్పందించారని ఆయన చెప్పారు. కేరళలోని లౌకిక సాంప్రదాయాలపై ఏడాది కాలంగా అపోహలతో దాడులు జరిగాయని, సామాజిక రంగ విజయాలపైకి ఆ అపోహలను తోసేశారని, సమాజంలోని వివిధ వర్గాల నుంచి శాంతి భద్రతల పరిస్థితి విమర్శలను ఎదుర్కొంటుందని గవర్నర్ అన్నారు..

(మొదటి పేజీ తరువాయి)

దిగజారాం!

వంటి వివిధ అంశాలను పరిగణలోకి తీసుకొని డబ్ల్యుఇఎఫ్ రూపొందించిన సమ్మిళితాభివృద్ధి సూచీలోనూ భారత్ అధోస్థితిలో నిలిచింది. పొరుగునున్న చైనా, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకంటే బాగా వెనుకబడిన భారత్ ఈ జాబితాలో 62వ స్థానానికి దిగజారిందని పేర్కొంది. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు నేపథ్యంలో విడుదలైన ఈ రెండు సర్వేలు భారత్ ఆర్థిక దుస్థితికి దర్పణం పట్టాయి.

జిడిపిని కొలమానంగా తీసుకుంటే అసమానతలే :డబ్ల్యుఇఎఫ్

సమ్మిళిత వృద్ధి, అభివృద్ధి సాధనకు సరికొత్త నమూనాను రూపొందించాలని, ఆర్థిక ప్రగతి అంచనాలకు జిడిపిని కొలమానంగా చేసుకోవటం స్వల్పకాలికత (షార్ట్ టెర్మిజం)కు, అసమానతలకు దారితీస్తుందని డబ్ల్యుఇఎఫ్ హెచ్చరించింది. జీవన ప్రమాణాలు, పర్యావరణ సుస్థిరత, భవిష్యత్ తరాలకు రుణభారం నుండి రక్షణ వంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని రూపొందించిన సమ్మిళితాభివృద్ధి సూచీ-2018 విడుదల సందర్భంగా డబ్ల్యుఇఎఫ్ ఈ హెచ్చరిక చేసింది. ఈ సూచీలో చైనా, పాక్‌ల కంటే దిగువస్థానినికి పరిమితమైంది. చైనాకు 26వ స్థానం లభించగా పాకిస్తాన్ 47వ స్థానంలో నిలిచింది. భారత్ వర్ధమాన దేశాలలో 62 స్థానంలో నిలిచింది. ఈ అభివృద్ధి సూచీని 103 ఆర్థిక వ్యవస్థల ప్రగతి ఆధారంగా అంచనా వేశారు. అభివృద్ధి చెంది న ఆర్థిక వ్యవస్థల జాబితాలో నార్వే, ఐర్లండ్, లక్సెంబర్గ్, డెన్మార్క్ టాప్ 5లో స్థానం దక్కించుకున్నాయి. ఈ సూచీలో ఐరోపాకు చెందిన చిన్న దేశాలు ఆధిపత్యం సంపాదించగా నాన్ ఐరోపా దేశాలలో కేవలం ఆస్ట్రేలియా (9) మాత్రమే టాప్ టెన్‌లో స్థానం దక్కించుకుంది. బ్రిక్స్ కూటమి దేశాలలో రష్యాకు 19, చైనాకు 26, బ్రెజిల్‌కు 37, భారత్‌కు 62, దక్షిణాఫ్రికాకు 69వ స్థానం లభించాయి. సమ్మిళిత వృద్ధి సాధనలో పొరుగుదేశాలు భారత్ కన్నా మెరుగైన స్థానాలు సాధించటం గమనార్హం. ఇందులో శ్రీలంక 40, బంగ్లాదేశ్ 34, నేపాల్ 22 స్థానాలలో నిలిచాయి.

పాకిస్తాన్ కంటే భారత్ వెనుకబాటు : : ఆక్స్‌ఫామ్

భారత్‌లో గతేడాది కాలంలో ఆర్థిక అసమానతలు గణనీయంగా పెరిగాయని ఆక్స్‌ఫామ్ సంస్థ నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడయింది. గతేడాదిలో దేశంలో ఉత్పత్తి అయిన మొత్తం సంపదలో 73 శాతం మేర ఒక శాతంగా వున్న సంపన్నుల చేతుల్లోనే కేంద్రీకృతమైందని, దీనితో ఆర్థిక అసమానతలు మరింతగా పెరిగాయని వివరించింది. దేశ జనాభాలో సగానికి పైగా వున్న 67 కోట్ల మంది నిరుపేద భారతీయుల సంపద ఈ ఏడాదిలో కేవలం ఒక్క శాతం మాత్రమే పెరిగిందని పేర్కొంది. ఆర్థిక ప్రగతి విషయంలోనూ పొరుగుదేశం పాకిస్తాన్ కంటే భారత్ బాగా వెనుకబడివుందని ఆక్స్‌ఫామ్ పేర్కొంది. ఈ జాబితాలో చైనా 26వ స్థానంలోనూ, పాకిస్తాన్ 47వ స్థానంలోనూ నిలవగా భారత్ 67వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. భారత్‌లో ఒక శాతం మేర వున్న ధనికుల సంపద గతేడాదిలో రూ.20.9 లక్షల కోట్లకు పెరిగిందని ఇది 2017-18లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు సమానమని ఆక్స్‌ఫామ్ ఇండియా తన నివేదికలో వివరించింది. భారత్‌లో సగటు గ్రామీణ కార్మికుడు ఒక కంపెనీ ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగి సంపాదన సాధించటానికి కనీసం 941 ఏళ్లు పడుతుందని ఆక్స్‌ఫామ్ అధ్యయన నివేదిక అభిప్రాయపడింది. అదే అమెరికాలో ఒక సామాన్య కార్మికుని ఏడాది సంపాదనను ఒక సంస్థ సిఇఓ ఒక్కరోజులో సంపాదిస్తున్నాడని వివరించింది. భారత్‌లో గత ఏడాది కాలంలో కొత్త 17 మంది శతకోటీశ్వరులు అవతరించారని, దీనితో ఇప్పుడు వారి సంఖ్య 101కి చేరిందని వివరించింది. వీరి సంపద గత ఏడాది వున్న రు.4.89 లక్షల కోట్ల స్థాయి నుండి ప్రస్తుతం రు.20.7 కోట్ల స్థాయికి దాటిందని నివేదిక వెల్లడించింది.

కార్పొరేట్ రాయితీలు రద్దు చేయాలి

దేశ ఆర్థిక వ్యవస్థను కేవలం కొందరు అదృష్టవంతులకు మాత్రమే కాక అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని ఆక్స్‌ఫామ్ సంస్థ కోరింది. పన్ను ఎగవేతను అరికట్టేందుకు చట్టనిబంధనలను కఠినంగా అమలు చేయాలని, ధనికులపై పన్నులు పెంచడంతో పాటు కార్పొరేట్ పన్ను రాయితీలను రద్దు చేయాలని సూచించింది.

ప్రపంచంలో రెండు రోజులకో శతకోటీశ్వరుడు

2016-17 మధ్య కాలంలో ప్రపంచంలోని అనేక దేశాలలో చోటుచేసుకున్న పరిణామాలలో ప్రతి రెండు రోజులకో శతకోటీశ్వరుడు ఆవిర్భవించారని ఆక్స్‌ఫామ్ తన అధ్యయన నివేదికలో వెల్లడించింది.

అమెరికాలో అత్యంత ధనికులైన ముగ్గురి వద్ద ఆ దేశ జనాభాలో సగం మంది వద్ద వున్న సంపదకు సమానమైన సంపద పోగుపడిందని ఈ నివేదికలో వివరించారు. 2017లో ఉత్పత్తియైన ప్రతి ఐదు డాలర్ల సంపదలో నాలుగు డాలర్ల (80 శాతం) మేర ప్రపంచ జనాభాలో ఒక శాతం వున్న సంపన్నుల జేబుల్లో చేరిందని, ప్రపంచ జనాభాలో సగానికి పైగా వున్న నిరుపేదలకు ఒరిగిందేమీ లేదని ఈ నివేదికలో వెల్లడించారు.

మారని పేదల బతుకులు

ప్రపంచ జనాభాలో దాదాపు సగం మేర వున్న 370 కోట్ల మంది నిరుపేదల సంపదలో ఎటువంటి మార్పూ లేదని ఈ నివేదిక వెల్లడించింది. గత ఏడాది ప్రపంచంలో ఉద్భవించిన సంపదలో 82 శాతం జనాభాలో 1 శాతం మేర వున్న ధనికుల చేతుల్లో చేరిందని వివరించింది. 'మన ఆర్థిక వ్యవస్థలు లక్షలాది మంది ప్రజల శ్రమను గుర్తించటానికి బదులు సంపన్నుల చేతికే సంపదను అందిస్తున్నాయన్న విషయాన్ని తమ అధ్యయనం మరోసారి రుజువు చేసిందని ఈ నివేదికను విడుదల చేసిన ఆక్స్‌ఫామ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విన్నీ బ్యాన్యిమా వ్యాఖ్యానించారు. సంపన్నులుగా వున్న కొద్ది మంది మరింత సంపన్నులవుతున్నారని, అట్టడుగు స్థాయిలో వున్న లక్షలాది మంది ప్రజలు ఇంకా నిరుపేదరికంలోనే మగ్గుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఈ ఆర్థిక అసమానతలకు ప్రధానంగా పన్ను ఎగవేతలే కారణమని ఆమె అన్నారు. పన్ను ఎగవేతకు పాల్పడి పన్ను స్వర్గాలలో దాచుకున్న నల్లడబ్బును వెలికి తీసి విద్య, ఆరోగ్యం, యువతకు ఉపాధి కల్పన వంటి రంగాలలో ఖర్చు చేయాలని ఆమె ప్రపంచ నేతలను కోరారు. ఈ సదస్సుకు హాజరవుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'శతకోటీశ్వరుల కేబినెట్'కు నేతృత్వం వహిస్తున్నారని ఆమె విమర్శించారు. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమలు చేస్తున్న పన్ను విధానాల వల్ల అత్యంత ధనికులు మరింత లబ్ది పొందుతున్నారు తప్ప సామాన్య అమెరికన్లకు ఎటువంటి ప్రయోజనమూ కలగటంలేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్థిక అసమానతలకు మహిళలే సమిధలవుతున్నారని, పురుషులతో సమానంగా పనిచేస్తున్నా తక్కువ వేతనాలతోనే బతుకు గడపాల్సి వస్తోందని ఆక్స్‌ఫామ్ తన నివేదికలో పేర్కొంది. సమాన పనికి సమాన వేతనం అన్న సూత్రాన్ని అందరికీ వర్తింపచేయాలని, పన్ను ఎగవేతను అడ్డుకునేందుకు కఠిన చట్టాలను అమలు చేయాలని ఆక్స్‌ఫార్డ్ పిలుపునిచ్చింది.

థాయ్ మార్కెట్‌లో బాంబు పేలుడు

ముగ్గురి మృతి, 18 మందికి గాయాలు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ దక్షిణ ప్రాంతంలోని యాలా ప్రావిన్స్‌లో వున్న ఒక రద్దీ మార్కెట్‌లో సోమవారం జరిగిన బాంబు పేలుడులో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారని, మరో 18 మంది గాయపడ్డారని పోలీసులు చెప్పారు. ఒక వ్యక్తి పార్క్ చేసిన మోటార్ సైకిల్‌లో పేలుడు పదార్థాలు పేలటం వల్ల ఈ దుర్ఘటన జరిగిందని, ఆ చేసిన వ్యక్తి మార్కెట్ నుండి వెళ్లిపోయిన తరువాత ఈ పేలుడు సంభవించిందని పోలీసు అధికారి ఒకరు వివరించారు. బౌద్ధుల ప్రాబల్యం అధికంగా వుండే థాయ్‌లాండ్ దక్షిణ ప్రాంతంలోని మూడు జిల్లాల్లో ముస్లింల ప్రాబల్యం అధికం కావటం విశేషం. ఈ మూడు ప్రావిన్స్‌ల్లో 2004 నుండి కొనసాగుతున్న హింసాకాండలో ఇప్పటి వరకూ దాదాపు 6,500 మంది మరణించారు.



। అమ్మాన్‌లో మైక్‌పెన్స్

అమ్మాన్‌లోని రాయల్ ప్యాలెస్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌తో జోర్డాన్ రాజు అబ్దుల్లా ఆయన భార్య రైనా

అణు ఒప్పందాన్ని అమలు చేయాలి

ఇరాన్ స్పష్టీకరణ

టెహరాన్ : అణు ఒప్పందంపై సంతకాలు చేసిన ఆరు దేశాలు ఒప్పందానికి అనుగుణంగా వ్యవహరించినట్లైతే తాము కూడా ఆ నిబంధనలకు కట్టుబడి వుంటామని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహని స్పష్టం చేశారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా, జర్మనీలు ఒప్పందాన్ని కాపాడుతూ వచ్చినంత కాలం తాము కూడా అందుకు అనుగుణంగానే వుంటామని చెప్పారు. 'ఒప్పందాన్ని పరిరక్షించడం వల్ల సమస్యలను దౌత్యపరంగా పరిష్కరించుకోవచ్చనే ఆశాభావం అంతర్జాతీయ సమాజంలో పెరుగుతుందని, అదే ఒప్పందాన్ని బలహీనపరిస్తే ఖచ్చితంగా దౌత్య పరిష్కారాన్ని దెబ్బతీస్తుందని తాము విశ్వసిస్తున్నామని రౌహని పేర్కొన్నారు.

2015లో కుదిరిన ఈ ఒప్పందం ఇరాన్, ఇయుల మధ్య సహకారాన్ని పెంచడానికి ఒక ప్రాతిపదికను ఏర్పరచిందని అన్నారు. యావత్ ప్రపంచం మద్దతిస్తున్న ఈ ఒప్పందం నుండి బయటకు వచ్చినట్లైతే అమెరికా తీవ్ర రాజకీయ తప్పిదం చేసినట్లే కాగలదని అన్నారు. ఒకటి రెండు దేశాలు మినహా మొత్తంగా అంతర్జాతీయ సమాజం ఈ ఒప్పందాన్ని బలపరుస్తున్నాయి. ఈ ఒప్పందంలో ఏ మాత్రం మార్పు చేసినా అంగీకరించేది లేదని ఇరాన్ ఇప్పటికే పలుసార్లు ఉద్ఘాటించింది.

ప్రచ్ఛన్న యుద్ధం కాలం కన్నా అధ్వాన్న పరిస్థితులు : రష్యా

మాస్కో : ప్రస్తుతం పశ్చిమ దేశాలు అనుసరిస్తున్న 'రష్యా ఫోబియా', ప్రచ్ఛన్న యుద్ధం నాటి వాతావరణం కన్నా అధ్వాన్నంగా వుందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్ రోవ్ ఆదివారం వ్యాఖ్యానించారు. "ఇప్పుడు నెలకొన్న రష్యా ఫోబియా గతంలో ఎన్నడూ లేదని. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో కూడా ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొన లేద'ని ఆయన పేర్కొన్నారు. న్యూయార్క్‌లో పర్యటన అనంతరం స్వదేశానికి తిరిగి వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో 'కొంత మర్యాద, గౌరవం వుండేది, కానీ ఇప్పుడు అవన్నీ పక్కకు నెట్టేశారు.' అని అన్నారు. తమపై అమెరికా, యురోపియన్ యూనియన్ విధించిన ఆంక్షలు అర్థం లేనివని, నిరాధారమైనవని ఆయన పేర్కొన్నారు. 2014 లో క్రిమియా ద్వీపకల్పాన్ని ఆక్రమించు కుందని ఆరోపిస్తూ రష్యాపై ఆంక్షలు విధించారు.

చైనా నావికాదళంలోకి కొత్త బాంబర్

బీజింగ్ : ఆధునిక తరహా యుద్ధాల్లో నావికాదళం సామర్థ్యాలను మరింత పెంపొందించగల కొత్త తరహా సైనిక విమానాన్ని చైనా రూపొందించింది. ఈ కొత్త విమానం దక్షిణ, తూర్పు చైనా సముద్రాల రక్షణ బాధ్యతలను కూడా నిర్వర్తిస్తుందని మీడియా వార్తలు తెలిపాయి. ఇటీవలే హెచ్-6జి బాంబర్‌ను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ) నేవీకి చెందిన దక్షిణ చైనా సముద్ర నౌకా దళంలోకి తీసుకున్నారు. ఈ విమానం రెక్కల కింద ఎలక్ట్రానిక్ కౌంటర్ మెజర్స్ (ఇసిఎం) పాడ్స్ వుంటాయి. ఎలక్ట్రానిక్ యుద్ధంలో సహాయకారిగా నిలిచే పాత్రను ఈ బాంబర్ పోషించడం ఇదే ప్రథమం అని చైనా సెంట్రల్ టెలివిజన్ (సిసిటివి) తెలిపింది.

అమెరికావ్యాప్తంగా ఇంటికే పరిమితమైన సిబ్బంది

స్తంభించిన ప్రభుత్వం



వాషింగ్టన్ : అమెరికా ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు అవసరమయ్యే నిధులను సమకూర్చే వ్యయబిల్లును ఆమోదించే తక్షణ పరిష్కారమేదీ అందుబాటులో లేకపోవడంతో సోమవారం కూడా ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ఉద్యోగుల్లో మెజారిటీ వర్గం సోమవారం ఇంటిపట్టుకే పరిమితమయ్యారు. దాదాపు 8లక్షల మంది ఉద్యోగులు ఇలా శలవులో వున్నారని అంచనా. కాగా ఈ సంక్షోభం నుండి బయటపడేందుకు సెనెట్‌లో డెమొక్రాట్ నేత చార్లెస్ షమర్ ఒక ప్రతిపాదన చేశారు. ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విమానాశ్రయంలోని బ్యాగేజ్ అండ్ పాసింజర్ స్క్రీనర్స్ సిబ్బంది విధులకు హాజరు కావాల్సిందేనని అధికార యంత్రాంగం ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే ఒప్పందం కుదిరేంతవరకు వీరికి వేతనాలు చెల్లించరు. విస్తారమైన అమెరికన్ మిలటరీ నిఘా యంత్రాంగమంతా విధి నిర్వహణలో పాల్గొనాల్సిందే. ఆరోగ్య, సంక్షేమ రంగాలకు చెందిన కార్యకలాపాలు కూడా మూత పడ్డాయి. ఫలితంగా వ్యాధి నియంత్రణ, నిరోధక కేంద్రాలకు చెందిన సిబ్బందిలో 60శాతానికి పైగా ఇంటికే పరిమితమయ్యారు. దేశవ్యాప్తంగా 80శాతం పాఠశాలల సిబ్బంది, 90శాతానికి పైగా రవాణా సిబ్బంది విధులకు హాజరు కాలేదు. ఈ మొత్తం అధ్యాయంలో కీలకమైన అంశం ఏమిటంటే కార్మిక వర్గం తరపున మాట్లాడే బలమైన రాజకీయ వాణి కొరవడడమేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

యుద్ధభయం పెంచుతున్న జపాన్

క్షిపణి రక్షణ విన్యాసాలు

టోక్యో: క్షిపణి దాడుల నుండి రక్షించుకునేందుకనే పేరుతో జపాన్ ప్రభుత్వం తమ ప్రజలలో భయాందోళనలను పెంచటానికి పూనుకున్నది.ఇందుకు ఇటీవలి కాలంలో ఉ.కొరియా నిర్వహించిన క్షిపణి పరీక్షలను సాకుగా వినియోగించు కున్నది. ప్రజలను క్షిపణి దాడుల పట్ల అప్రమత్తం చేసే పేరుతో సోమవారం నాడు రాజధాని టోక్యో నగరంలో రక్షణ విన్యాసాలను నిర్వహించారు. క్షిపణి దాడుల హెచ్చరికలతో ప్రజలను తరలించి సబ్ స్టేషన్లలోనూ, ఇతర భూగర్భ గృహాలలోనూ ఆశ్రయం కల్పించారు. దాదాపు 300 మంది వాలంటీర్లు పాల్గొన్న ఈ విన్యాసా లను టోక్యో నగరంలోని డోమ్ బేస్‌బాల్ స్టేడియంలో నిర్వహించారు. కాగా ప్రభుత్వ విన్యాసాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కొందరు ప్రజలు తమలో భయాందో ళనలు రేకెత్తించే విధంగా ఈ విన్యాసాలేమిటంటూ పోలీసులతో ఘర్షణకు దిగారు. ద.కొరియా వచ్చే నెలలో నిర్వహిస్తున్న శీతాకాలం ఒలింపిక్స్‌లో ఉ.కొరియా ప్రతినిధి బృందం పాల్గొం టున్న నేపథ్యంలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో నెలకొం టున్న ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయని అందరూ ఆశిస్తున్న వేళ జపాన్ తన ప్రజల్లో యుద్ధ భయాందో ళనలు రేకెత్తించే విధంగా ఈ విన్యాసాలు చేపట్టటం గమ నార్హం. ఉ.కొరియా అణు, క్షిపణి కార్యక్రమాలను కొనసాగిస్తుండటంతో ఆ దేశం నుండి తమకు క్షిపణి దాడుల ముప్పు తప్పదని భావిస్తున్న జపాన్ ప్రభుత్వం ఆత్మ రక్షణ దిశగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఈ విన్యాసాలను చేపట్టిందని జపాన్ ప్రభుత్వ అధికారి హిరోయుకు స్యునాగా వాలంటీర్లకు వివరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ అనవసర విన్యాసాల పట్ల ఎక్కువ మంది ప్రజలు విము ఖత వ్యక్తం చేశారు.

గత 20ఏళ్ళలో మెక్సికోలో పెరిగిన నరమేధం

మెక్సికో సిటీ : దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని విధంగా మెక్సికోలో నరమేధం చోటు చేసుకుందని హోం శాఖ తెలిపింది. 2017లో 29,168 హత్యలు చోటు చేసుకున్నాయని, ఇది 2016కన్నా 27శాతం ఎక్కువ అని పేర్కొంది. 1997 నుండి ఇందుకు సంబంధించిన రికార్డులన్నీ వున్నాయని, వాటితో పోల్చుకుంటే ఇదే అత్యధికమని పేర్కొంది. 2011లో మెక్సికోలో మాదకద్రవ్యాల పోరు సాగినపుడు కూడా రికార్డు స్థాయిలో హత్యలు జరిగాయని తెలిపింది. 2017లో ప్రతి లక్షమందికీ మృతుల రేటు 20.5గా వుండగా, 2011లో 19.4 గా వుందని హోం శాఖ పేర్కొంది. అయితే హోం శాఖ అధికారులు వెలువరించిన దాని కన్నా హత్యల రేటు ఎక్కువగానే వుండవ చ్చునని మెక్సికో భద్రతా వ్యవహారాల నిపుణుడు అలెజాండ్రో హోప్ పేర్కొన్నారు. పోలీ సులు జరిపిన హత్యల కేసుల దర్యాప్తు ప్రాతిపదికన ఈ గణాంకాలు రూపొందించారు కానీ బాధితుల ఆధారంగా కాదని చెప్పారు. ఒకసారి జరిగిన హత్య ఘటనలో బాధి తులు ఒకరి కంటే ఎక్కువ వుండవచ్చునని తెలిపారు. వాస్తవానికి ప్రతి లక్ష మందికి మృతుల రేటు 24 వరకు వుండవచ్చునని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రమాదకరమైన దేశం మెక్సికో అని గత వారం ట్రంప్ ప్రకటించినప్పటికీ లాటిన్ అమెరికా దేశాల్లో అనేక చోట్ల హత్యల రేటు ఎక్కువగానే వుంది.

పాక్ మాజీ రాయబారి హక్కానీపై కేసు నమోదు



ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌ను అప్రతిష్టపాల్జేస్తున్నారంటూ అమెరికాలో పాకిస్తాన్ మాజీ రాయబారి హుస్సేన్ హక్కానీపై కేసు నమోదు చేశారు. పాక్ సైన్యానికి, ప్రభుత్వానికి అప్రతిష్ట కలిగించే విధంగా పుస్తకాలు, వ్యాసాలు రాయడం, విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారంటూ హక్కానీపై రెండు పోలీసు స్టేషన్లలో ముగ్గురు వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని డాన్ పత్రిక పేర్కొంది. ఖైబర్-ఫక్తూన్‌ఖవా ప్రావిన్స్‌లోని కోహట్ జిల్లాలో కేసులు నమోదయ్యాయి. హక్కానీ మెమోగేట్ కుంభకోణం సూత్రధారి అని, అమెరికాలో రాయబారిగా వుంటున్న సమయంలో సిఐఎ, భారత ఏజెంట్లకు వీసాలు జారీ చేశారని అస్ఫర్ అనే వ్యక్తి తన ఫిర్యాదులో ఆరోపించారు. హక్కానీ తమకు లొంగిపోవాలని లేదా ఆయన పరారీలో వున్నట్లు ప్రకటిస్తామని పోలీసు అధికారి తెలిపారు. వాషింగ్టన్ పోస్ట్‌లో ఆయన రాసిన వ్యాసాలకు గానూ పాక్ పార్లమెంట్ తీవ్రంగా విమర్శించింది.

రోహింగ్యాల తిరుగు ప్రయాణంలో జాప్యం

బంగ్లాదేశ్ వెల్లడి

గంగ్డమ్ (బంగ్లాదేశ్): గత ఏడాది ఆగస్టు నుండి మయన్మార్ నుండి తమ దేశానికి వలస వచ్చిన రోహింగ్యాలను తిప్పి పంపటంలో కొంత జాప్యం అనివార్యమవుతోందని బంగ్లాదేశ్ వెల్లడించింది. తొలుత ప్రకటించిన ప్రకారం మంగళవారం నుండి వారిని స్వదేశానికి తిప్పి పంపాల్సి వున్నప్పటికీ అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి కాకపోవటంతో ఈ ప్రక్రియను వాయిదా వేసినట్లు బంగ్లా అధికారులు చెప్పారు. దీనికి సంబంధించి పూర్తి కావాల్సిన అనేక అంశాలు వున్నాయని బంగ్లాదేశ్ శరణార్థి, పునరావాస వ్యవహారాల కమిషనర్ అబుల్ కలామ్ మీడియాకు చెప్పారు. మయన్మార్‌కు తిప్పి పంపాల్సిన వారి జాబితా తయారీ, దాని పరిశీలన, ఇంకా పూర్తి కాలేదని, తాత్కాలిక శిబిరాల ఏర్పాటు కూడా అసమగ్రంగానే వుందని ఆయన వివరించారు. బంగ్లాదేశ్, మయన్మార్ మధ్య గత వారం కుదిరిన ఒప్పందం ప్రకారం బంగ్లానుండి తిరిగి వచ్చే రోహింగ్యాలను మయన్మార్ ప్రభుత్వం తమ సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన రెండు రిసెప్షన్ కేంద్రాల ద్వారా స్వీకరించి వారిని ఉమ్మడి సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరానికి తరలించి అక్కడ వచ్చే రెండేళ్ల పాటు వారిని కాపాడాల్సి వుంది.

మొదటి పేజీ తరువాయి

నేడు స్కీం వర్కర్ల సమ్మె

ప్రభుత్వం రూ.81వేల కోట్ల మేర బడ్జెట్‌ను తగ్గించింది. దీంతో రాష్ట్రప్రభుత్వాలపై భారం పడింది. అదేవిధంగా ఈ పథకాల్ని ప్రైవేట్‌కు అప్పగించేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 4వేల అంగన్‌వాడీ కేంద్రాల్ని వేదాంతి సంస్థకు అప్పగించింది. రాష్ట్రంలో తూర్పు గోదావరి జిల్లాలోని రంపచోడవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమలు కావడం లేదు. కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి సామాజిక భద్రత అవకాశాలు కల్పించాలని 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ చేసిన తీర్మానాల్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 17న జరిగిన కార్యక్రమానికి మద్దతు తెలిపిన టిడిపి, రాష్ట్రంలో మాత్రం అణచివేసేందుకు కుట్రలు పన్నుతోంది. అంగన్‌వాడీలు సమ్మెలో పాల్గొనవద్దని, పాల్గొన్న కార్మికుల్ని తొలగిస్తామని స్పెషల్ కమిషనర్ ఆదేశాలిచ్చారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు భోజనం వండి వెళ్లాలని అధికార యంత్రాంగం ద్వారా ఒత్తిడి తెస్తోంది. కార్మికులు మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ సమ్మె నిర్వహిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగానే విధుల్ని బహిష్కరించి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టనున్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘీభావం

కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్కీం వర్కర్ల సమస్యలపై జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెకు ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సంఘీభావం తెలిపింది. ఉద్యోగ భద్రత, కార్మికులుగా గుర్తింపు, సామాజిక భద్రత సమస్యలపై స్కీం వర్కర్లు ఐక్యంగా పోరాడుతున్నారని ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె జిలానీ భాషా, సిహెచ్ సుందరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మెలో పాల్గొన వద్దని ప్రభుత్వం బెదిరించడం కార్మిక వ్యతిరేక చర్య అని తెలిపారు. ఐక్యంగా సమ్మెలో పాల్గొని హక్కుల్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

హోదా ఇస్తే బిజెపితో పొత్తు

మండలం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా రిలయన్స్ పెట్రోలు బంక్ వద్ద మైనార్టీలు స్వాగతం పలికారు. నెల్లిమానుకండ్రిగ, శివనాథపాళెంలోని ప్రజలు తమ సమస్యలను వివరించారు. తొట్టంబేడు వద్ద పిహెచ్‌సి సిబ్బంది వేతనాలు, రెగ్యులైజేషన్‌పై జగన్‌కు వినతిపత్రాలు అందజేశారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పల్లమాలలో దళితుల ఆత్మీయ సభలో ప్రసంగించారు. అనంతరం సిఎన్ఎన్ నేషనల్ ఛానెల్‌కు సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకటిన్నర శాతం ఓట్లతో బాబు అధికారంలోకొచ్చి అసత్య హామీలతో ఆంధ్రా ప్రజలను మోసం చేశారన్నారు. తనపై కాంగ్రెస్, టిడిపి పెట్టిన కేసులను ఎప్పటికీ మరచిపోనన్నారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు గౌరవనీయ వ్యక్తిగానే ఉన్నా కాంగ్రెస్‌ను వీడిన తర్వాత తనపై కేసులు నమోదు చేశారని చెప్పారు. పార్లమెంటులో ప్రత్యేకహోదాపై ఇచ్చిన హామీని బిజెపి నెరవేరిస్తే ఏ ఇతర ఆలోచన లేకుండా బిజెపితో కలిసి ఎన్నికలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియో టేపుల్లో రెడ్‌హ్యాండెట్‌గా దొరికిపోయిన చంద్రబాబు ఇంకా సిఎంగా కొనసాగే అర్హత లేదన్నారు. ఒక సామాన్య వ్యక్తి ఇలా దొరికుంటే శిక్షపడేదని, అదే చంద్రబాబు అధికారంలో ఉండటం వల్ల తప్పించుకుంటున్నారని జగన్ వ్యాఖ్యాలు చేశారు. రాజధాని నిర్మాణంలో సిఎం చెప్పేవన్నీ అసత్యాలేనన్నారు. తమిళనాడులో డిఎంకె పార్టీ నేత రాజా, ఎపిలో జగన్ ఫేస్ ఆఫ్ కరెప్షన్‌గా ఉన్నారన్న అభిప్రాయాన్ని జగన్ తీవ్రంగా ఖండించారు. అంతకుముందు పల్లమాల ఆత్మీయ సభలో మధ్యాహ్నం మాట్లాడుతూ తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని నిరుపేదలకు పలు విడతలుగా 12 లక్షల ఎకరాలను భూ పంపిణీ చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే భూ పంపిణీ అనే మాటనే మరిచిపోయారన్నారు. తమ పార్టీకి అధికారం కట్టబెడితే ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి, రుణాలు, పంట బీమా సౌకర్యాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్క దారి పట్టించకుండా దళితవాడల అభివృద్ధికే కేటాయిస్తానని తెలిపారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని సెజ్‌లు, పరిశ్రమల్లో స్థానిక దళితులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎవరైనా దళితుడిగా ఎందుకు పుట్టాలని కోరుకుంటాడని అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు దళితులను తీవ్రంగా అవమానించారనీ, అలాంటి వ్యక్తికి దళితులు ఓట్లేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపిలు మిథున్‌రెడ్డి, వరప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెదగొట్టిపాడులో దళితులపై దాడి చేసిన

నేరస్తుల్ని అరెస్టు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయలేదని, ప్రభుత్వమే వారికి రక్షణ కల్పిస్తోందని తెలిపారు. పైగా ఆందోళనలో పాల్గొంటున్నారనే పేరుతో గ్రామంలో ఉన్న యువతీ, యువకుల్ని అదుపులోకి తీసుకుంటున్నారని చెప్పారు. సుమారు 200 నుండి 300 మంది పోలీసులు గ్రామంలో ఇప్పటికీ పహారా నిర్వహిస్తున్నారని, దాడి చేసిన వారికంటే బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ ఎవరినీ నోరెత్తనీయడం లేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దళిత సంఘాలు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపేందుకు వెళితే అరెస్టులు చేస్తున్నారని, ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం దళితులకు వ్యతిరేకంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. గ్రామంలోకి వెళ్లిన వారికి అరెస్టు చేస్తూ పోలీసులు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేంకగా, దళితులకు సంఘీభావంగా 24న చలో పెదగొట్టిపాడు నిర్వహిస్తున్నామని, అడ్డుకోవాలని చూస్తే జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

బటయ వక్తులను అనుమతించం అర్బన్ ఎస్‌పి విజయరావు

పెదగొట్టిపాడులోకి బయటి వ్యక్తులను అనుమతించబోమని గుంటూరు అర్బన్ ఎస్‌పి సిహెచ్ విజయరావు తెలిపారు. గ్రామంలోకొచ్చి సభలు, సమావేశాలు నిర్వహించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. 24న చేపట్టిన చలోగొట్టిపాడుకు పోలీసుల అనుమతి తీసుకోలేదని, పోలీసుల అనుమతి తప్పనిసరని చెప్పిన ఎస్‌పి గ్రామంలో 144 సెక్షన్ కొనసాగుతోందన్నారు. గ్రామంలో వివాదానికి సంబంధించి దళితులు, పెత్తందార్లకు చెందిన ఇరుపక్షాలపై కేసులు నమోదు చేశామన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో రాజీ చేసి శాంతి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ఘర్షణలు పునరావృతమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పరామర్శకు వెళ్లిన సిపిఎం నాయకుల అరెస్టు

పెదగొట్టిపాడులో దళితులపై ఈనెల ఒకటో తేదీన జరిగిన దాడిలో గాయపడిన బాధిత కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన నాయకులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గ్రామంలో అల్పాహారం తీసుకుంటుండగా సిపిఎం తూర్పు గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్యాద్రి, జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావులను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా భారీ స్థాయిలో గుమిగూడిన దళితులు అడ్డుకున్నారు. అయినప్పటికీ పోలీసులు ఆందోళనకారు లను అరెస్టు చేసి ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు అక్కడ నుండి చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తరువాత గ్రామానికి వెళ్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్యను ప్రత్తిపాడులో అరెస్టు చేసి చేబ్రోలుకు తరలించారు. తెనాలిలో కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణను కూడా అరెస్టు చేశారు.



పెదగొట్టిపాడు దళితులను పరామర్శించేందుకు వెళ్లిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. కృష్ణయ్య, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సిపిఎం గుంటూరు (తూర్పు) జిల్లా కార్యదర్శి రామారావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి క్రిష్ణమోహన్‌లను అరెస్టు చేసిన పోలీసులు

కేసులో లేనివాళ్లను చూపిస్తున్నారు

సిపిఎం తూర్పు గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ జనవరి ఒకటిన దాడులకు ఆద్యులైన పాండు, ఉపేంద్ర, భాస్కర్ల పేర్లు కేసులో పొందుపరచలేదనీ, కేసుతో సంబంధం లేనివారిని నిందితులుగా చూపిస్తున్నారని దళితులు చెబుతున్నారన్నారు. దాడులు చేసినా సెక్షన్ 307 కింద కేసులు నమోదు చేయలేదన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకరరావు ఇప్పటివరకు పెద్దగొట్టిపాడు దళితవాడకు ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలన్నారు.

స్టేషన్‌కు వచ్చిన దళిత మహిళలు

తమ కాలనీని సందర్శించడానికి వచ్చిన సిపిఎం నాయకులను అక్రమంగా ఆరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారని వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దగొట్టిపాడుకు చెందిన మహిళలు పత్తిపాడు పోలీస్ స్టేషనుకు వచ్చి పోలీసులపై వాదనకు దిగారు. పోలీసులు వారిని భయపెట్టి పంపించేశారు.

భారీగా భోగాపురం భారం

(మొదటి పేజీ తరువాయి)

ఎనిమిది మంది బిడ్డర్లు వచ్చారు. ఎఎఐ, జిఎంఆర్, జివికె, అంబానీ, ఆదానీ, టాటా సన్స్ మొదలైనవారంతా బిడ్డింగు కోసం తొలుత తమ సమ్మతిని తెలిపారు. ఎఎఐ తప్ప మిగతా ప్రయివేటు కంపెనీలన్నీ భోగాపురం ప్రాంతాన్ని సందర్శించి అసంతృప్తిని వ్యక్తం చేశాయి, ఆర్థికపరంగా సాధ్యపడదని (వయబిలిటీ లేదని), మౌలిక వసతులకే అధిక ఖర్చవుతుందని, ప్రయాణికుల సంఖ్య కూడా గ్యారెంటీ లేదంటూ అందరూ చేతులెత్తేశారు. చంద్రబాబు ప్రభుత్వం జిఎంఆర్‌తో పదేపదే జరిపిన చర్చలతో లాభంలో 21.6 శాతం మాత్రమే చెల్లించడానికి ఆ సంస్థ ఒప్పుకుంది. అయితే, ఎఎఐ 30.2 శాతం చెల్లించేందుకు అంగీకరిస్తూ ప్రతిపాదనలు ఇచ్చింది. నిబందనల ప్రకారం టెంబర్లు తెరవగా సాంకేతిక బిడ్లులో జిఎంఆర్, ఎఎఐ అర్హత సాధించగా, తాజాగా తెరిచిన ఆర్థిక బిడ్లలో ఎఎఐ సంస్థ తనకు వచ్చే లాభాల్లో 30.2 శాతాన్ని చెల్లించేందుకు ప్రతిపాదించడం, జిఎంఆర్ మాత్రం 21.6 శాతానికే పరిమితం కావడంతో తప్పనిసరిగా ఎఎఐకే టెండర్ ఖరారు చేయాల్సిఉండగా, రాష్ట్ర ప్రభ్వుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. మరోవైపు భోగాపురం ఏయిర్‌పోర్టు నిర్మాణం చేపడిత నష్టపోవడం తప్ప లాభం రాదన్నది జిఎంఆర్ సంస్థ నిర్వహించిన సొంత సర్వేలో తేలినట్టు సమాచారం.

ఎంత భారం ?

భోగాపురం ఎయిర్ పోర్టుకు ప్రభుత్వం తొలుత చెప్పిన ఖర్చు రూ.2260 కోట్లు మాత్రమే. ఇప్పటికే రూ.860కోట్ల రుణం ఈ పేరుమీద నాబార్డు వద్ద ప్రభుత్వం తీసుకుని అమరావతిలో తాత్కాలిక సచివాలయానికి దారిమళ్లించినట్లు సమాచారం, జిఎంఆర్ అంచనా ప్రకారం బ్యాంకు రుణం కూడా మొత్తం రాదు. పైగా పిపిపి కింద ఎయిర్ పోర్టు నిర్మాణం, టౌన్‌షిప్, షాపింగ్ మాల్స్, రీ హేబిలిటేషన్ ప్యాకేజీ అంతా కలిపితే సుమారు రూ.10వేల కోట్లవుతుందన్నది తెలుస్తోంది. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ఇప్పటికే 2726 ఎకరాల భూమిని దాదాపుగా సేకరించారు.

జిఎంఆర్ కోసమేనా?

ప్రభుత్వం పైకి ఎన్ని కారణాలు చెబుతున్నప్పటికీ జిఎంఆర్ కోసమే తాజా నిర్ణయం తీసుకున్నారన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. దీనికోసయే ఎఎఐకి అవార్డు ప్రకటనలో జాప్యం చేస్తూ వచ్చింది. చివరకు కొత్త అంశాల్ని ప్రాజెక్టు రిపోర్టులో చేర్చడం ద్వారా పాత టెండర్లను రద్దు చేసి, కొత్త టెండర్లను పిలవాలని నిర్ణయించింది.పాత టెండర్లలో లేని అంశాల్ని తాజాగా ప్రభుత్వం తెరపైకి తీసుకొస్తోంది. ప్రధానంగా భూసేకరణను పెంచడం, అదనపు భూమి కోసం మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వడం కీలకంగా మారనుంది. అలాగే భోగాపురం ఎయిర్‌పోర్టు పరిధిలోనే ఏవియేషన్ అకాడమీని ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. కొత్తగా గ్యారేజీల నిర్మాణం, ఓవరాయిలింగ్ విభాగం, ఏరో సిటీ నిర్మాణంతోపాటు విమానాశ్రయ నిర్వహణ బాధ్యతల్ని కూడా ప్రత్యేకంగా టెండర్ సంస్థకు అప్పగించాలన్న అంశాల్ని తాజా ప్రతిపాదనల్లో పొందుపరచనున్నారు. దీనివల్ల టెండర్ మొత్తం అకస్మాత్తుగా పెరిగిపోనుంది.

ఇవీ ప్రశ్నలు

ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) దేశంలోని సుమారు 420 విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. , భోగాపురం ఎయిర్ పోర్టు నిర్వహణే దానికి భారమా?. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్‌ను 2015లో ఒక కంపెనీగా చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేసినట్లు?. ఇదే భోగాపురం ఎయిర్‌పోర్టు కంపెనీ.. త్వరలో నెల్లూరులోని రాచర్లపాడు, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుల నిర్మాణాన్ని చేపడుతుందని చంద్రబాబు అప్పట్లో ఎందుకు ప్రకటించారు?. తాజాగా ఎయిర్‌పోర్టు టెండర్లను ఎందుకు రద్దు చేశారు?. ఇంత చేసినా, లాభాలు రావడం సందేహమేనని అంతర్గత సర్వేలో ఇప్పటికే తేల్చుకున్న ప్రైవేటు సంస్థ సకాంలో ఎయిర్‌పోర్టు పనులు పూర్తి చేస్తుందా?

ఎవరేమన్నారు?

భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ టెండర్లను రద్దు చేయడం తగని పనని, ఎఎఐ నిర్మించాలని, స్వలాభం కోసం ప్రయివేటు కంపెనీలకివ్వడం తగదంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.నరసింగరావు ఎద్దేవా చేశారు. ఎయిర్ ట్రావలర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు వరదారెడ్డి స్పందిస్తూ.. చంద్రబాబుకు నల్లధనం మూటగట్టుకునే అలవాటు వల్ల కార్పొరేట్‌కిస్తే ఆయనకు లాభమని భావిస్తున్నాడని, ఇంత ఖర్చు పెట్టుకుని ఎవరైనా వస్తారా? పిపిపి పేర ఎయిర్ పోర్టు చుట్టూ పట్టణాల నిర్మాణం, షాపింగ్ మాల్స్, హోటళ్ల నిర్మాణం ఇదంతా వయబిలిటీ కానీ వ్యవహారమని వరదారెడ్డి కొట్టిపారేశారు.

జ్యురిచ్‌తో ఏపి ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ, జీవశాస్త్రం, పట్టణాభివృద్ధి వంటి రంగాల్లో ఇరు ప్రభుత్వాలూ పరస్పరం సహకరించుకుం టాయి. తొలిరోజు పర్యటనలో ముందుగా ' పయనీరింగ్ వెంచర్స్ ' ఛైర్మన్ రోన్ పాల్, చీఫ్ ఇన్వెస్టర్ ఆఫీసర్ సందీప్ రాజ్‌తో సిఎం సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల్ని లాభసాటి సేద్యంగా భావించి, ప్రణాళికతో పనిచేస్తున్నామని సిఎం వారికి వివరించారు. ప్రస్తుతం 40 లక్షల ఎకరాలున్న ఉద్యాన సాగును కోటి ఎకరాలకు విస్తరింపజేయడమే లక్ష్యమన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు దేశంలోనే తొలిసారిగా సెన్సార్లు, డ్రోన్లు వినియోగిస్తున్నామని పయనీరింగ్ సంస్థ ప్రతినిధులకు తెలిపారు. భారీ పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీల్ని కల్పిస్తున్నామన్నారు. ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని పరిశీలించాలని వారికి సూచించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ తరహాలో పాల ఉత్పత్తులకు అదనపు విలువ జోడించేలా పెద్దఎత్తున సహకార సంస్థల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సిఎం వివరించారు. ప్రయాణాలకు, సరుకు రవాణాకు వీలుగా కుప్పంలో చిన్నపాటి విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని పయనీర్ ప్రతినిధులకు సిఎం హామీ ఇచ్చారు. ఆ సంస్థతో సంప్రదింపులు జరిపి పనులు వేగవంతం చేయాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి ఆరోఖ్యరాజ్‌ను సిఎం ఆదేశించారు. ఈమేరకు పండ్ల తోటలు, పాడి పరిశ్రమలో ఇప్పటికే తమ సంస్థ రానున్న ఐదేళ్లలో రూ 5 వేల కోట్లు పెట్టుబడి పెట్టాలని భావిస్తున్నట్లు పయనీరింగ్ సంస్థ ఛైర్మన్ రోన్ పాల్ తెలిపారు. అందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నా మని తెలిపారు. ఇప్పటికే కుప్పంలో, మహారాష్ట్రలోని నాందేడ్‌లో పయనీరింగ్ సంస్థ రూ.1000 కోట్లతో కార్య కలాపాల్ని ప్రారంభించిందని ఆయన సిఎంకు తెలిపారు.

నేటి నుంచి దావోస్‌లో

ముఖ్యమంత్రి బృందం జ్యురిజ్ నుంచి బయలుదేరి సోమవారం సాయంత్రానికి దావోస్ చేరుకుంది. మంగళవారం ఏపి లాంజ్‌లో జరిగే ప్రారంభ కార్యక్రమంతోపాటు కాంగ్రెస్ సెంటర్‌లో ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఓపెనింగ్ ప్లీనరీలో చంద్రబాబు పాల్గొంటారు. అనంతరం ఇండియా లాంజ్‌లో ఏపి-జపాన్ భోజన సమావేశంలో, బజాజ్ గ్రూప్ నైట్ క్యాప్ ఆధ్వర్యంలో డిన్నర్ రిసార్ట్‌కు ఆయన హాజరుకానున్నారు. మంత్రులు యనమల రామకృష్ణుడు, నారా లోకేష్, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, ఇంధన శాఖ కార్యదర్శి అజయ్ జైన్, ఏపిఇడిబి సిఇఒ కృష్ణ కిషోర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఆరోఖ్య రాజ్ ముఖ్యమంత్రి బృందంలో ఉన్నారు.



సాయి ధరమ్ తేజ్

ఇంటిలిజెంట్

సాయి ధరమ్ తేజ్ కథానాయకుడిగా సి.కల్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. వి.వి.వినాయక్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లిమిటెడ్ పతాకంపై రూపొందుతోంది. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ "ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ పూర్తయింది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. సాయి ధరమ్ తేజ్ పెర్‌ఫార్మెన్స్, వినాయక్ టేకింగ్ హైలైట్‌గా నిలుస్తాయి. హీరో, దర్శకుడి కెరీర్‌లో 'ఇంటిలిజెంట్' మరో బిగ్గెస్ట్ హిట్ మూవీ అవుతుంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఫిబ్రవరి 9న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని అన్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు : శివ ఆకుల, సినిమాటోగ్రఫీ : ఎస్.వి. విశ్వేశ్వర్, సంగీతం : థమన్, ఎడిటింగ్ : గౌతంరాజు, ఆర్ట్ : బ్రహ్మ కడలి.

హాలీవుడ్ సినిమాను మించిపోతుంది

'జయం' రవి



"స్పేస్ ఫిల్మ్ అంటే హాలీవుడ్ సినిమాలతో పోలిక ఉంటుంది. అలా ఉండాలి కూడా. అప్పుడే మనలోని గొప్పదనం బయటికొస్తుంది. ఈ సినిమా హాలీవుడ్ సినిమాలకు అస్సలు తీసిపోదు. ఈ చిత్రం కొన్ని సన్నివేశాలు తప్పకుండా హాలీవుడ్‌లో తీసిన కొన్ని చిత్రాల్లో ఉన్నట్టుగా ఉంటే ఉండొచ్చు. వాటిని మార్చలేం. కానీ కొన్ని సన్నివేశాలు హాలీవుడ్ సన్నివేశాల కన్నా గొప్పగా ఉంటాయని చెప్పగలను" అని జయం రవి అన్నారు. 'జయం' రవి, నివేదా పేతురాజ్ జంటగా నటించిన చిత్రం 'టిక్ టిక్ టిక్'. శక్తి సౌందర్ రాజన్ దర్శకుడు. ఇండియన్ సినిమా చరిత్రంలో ఫస్ట్ స్పేస్ సినిమాగా రూపొందింది. త్వరలోనే విడుదల చేయనుండడంతో ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.

- ఇండియాకి ఒక ప్రమాదం వచ్చిపడుతుంది. దాన్ని తప్పించడానికి ఒక డిఫెన్స్ స్పేస్ డివిజన్ ప్రయత్నిస్తుంది. ఆ ప్రమాదం ఏంటి, దాన్నుండి దేశాన్ని ఎలా కాపాడారు? అనేదే సినిమా కథ. దాన్ని స్క్రీన్ పైన చూడాల్సిందే.
- డిఫెన్స్ స్పేస్ డివిజన్‌లో ముఖ్యమైన వ్యక్తిని నేనే. ఎగ్జాట్‌గా చెప్పాలంటే నా క్యారెక్టర్ ఎస్కెప్ ఆర్టిస్ట్‌లా ఉంటుంది. ఎస్కెప్ ఆర్టిస్ట్ అంటే ఎలాంటి క్లిష్టమైన పరిస్థితి నుండైనా బయటపడగలిగేవాడు.
- ఎక్కువ కష్టం దర్శకుడిదే. ఆయన విజన్‌ను బట్టే సినిమా ఉంటుంది. ఇక గ్రాఫిక్స్ విషయానికొస్తే అజాక్స్ మీడియా ఈ సినిమాకి వర్క్ చేసింది. సుమారు 200 మంది 5 నెలల పాటు పనిచేశారు. షూటింగ్‌లో కూడా స్పేస్ షాట్స్ చేయడానికి బాగా కష్టపడాల్సి వచ్చింది.
- ఈ సినిమాలో నా కొడుకు కూడా ఓ క్యారెక్టర్ చేశాడు. నటిస్తావా! అని అడగ్గానే ఒప్పేసుకున్నాడు. నా కొడుకుతో కలిసి నటించడం ఒక మర్చిపోలేని, మాటల్లో చెప్పలేని అనుభవం.
- ఇంటర్వెల్‌కు 20 నిమిషాల ముందే స్పేస్ ఎపిసోడ్స్ మొదలవుతాయి. 80 శాతం సినిమా స్పేస్‌లోనే ఉంటుంది.
- 90వ దశకంలో కొన్ని స్పేస్ సినిమాలు వచ్చాయి. అలా చేయాలంటే నో ప్రాబ్లమ్. కానీ అంతకంటే బాగా చేయాలంటే బడ్జెట్ కావాలి. లక్కీగా
- మంచి ప్రొడక్షన్ టీం, చెన్నైలో అజాక్స్ గ్రాఫిక్ స్టూడియో దొరికాయి. అందరూ 'మీకు ఇటువంటి వైవిధ్యమైన సినిమాలు చేయడం ఎలా కుదురుతుంది?' అనడుగుతున్నారు. నేను ఎందుకు కుదరదు? అంటున్నా. అందరూ నెగిటివ్‌గా చూసిన విషయంలో నేను పాజిటివ్ తీసుకుని చేస్తున్నా. టీజర్, ట్రైలర్లలో ప్రేక్షకులు ఎం చూసినదాని కంటే ట్రైలర్లో పది రేట్లు ఎక్కువ ఉంది. ఇటువంటి సినిమాలను ఫోన్లు, కంప్యూటర్లలో చూస్తే కిక్ ఉండదు. లార్జర్ థెన్ లైఫ్ సినిమా ఇది. థియేటర్లోనే చూడండి.



దివ్యవాణి... 'మహానటి' తల్లి

'పెళ్లి పుస్తకం'తో తన సినీ పుస్తకం తెరిచి, 'ఎదురింటి మొగుడు, పక్కింటి పెళ్ళాం, ఇద్దరు పిల్లల ముద్దుల పోలీసు' వంటి యాభై సినిమాలతో తన సినీ పుస్తకం నింపేసుకుంది దివ్యవాణి. ఈమె మళ్లీ వెండితెరపై మెరవబోతుంది. ఇప్పుడు సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోన్న 'మహానటి' చిత్రంలో చేస్తుంది. అందులో సావిత్రి తల్లిగా కనిపించబోతుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "హీరోయిన్‌గా 'పెళ్లి పుస్తకం'తో పరిచయం అయినా...ఆ చిత్రానికి ముందుగా 'సర్దార్ కృష్ణమ నాయుడు' దాని తరువాత 'ముత్యమంతా ముద్దు' ఆ చిత్రాలలో చేశాను. ఆ తరువాత పెళ్లి పుస్తకంలో అప్పటి ఇరవై మంది హీరోయిన్లలో నాకు అదృష్టం వరించింది. ఇప్పటివరకు యాభై సినిమాలలో తెలుగు, తమిళ్, హిందీ చిత్రాలలో నటించాను. ఇటీవల మా అమ్మాయి చదువు కోసమని నేను చెన్నై నుండి హైదరాబాద్‌కు మారాం. ఇదే సమయంలో అనుకోకుండా నాకు 'నా పేరు మీనాక్షి', 'ప్రవిత్ర బంధం', సీరియల్ లో నటించే అవకాశం వచ్చింది. ఇంకా మంచి పాత్రలు వస్తే తప్పనిసరిగా చేస్తాను."అన్నారు.



సీనియర్ హీరోలైతేనే..!

కాజల్ అగర్వాల్...ఇప్పుడు తెలుగు సినిమాలేవీ ఆమె చేతిలో లేవు. కేవలం కల్యాణ్ రామ్‌తో 'ఎంఎల్‌ఏ' సినిమాలో కథానాయికగా చేస్తుంది అంతే. ఈ అమ్మడుకు 'సర్దార్ గబ్బర్ సింగ్' సినిమాతో మళ్లీ అవకాశాలు పెరిగాయి. తమిళంలో అడపాదడపా సినిమాలు చేస్తున్నా అప్పటి వరకూ తెలుగులో మాత్రం అవకాశాలు రాలేదు. ఆ చిత్రం తర్వాత 'ఖైదీ నంబర్ 150'లో నటించే ఛాన్స్ వచ్చింది. ఈ సినిమా భారీ విజయం అందుకోవడంతో కాజల్‌కు ఆఫర్లు పెరిగాయి. వరుసగా తమిళం, తెలుగు సినిమాలు ఆమె చేతికొచ్చాయి. ఇక నుంచి పెద్ద హీరోల సరసన ఆమె నటించాలంటే నిర్మాతలు ఎక్కువగా చెల్లుకోవాలట. ఇప్పటి వరకూ కాల్‌షీట్స్‌ను బట్టి రూ.60 నుంచి 80 లక్షల వరకూ తీసుకునే కాజల్ ఇక నుంచి కోటికిపైనే డిమాండ్ చేస్తుందట. కోటికి తక్కువైతే చేయనని తేల్చేచెప్పేస్తుందట. అవకాశాలు లేకపోయినా పారితోషికం విషయంలో రాజీపడడం లేదట. కానీ యువ హీరోలతో నటించేందుకు మాత్రం అంత మొత్తం అయితే డిమాండ్ చేయడం లేదని తెలిసింది.



కేరళ సంప్రదాయంలో భావన పెళ్లి

మలమాళ నటి భావన, కన్నడ నిర్మాత నవీన్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెద్దల సమ్మతంతో ఇద్దరు ఓ ఇంటివారయ్యారు. సోమవారం ఉదయం వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. కేరళ సంప్రదాయం పెళ్లి జరిగింది. కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, సన్నిహితులు మాత్రమే ఈ వేడుకకు హాజరయ్యారు. శనివారం ఈ పెళ్లికి సంబంధించిన మెహందీ ఫంక్షన్‌ను నిర్వహించారు. ఈ వేడుకలో భావన దిగిన ఫొటోలు, వీడియోలు కూడా బయటికి వచ్చాయి. గత ఏడాది మార్చిలో వీరి నిశ్చితార్థం జరిగింది. అక్టోబరులో పెళ్లిచేసుకోవాలని అనుకున్నారు. కానీ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల శుభకార్యాన్ని జనవరికి వాయిదా వేశారు. వివాహ బంధంతో ఒకటైన తర్వాత భావన, నవీన్ మీడియాతో మాట్లాడారు. తమకు శుభాకాంక్షలు చెప్పిన వారందరికీ ధన్యవాదాలు చెప్పారు.

ప్రియాంక చోప్రా శుభాకాంక్షలు

భావన వివాహం సందర్భంగా బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమం ద్వారా శుభాకాంక్షలు చెప్పింది. 'మీ ఇద్దరికి శుభాకాంక్షలు. మీ ప్రయాణంలో ఇది ముఖ్యమైన ఘట్టం. అదృష్టం మీ వెంట ఉండాలని కోరుకుంటున్నా. నువ్వు నిజంగా చాలా ధైర్యమున్న మహిళవి భావన. నువ్వంటే నాకు చాలా ఇష్టం. నాకు నీపై ఉన్న అభిమానం ఎప్పుడూ ఇలానే ఉంటుంది' అని ప్రియాంక వీడియోలో చెప్పింది.

దైవ సన్నిధానం చైర్మన్‌గా మోహన్ బాబు



సురేఖ, గిరిబాబు, సుబ్బరామిరెడ్డి, మోహన్ బాబు, స్వరూపానందేంద్ర సరస్వతి, గోపాలకృష్ణ, చాముండేశ్వరి నాథ్, శ్యామల తదితరులు

ఫిల్మ్ నగర్ దైవ సన్నిధానం చైర్మన్‌గా డా.మోహన్ బాబు ప్రమాణ స్వీకారం చేశారు. విశాఖ శారదా పీఠం అధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో 12 మంది పాలక మండలి కొత్త సభ్యులుగా సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కమిటీ సభ్యులుగా గిరిబాబు, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, కృష్ణం రాజు భార్య శ్యామల, చిరంజీవి భార్య సురేఖ, చాముండేశ్వరి నాథ్, వి. రామ్‌ప్రసాద్ ఉన్నారు. కార్యదర్శిగా కాజా సూర్య నారాయణ కొనసాగుతున్నారు. ఫిలిం నగర్ దైవ సన్నిధానం ప్రాంగణంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో టి.సుబ్బరామి రెడ్డి, రాజమండ్రి ఎంపి. మురళి మోహన్ పాల్గొన్నారు.

మోహన్ బాబు మాట్లాడుతూ 'మా సంస్థలు, చిత్రాలతో బిజీగా ఉన్న నాకు ఈ అదనపు బాధ్యత ఎందుకనుకున్నా. కానీ ఆ మహా శివుడు టి.సుబ్బరామి రెడ్డి స్వరూపంలో వచ్చి ఫిలిం నగర్ దైవ సన్నిధానం చైర్మన్ బాధ్యతలు స్వీకరించామన్నాడు. నిజాన్ని నిర్భయంగా చెప్పడం నాకలవాటు. స్వరూపానందేంద్ర స్వామిని నేను, రజనీకాంత్ సుబ్బరామి రెడ్డి ద్వారా ఓ సారి కలవడం జరిగింది. కమ్మ, కాపు, రెడ్డి కులాల వలే బ్రాహ్మణులలో కూడా శాఖలుంటాయి. అందరూ కలిసి ఆ భగవంతుడి సేవ చేద్దామని కోరుతున్నాను. నా అల్లుడు కూడా బ్రాహ్మణుడే అని ఈ సందర్భంగా చెప్తున్నాను. దేవుడి డబ్బు పైసా ముట్టుకోకుండా అవసరమయితే నా సొంత డబ్బులు ఖర్చుపెట్టయినా సరే సన్నిదానంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సంకల్పిస్తున్నాను' అని మోహన్ బాబు అన్నారు.



శివాజీ రాజా

ఆ వ్యాఖ్యలు విచారకరం

సినిమా, సమాజం వేరుకాదనీ మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ అధ్యక్షులు శివాజీ రాజా అన్నారు. సమాజంలో ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా కళాకారులు స్పందించి తగు సాయం అందిస్తారనీ అటువంటి కళాకారులకు సన్మానం చేయకూడదని అనడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల 'కాకతీయ కళావైభవోత్సవాలు' పేరిట శిల్ప కళావేదికలో మోహన్‌బాబుని సన్మానించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాకతీయ హెరిటేజ్ ట్రస్టీ పాపారావు సినిమా నటీనటులను సత్కరించకూడదని హెచ్చరిస్తూ మాట్లాడటం విచారకరమని ఆయన అన్నారు.

నాక్కూడా స్టార్ హీరోలతో చేయాలనుంది

- జి.నాగేశ్వరరెడ్డి



"కామెడీ కోసమే ప్రత్యేకమైన దర్శకులు ఉండరు. జంధ్యాల, ఈవీవీని పరిగణలోని తీసుకుంటే కామెడీతో పాటు ప్రేమకథలు బాగా తీశారు. ఎవరి శైలి వారిది. ఇప్పుడున్న యువ దర్శకులు అంతా లవ్, యాక్షన్ చిత్రాలవైపే దృష్టి సారిస్తున్నారు. దానివల్ల ప్రత్యేకంగా కామెడీ దర్శకులు లేరనిపిస్తుంది" అని డైరెక్టర్ జి.నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆయన దర్శకత్వంలో మంచు విష్ణు ప్రగ్యాజైస్వాల్ హీరో హీరోయిన్లుగా 'ఆచారి అమెరికా యాత్ర' రూపొందింది. త్వరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. 'అమెరికా యాత్ర' ఎంటర్‌టైన్‌మెంట్‌గా సాగుతుంది. థియేటర్‌కొచ్చే ప్రేక్షకులకు నవ్వులయాత్రగా ఉంటుంది. మంచి కథను ఒత్తిడి లేకుండా హాయిగా ఉండేట్లు తీశాం. ముఖ్యంగా తాత సెంటిమెంట్‌తో ఉన్న సినిమా ఇది. తాతగా కోట శ్రీనివాసరావు, మనవరాలుగా ప్రగ్యా నటించారు. వారిచుట్టూ ఉన్న ప్రమాదాన్ని ఆచారి బృందం బ్రేక్ చేసి ఎలా కాపాడింది అనేది సినిమా. బ్రాహ్మణులంటే కట్టుబాట్లు, పద్ధతులుంటాయి. వారు అమెరికా వెళ్ళేసరికి విరుద్ధమైన వాతావరణం ఉంటుంది. అలాంటి వాతావరణంలో ఉన్న వారిని ఎంటర్‌టైన్‌మెంట్‌గా చూపించాం.ఇది రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి సినిమా కోసమే రాసిన కథ. ఇప్పటికే బ్రాహ్మణులతో గొడవలున్నాయికదా.. ఎందుకని వద్దన్నా. 'దేనికైనా రెడీ' అప్పుడు వచ్చిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ఈ కథ అనుకున్నప్పుడే మరో మాట లేకుండా అందరం హీరోగా విష్ణునే అనుకున్నాం. 'ఆటాడుకుందాం రా' అనే సినిమాను బాగా చెప్పాలని ట్రై చేశాం. మిస్ ఫైర్ అయింది. సినిమా బాగా చేశాను. అందుకే ఫెయిల్యూర్ అనుకోవడం లేదు. ఎటువంటి కథ అయినా కామెడీ లేకుండా సినిమానే ఉండదు. పూర్తిస్థాయి కామెడీ చిత్రాలు హీరోని బట్టి ఉంటాయి. రాజేంద్రప్రసాద్ రానంతవరకు హాస్యచిత్రాలు ప్రత్యేకమైన ముద్ర వేసుకున్నాయి. ఆ తర్వాత నరేష్.. సునీల్.. ఇప్పుడు మరికొంతమంది...ఇలా వస్తూనే ఉంటారు. చిరంజీవి కూడా కమెడీ చిత్రాలు చేశారు. నాకూ కూడా స్టార్‌హీరోలతో చేయాలనుంది. కానీ అవకాశం రావడం లేదు. వస్తే కచ్చితంగా చేస్తా.

డా॥ స్పెషలిస్ట్



పొట్టలో ఆహారం జీర్ణమవ్వకుండా అప్పుడప్పుడూ కొన్నిరకాల వాయువులు అడ్డుకుంటూ ఉంటాయి. అలాంటప్పుడే జీర్ణ వ్యవస్థ అస్తవ్యస్తమౌతుంది. ఆహారం తీసుకున్న కాసేపటికే ఆకలి వేయడం, కొంచెం తినగానే కడుపు నిండినట్లుండటం, ఛాతిలో నొప్పిగా అనిపించడం, గొంతులో మంటగా ఉండి, పుల్లటి తేన్పులు రావడం.. ఇవన్నీ గ్యాస్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలే. అయితే ఇలాంటివి తాత్కాలికంగా ఇబ్బంది పెట్టినా ఆ లక్షణాలు కాసేపటికే మాయమౌతాయి. దీంతో ఇది 'చిన్న సమస్యే' అని చాలామంది పట్టించుకోవడం మానేస్తారు. ఈ నిర్లక్ష్యం అలా అల్సర్లు, జీర్ణకోశ వ్యాధులకు దారితీస్తుంది. అందుకే తొలిదశలోనే గ్యాస్ ట్రబుల్‌కు చెక్ చెప్పాలి. పొట్టలో గ్యాస్ సమస్యలు ఎందుకొస్తాయి? కారణాలేమిటి? ఈ సమస్యని ఎలా నివారించవచ్చు? చేయించాల్సిన చికిత్సలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలే ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్' లో ...



గ్యాస్ ట్రబుల్ నివారణ ఇలా!

శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే తగిన ఆహారాన్ని తీసుకోవడం తప్పనిసరి. అయితే లోపలికి తీసుకున్న ఆహారం సక్రమంగా జీర్ణంకాని సందర్భాలు ప్రతి ఒక్కరికీ ఎదురౌతూనే ఉంటాయి. వివిధ రకాల ఇబ్బందులకు, అసౌకర్యానికి గురిచేసే జీర్ణకోశ సమస్యలలో గ్యాస్ ట్రబుల్ ముఖ్యమైంది. దీనినే కడుపుబ్బరం అనీ అంటుంటారు. ఇది కడుపులోని ఆమ్లాలు ఎక్కువగా ఉత్పత్తి కావడంవల్ల కలిగే వ్యాధి. ఆధునిక కాలంలో మారిన జీవనశైలి, వేళకు ఆహారం తీసుకోకపోవడం, తీవ్ర మానసిక ఒత్తిడి, రాత్రి సరిగా నిద్రపట్టకపోవడం, నిరంతర ఆలోచనలు, కారణం లేకుండానే కోపం రావడం, సరైన ఆహారం తీసుకోకపోవడం వంటి అంశాలు ఈ సమస్యను తీవ్రంగా మారుస్తాయి. అనేక ఇబ్బందులకు గురిచేసే దీనిపై సరైన అవగాహన ఉంటే అధిగమించడం పెద్ద కష్టమేమీ కాదు.

ఇలా మొదలౌతుంది

మనం తీసుకున్న ఆహారం, పెద్ద పేగులోని బ్యాక్టీరియా సంఖ్య ఆధారంగా గ్యాస్ సమస్య ఉంటుంది. తిన్న ఆహారంలోని... కార్బోహైడ్రేట్లు, పిండి పదార్థాలు, పీచుపదార్థాలు జీర్ణకోశం, చిన్నపేగుల్లో కొంతమేరకే జీర్ణమవుతాయి. పాక్షికంగా జీర్ణమైన ఆహారం పూర్తిగా జీర్ణమయ్యే



ప్రక్రియలో భాగంగా చిన్నపేగు నుంచి పెద్దపేగులోకి వెళ్తుంది. పెద్దపేగుల్లో ఉండే కొన్నిరకాల బ్యాక్టీరియా పాక్షికంగా జీర్ణమైన కార్బోహైడ్రేట్లు, పీచు పదార్థాలను సూక్ష్మ పరమాణువులుగా విడగొడతాయి. ఈ ప్రక్రియలో కార్బోహైడ్రేట్లు జీర్ణమై .. హైడ్రోజన్, కార్బన్ డయాక్సైడ్ వంటి వాయువులు ఉత్పత్తవుతాయి. కొన్నిరకాల బ్యాక్టీరియా ఈ విడుదలైన హైడ్రోజన్ సాయంతో మీథేన్, హైడ్రోజన్ సల్ఫైడ్ తదితర వాయువులను ఉత్పత్తి చేస్తాయి. ఈ వాయువులే .. గ్యాస్ రూపంలో బయటకు వస్తాయి. పెద్దవారిలో ఎక్కువగా మీథేన్ గ్యాస్ ఉత్పత్తి చేసే బ్యాక్టీరియా ఉంటుంది. విడుదలైన గ్యాస్ కొంతమేరకు రక్తంలో కలిసి ఊపిరితిత్తులకు వెళ్తుంది.. కొంత గ్యాస్ శ్వాస ద్వారా, మరికొంత ఆపానవాయువుగా బయటకు వస్తుంది.

లక్షణాలు

కడుపు ఉబ్బరంగా ఉండి, కడుపు నిండుగా ఉన్నట్లు అనిపించడం, పొట్టలో గడబిడలు, ఆకలి లేకపోవడం, అన్నం సయించకపోవడం, ఛాతీలో మంట, తేన్పులు ఎక్కువగా రావడం, తీసుకున్న ఆహారం సరిగా జీర్ణంకాక కడుపునొప్పి రావడం, మలబద్ధకం ఏర్పడటం, అపాన వాయువు ఎక్కువగా పోతుండడం, జీర్ణాశయంలో పుండు ఏర్పడి, కడుపులో మంటతో కూడిన నొప్పిరావడం, నోటిలో నీళ్ళు ఊరడం, వాంతులు కావడం, ఛాతీ భాగంలో కానీ పైపొట్టలో కానీ ఎక్కువగా నొప్పి రావడం, తిన్న వెంటనే మలవిసర్జనకు వెళ్ళడం, అరుదుగా రక్తంతో వాంతులు కావడం గ్యాస్‌ట్రబుల్ ప్రధాన లక్షణాలు.



ఎన్నో కారణాలు


గ్యాస్ ట్రబుల్‌కు కారణాలు చాలా ఉన్నాయి. ఎప్పుడూ తినే వేళకు ఆహారం తీసుకోకపోయినా జీర్ణాశయంలో కదలికలు పెరుగుతాయి. ఇవి హైడ్రోక్లోరిక్ యాసిడ్ విడుదలను ప్రేరేపిస్తాయి. ఆ సమయానికి జీర్ణకోశంలో ఆహారం లేకపోతే మ్యూకస్ పొరపై అవి ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ ఆమ్లాలవల్ల వాయువులు విడుదలవుతాయి. ఇవి ఎక్కువగా ఉత్పత్తి అయితే గ్యాస్ విడుదల ఎక్కువై.. కడుపులో మంటగా అనిపిస్తుంటుంది. చివరికి అది జీర్ణకోశ అల్సర్‌కు దారితీస్తుంది. త్వరగా జీర్ణంకాని ఆహార పదార్థాలు, శీతల పానీయాలు, కాఫీ, టీలు ఎక్కువగా తాగడం, మసాలా కూరలు, పచ్చళ్ళ అతిగా తినడం, సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడం, నిల్వ ఉంచిన లేదా పులిసిన ఆహారం తినేవారిలో, మద్యపానం చేసేవారిలో గ్యాస్ ట్రబుల్ వచ్చే అవకాశాలెక్కువ. అంతేకాకుండా కొన్ని రకాల పెయిన్ కిల్లర్స్, డ్రగ్స్ వంటివి తీసుకోవడం వల్లా ఈ సమస్య వస్తుంది. తినేటప్పుడు ఆహారంతో పాటు కొంత గాలిని మింగడమూ గ్యాస్‌కు కారణమే. మనం తీసుకున్న ఆహారంలో తేలికగా జీర్ణం కాని ఆహారం ఉన్నా.. లేక కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నా జీర్ణక్రియ సరిగా జరగక, గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. అలర్జీ కలిగించే ఆహార పదార్థాలు, తీవ్రమైన మానసిక ఒత్తిళ్లూ గ్యాస్‌ట్రబుల్ సమస్యకు కారణాలే. ఆపిల్, పియర్, ద్రాక్ష వంటి పండ్లు.. చిక్కుడు, బీన్స్, క్యాబేజి, క్యాలిఫ్లవర్, ఉల్లిపాయలు, శనగలు, వేరుశనగ, గోధుమలు, నూనెలో బాగా వేయించినవి, పచ్చళ్లు, ఉప్పులో నిల్వ చేసిన ఎండు చేపలు, ఎండు రొయ్యలు, వాటితోపాటు పాలు, జున్ను, పాల ఉత్పత్తులు, ఐస్‌క్రీం మరీ ఎక్కువగా తీసుకోవడం గ్యాస్ సమస్యకు కారణాలు. వీటిలో పిండి పదార్థాలు, కొవ్వు ఎక్కువగా ఉండటంవల్ల త్వరగా జీర్ణం కావు. గ్యాస్‌ట్రబుల్ రావడానికి అజీర్తే ప్రధాన కారణం. ద్రవ, ఘన ఆహార స్వీకరణ సమయంలో గాలిని మింగడం, మలబద్ధకం, వివిధ వ్యాధులకు వాడే మందులు, మధుమేహం, ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్ (ఐబిఎస్) వంటి కొన్ని వ్యాధుల వల్ల పేగుల కదలికల్లో మార్పులు జరగకపోవడం, హార్మోన్ల అస్తవ్యస్థత మొదలైన కారణాలు కూడా గ్యాస్ సమస్యను కలిగిస్తాయి. శరీరతత్వం, ఆహారపుటలవాట్లు, జీవనశైలి ఆధారంగా ఏవయసు వారికైనా గ్యాస్ ట్రబుల్ వచ్చే అవకాశముంది. ఈ సమస్యతో బరువు కూడా పెరిగే సూచనలూ ఉన్నాయి.

నిర్లక్ష్యం చేస్తే?!

గ్యాస్ ట్రబుల్‌ని నిర్లక్ష్యం చేస్తే అది ఒక్కోసారి పలు వ్యాధులకు దారితీస్తుంది. ల్యాక్టోజ్ ఇన్‌టోలరెన్స్, సిలియాక్ వ్యాధి, బొవెల్ సింద్రోమ్, గ్యాస్ట్రో ఇసోఫేగల్ రిఫ్లక్స్ వ్యాధి, పెప్టిక్ అల్సర్ వంటి పలు రకాల అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది. దీర్ఘకాలం పాటు గ్యాస్‌ట్రబుల్‌కు చికిత్స తీసుకోకపోతే పుల్లని తేన్పులు అధికంగా వచ్చి... జీర్ణకోశం దెబ్బతిని, రకరకాల ప్రమాదకరమైన వ్యాధులకు దారితీస్తుంది. సుదీర్ఘకాలం ఉండే గ్యాస్ సమస్య హైపర్ ఎసిడిటీకి కారణమవుతుంది. అది ఎక్కువైతే జీర్ణకోశ క్యాన్సర్, గొంతు ఇన్ఫెక్షన్, గొంతు క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయి.

నివారణ

ప్రారంభ దశలో గ్యాస్ సమస్యని ఎవరికి వారే నివారించుకోవచ్చు. సరైన ఆహారపు అలవాట్లు, మితాహారం, అలర్జీ కలిగించే ఆహారానికి దూరంగా ఉంటూ డైట్ డైరీ పాటిస్తే గ్యాస్‌ట్రబుల్ సమస్య రాకుండా నివారించవచ్చు. వాటితోపాటు ఆహారాన్ని ఎక్కువగా నమిలి తినాలి. తక్కువ ఆహారాన్ని ఎక్కువసార్లు తీసుకోవాలి. ఆహారం తీసుకున్న వెంటనే నీరు తాగకుండా జాగ్రత్త పడాలి. చీటికీ మాటికీ కృత్రిమ స్వీట్‌నర్స్, పెయిన్ కిల్లర్స్ వంటివి తీసుకోకూడదు. జీవనశైలిని తప్పనిసరిగా మార్చుకోవాలి. సమయానికి ఆహారం తీసుకోవడంతోపాటు, గ్యాస్ ఉత్పత్తి చేసే ఆహారానికి దూరంగా ఉండాలి. శుభ్రమైన, మంచి ఆహారం తీసుకోవడమే గ్యాస్ ట్రబుల్‌కు ఉత్తమ చికిత్స. అయినా సమస్య పరిష్కారం కాకపోతే వైద్యులను సంప్రదించి, చికిత్స చేయించుకోవాలి. ఆ తర్వాత కూడా వైద్యులు సూచించిన విధంగా ఆహారం తీసుకోవాలి.




- డాక్టర్ ఐ.నళినీ ప్రసాద్,
ఎండి, డిఎమ్,
గ్యాస్ట్రో ఎంటరాలజీ,
రమేష్ హాస్పిటల్స్,
లబ్బీపేట, విజయవాడ.

అప్రమత్తతతోనే దూరం

పొట్టలో గ్యాస్ సమస్యని అప్రమత్తంగా ఉంటే సమర్థవంతంగా నివారించుకోవచ్చు. దానికి కొన్ని సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

- వేళకు సరైన పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి.
- పరిశుభ్రమైన మంచినీరు ఎక్కువగా తాగాలి.
- తగినంత సమయం వ్యాయామం చేయాలి.
- వైద్యుల సలహా మేరకు ఏంటాసిడ్ మందులు వాడాలి.
- మసాలాలు, వేపుళ్ళ, ఆయిల్‌ఫుడ్స్, ఫాస్ట్‌ఫుడ్ వంటివాటిని తినకూడదు.
- ఆల్కహాల్ సేవించడం, స్మోకింగ్, టీ, కాఫీలు తాగడం వంటి అలవాట్లని మానేయాలి.
- నిల్వ ఉంచిన పచ్చళ్ల తినకూడదు.
- కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న పదార్థాలు తింటే కడుపులో గ్యాస్ పెరుగుతుంది. అలాంటి వాటికి దూరంగా ఉండాలి.
- మానసిక ఒత్తిడిని నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- తేలికగా జీర్ణమయ్యే పీచు పదార్థాలున్న తాజా కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి.
- జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి.
- ఆహార నియమాలు పాటించడంవల్ల మేలు జరుగుతుంది.
- నడక, రన్నింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్ వంటి ఆటలు, శారీరకశ్రమతో కూడిన వ్యాయామాలు చేస్తుండాలి.
- కడుపునిండా ఒకేసారి ఆహారం తీసుకోకుండా.. కొద్దిపాటి మార్పులు చేసుకుంటే మంచిది. ఆహారాన్ని చిన్న చిన్న ముద్దలుగా చేసుకుని, బాగా నమిలి మింగడం వల్ల ఈ ఇబ్బందిని అధిగమించొచ్చు.
- కార్బొనేటెడ్ కూల్‌డ్రింక్స్ తాగడం, చూయింగ్‌గమ్ నమలడం వల్లా కడుపులో గ్యాస్ పెరుగుతుంది.
- గ్యాస్‌ట్రైటిస్ నుంచి త్వరిత ఉపశమనం కలగడం కోసం కొబ్బరినీళ్లు తాగడం మంచి ఔషధంగా పనిచేస్తుంది.
- బంగాళదుంప పైతొక్క తీసి, జ్యూస్ చేయాలి. ఈ జ్యూస్‌ను గోరువెచ్చని నీటితో పాటు తీసుకుంటే జీర్ణవ్యవస్థను శుభ్రం చేస్తుంది.
- బొప్పాయి జ్యూస్‌లో గ్యాస్ట్రిక్ సమస్యను నివారించే గుణాలున్నాయి.
- పొట్ట ఉబ్బరానికి గురైనప్పుడు పైనాపిల్ తినడం వల్ల మంచి ఉపశమనం కలుగుతుంది.
- అల్లం టీ లేదా అల్లంముక్కను తీసుకుంటే గ్యాస్ ట్రబుల్ నుంచి బయటపడొచ్చు.
- భోజనం ముగిసిన వెంటనే వేయించిన సోంపు తీసుకుంటే గ్యాస్ నుంచి ఉపశమనం లభిస్తుంది.





చిన్నారి



దారి చూపించండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని ఏనుగుకి అరటిపండ్ల దగ్గరకు వెళ్ళే దారిని చూపించండి!

పొడుపు కథ

యుగోస్లేవియాలో జననం,
కోల్‌కతాలో సేవానిలయం,
అందరూ మెచ్చే అమ్మ,
ఆమె నోబెల్ ప్రైజ్ గ్రహీత..?

జోక్ :

టీచర్ : రాము! నీకు చిత్రకళ, నృత్యకళల్లో ఏది బాగా తెలుసు?

రాము : వాళ్లిద్దరూ నాకు తెలియదు టీచర్.. శశికళ అయితే బాగా తెలుసు.

చేపలు గాలి ఎలా పీల్చుకుంటాయి?



పిల్లలూ ..! మీరు రకరకాల చేపల్ని చూసి ఉంటారు కదా? అవి నీళ్లల్లో ఈదుతుంటే వాటి అందాన్ని కళ్లార్పకుండా చూడాలనిపిస్తుంది. మనం ముక్కు ద్వారా గాలిని పీల్చుకుంటాం కదా! మరి చేపలు ఎలా గాలి పీల్చుకుంటాయి అనే సందేహం మీకు ఎప్పుడూనా వచ్చిందా? నీళ్లల్లో కొన్ని సెకన్లు ఉంటేనే మనకు ఊపిరాడదు. అలాంటిది చేపలు ఎల్లప్పుడు నీళ్లల్లోనే ఉంటాయి కదా! మరి అవి గాలిని ఎలా పీల్చుకుంటాయి? నీటిలో చేపలకు ఊపిరి ఎలా ఆడుతుంది? అనే ఎన్నో రకాల సందేహాలను గురించి తెలుసుకుందాం.



మనం ముక్కు ద్వారా ఆక్సిజన్‌ను ఎలా పీల్చుకుంటామో చేపలూ ఆక్సిజన్‌నే పీల్చుకుంటాయి. అయితే వాటికి ముక్కుకు బదులుగా రెండు పక్కలా మొప్పలు ఉంటాయి. ఆ మొప్పల పైన చిన్న చిన్న రక్తనాళాలు చాలానే ఉంటాయి. నీటిలో ఆక్సిజన్ కరుగుతుంది కదా! చేప నోరు తెరవగానే నీరు నోట్లోకి వస్తుంది. నోరు మూయగానే నోట్లో చేరిన నీరు మొప్పల ద్వారా బయటికి వెళ్లిపోతుంది. ఆ సమయంలో నీటిలో కరిగిన ఆక్సిజన్ మొప్పలలో ఉన్న రక్తనాళాల ద్వారా శరీరమంతా చేరుతుంది. అందుకనే మొప్పలు గాలి పీలుస్తున్నట్టుగా అటూ ఇటూ కదలాడుతుంటాయి. చేపలను నీటి నుంచి బయట పడేసినప్పుడు అవి ఊపిరాడక చనిపోతాయి. ఇదర్రా పిల్లలు అసలు విషయం. ★



పిల్లల్లారా.. రారండి!!




హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బొల్లన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ... 'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

నేను గీసిన బొమ్మ





ఎ.సాయిలక్ష్మి రత్నం,
ఆరవ తరగతి,
అరవింద హైస్కూల్

రవిశాస్త్రి కంటే కుంబ్లే బెస్ట్ : గుహ

బీసీసీఐ పాలక కమిటీ మాజీ సభ్యుని సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : టీమిండియా కోచ్ రవిశాస్త్రిపై బీసీసీఐ పాలక కమిటీ మాజీ సభ్యుడు రామచంద్ర గుహ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రిల ముందు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, సెలక్టర్లు, కోచింగ్ సిబ్బంది అందరూ కెప్టెన్ కోహ్లీ ముందు మోకరిల్లుతున్నారని ఆయన అన్నారు. కోచ్‌పరంగా చూసుకుంటే రవిశాస్త్రి కంటే ఎన్నో రెట్లు కుంబ్లే మెరుగని వ్యాఖ్యానించాడు. కోహ్లీ ఒత్తిడి మేరకే కోచ్‌గా అనిల్ కుంబ్లేను తొలగించి అతని స్థానంలో రవిశాస్త్రిని తీసుకున్నారని అన్నారు. ఆయన తాజాగా రాసిన ఓ వ్యాసంలో రవిశాస్త్రి కుంబ్లేకి ఏ విషయంలోనూ పోటీ కాదని పేర్కొన్నారు. "భారతజట్టు విజయాల్లో కానీ, కోచింగ్‌లో కానీ ఎటువంటి మార్పులు చేయని రవిశాస్త్రిని జట్టు కోచ్‌గా ఎంపిక చేసేందుకు కారణం కోహ్లీ. మాజీ కోచ్ అనిల్ కుంబ్లేకు శాస్త్రి ఏ విషయంలోనూ పోటీ కాదు. కుంబ్లే జట్టు విజయాల కోసం ఒంటరిగా పోరాడాడు. కానీ అలాంటి వ్యక్తిని కాదని కోహ్లీ ఒత్తిడికి తలొగ్గి బీసీసీఐ శాస్త్రిలాంటి వ్యక్తికి పట్టం కట్టిందన్నాడు. ఇక ప్రస్తుతం జరుగుతున్న దక్షిణాఫ్రికా సిరీస్ గురించి ప్రస్తావిస్తూ.. "జట్టులో ఎవరూ ఆడకపోయినా.. శ్రీలంకతో సిరీస్ ఆడటం మానేసి రెండు.. మూడు వారాల పాటు ప్రాక్టీస్ చేసి దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది".



ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రీక్వార్టర్‌ఫైనల్లో సోమవారం సంచనాలు నమోదయ్యాయి. ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ జకోవిచ్ అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు. ఆస్ట్రియాకు చెందిన 5వ సీడ్ థీమ్ కూడా హోరాహోరీ పోరులో పరాజయం పాలయ్యాడు. వీరిద్దరూ అన్‌సీడెడ్ల చేతుల్లో ఓటమిపాలవ్వడం గమనార్హం. పురుషుల డబుల్స్‌లో భారత ద్వయం బొప్పన్న, డి షరన్‌ల జోడీలు ప్రీక్వార్టర్స్‌లోనే ఇంటిదారిపట్టాయి. భారత్ తరఫున మిగిలిన ఒకే ఒక్క ఆశాకిరణం మిక్సిడ్ డబుల్స్‌లో బొప్పన్న జోడీ మాత్రమే...

క్వార్టర్‌ఫైనల్లో నాదల్ X సిలిక్

- అన్‌సీడెడ్ల చేతిలో ఓడిన జకోవిచ్, థీమ్
- భారత్ పోరు ప్రీ క్వార్టర్స్‌తో సరి

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో సంచలనాలు నమోదయ్యాయి. 14వ సీడ్, మాజీ వరల్డ్ నెంబర్, సెర్బియాకు చెందిన జకోవిచ్, 5వ సీడ్ ఆస్ట్రియాకు చెందిన డామినిక్ థీమ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లోనే పరాజయం పాలయ్యారు. క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ నెంబర్ వన్ నాదల్(స్పెయిన్), 5వ సీడ్ క్రొయేషియాకు చెందిన సిలిక్‌తో తలపడనున్నాడు. మరో క్వార్టర్‌ఫైనల్లో 2వ సీడ్ ఫెదరర్(స్విట్జర్లాండ్) 19వ సీడ్ బెర్డిచ్(చెక్ రిపబ్లిక్)తో తలపడనున్నాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్స్

పురుషుల సింగిల్స్...	మహిళల సింగిల్స్...
డిమిట్రోవ్(3) × ఎడ్మండ్	హెలెప్(1) × ప్లిస్కోవా(6)
నాదల్(1) × సిలిక్(6)	స్విటోలినా(4) × మెర్టెన్స్
ఫెదరర్(2) × బెర్డిచ్(19)	వాజ్నొలంకీ(2) × స్వర్వేజ్ నవ్రో
శాండ్‌గ్రెన్ × ఛంగ్	కెర్బర్(21) × ఎం.కెయాస్(17)

ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ విజేత, సోమవారం జరిగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో 14వ సీడ్ జకోవిచ్ అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు. అతడు దక్షిణ కొరియాకు చెందిన చెంగ్ హుయాన్ చేతిలో 7-6(7-4), 7-5, 7-6(7-3) ఓటమిపాలయ్యాడు. జకోవిచ్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌లో కొంత ఇబ్బందులకు గురయ్యాడు. హుయాన్ క్వార్టర్‌ఫైనల్లో అమెరికాకు చెందిన మరో క్వాలిఫయర్ శాండ్‌గ్రెన్‌తో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో 5వ సీడ్ డొమెనిక్ థీమ్(ఆస్ట్రియా) అమెరికాకు చెందిన క్వాలిఫయర్ శాండ్‌గ్రెన్ చేతిలో 6-2, 4-6, 7-6(7-4), 6-7(7-9), 6-3 హోరాహోరీ పోరులో ఓడిపోయాడు.

మహిళల విభాగంలో నెంబర్ వన్ సీడ్ హెలెప్(రొమేనియా) 6-3, 6-2 సెట్ల తేడాతో జపాన్‌కు చెందిన నౌమీ ఒసాంకాను ఓడించి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. 8వ సీడ్ కరోలినా గార్సియా(జపాన్) 3-6, 2-6 సెట్ల తేడాతో అమెరికాకు చెందిన 17వ సీడ్ మడిసాన్ కయాస్ చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది. పురుషుల డబుల్స్ విభాగంలో బొప్పన్న జోడీ 4-6, 7-6(7-5), 3-6 సెట్ల తేడాతో 7వ సీడ్ చేతిలో ఓటమిపాలయ్యారు. డి.షరన్-రామ్‌ల జోడీ కూడా 6-3, 6-7(4-7), 4-6తో ఓటమిపాలయ్యారు. దీంతో భారత్ తరఫున ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొన్న క్రీడాకారులందరూ ప్రీక్వార్టర్‌ఫైనల్లోనే నిష్క్రమించారు. భారత్ తరఫున మిక్సిడ్ డబుల్స్ బొప్పన్న జోడీ మంగళవారం క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఆడనుంది.

రైనా విధ్వంసం

- సయ్యద్ ముస్తాక్ అలీ టీ20



కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ దేశవాళీ టీ20లో భాగంగా బెంగాల్‌పై రైనా విరుచుకుపడ్డాడు. సోమవారం ఉత్తరప్రదేశ్ సారథి రైనా కేవలం 59 బంతుల్లోనే అజేయంగా 127 పరుగులతో రాణించాడు. అతని ఇన్నింగ్స్‌లో 13 బౌండరీలు, 7 సిక్సర్లు ఉన్నాయి. దీంతో ఆ జట్టు బెంగాల్‌పై యుపి జట్టు 75 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రైనా శతకంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తరప్రదేశ్ 3 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. రైనాతోపాటు ఆకాశ్‌నాథ్ కూడా 80 పరుగులతో రాణించాడు. లక్ష్యఛేదనకు దిగిన బెంగాల్ 16.1 ఓవర్లకు 160 పరుగులకే కుప్పకూలింది. శ్రీవత్స్ గోస్వామి (57), సుదీప్ ఛటర్జీ (36) మినహా మరెవ్వరూ రాణించలేదు. మ్యాచ్ జరుగుతున్నప్పుడు అక్కడు ఉన్న గంగూలీ రైనా బ్యాటింగ్‌ను ప్రశంసించాడు.

కెనడా, జింబాబ్వే విజయం

లింకోలన్ (న్యూజిలాండ్) : గ్రూప్ స్టేజ్‌లలో భాగంగా (ప్లేట్ క్వార్టర్‌ఫైనల్-1) జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో కెనడా, జింబాబ్వే విజయాలను నమోదు చేసుకున్నాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌లో కెనడా జట్టు పప్పున్యూగేనియాపై 80 పరుగుల తేడాతో విజయం సాధించింది. కెనడా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేస్తే... అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పప్పున్యూగేనియా జట్టు 44.5 ఓవర్లలో 185 పరుగులే చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఆకాష్ గిల్‌కు లభించింది.

ఓవల్ లింకోలన్ మైదానంలో జరిగిన (ప్లేట్ క్వార్టర్‌ఫైనల్-2) మరో మ్యాచ్‌లో జింబాబ్వే జట్టు 7 వికెట్ల తేడాతో నమీబియాను ఓడించింది. నమీబియా 113 పరుగులు చేయగా... ఆ లక్ష్యాన్ని జింబాబ్వే 19.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జింబాబ్వే బౌలర్ వెస్లీ మాధవేరాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

నేటి మ్యాచ్‌లు... ఇంగ్లండ్ × ఆస్ట్రేలియా (క్వీన్స్‌టౌన్)
శ్రీలంక × కెన్యా (లింకోలన్) వెస్టిండీస్ × ఐర్లాండ్



దక్షిణాఫ్రికా బయలుదేరేముందు క్రికెట్ లెజెండ్, భారతరత్న సచిన్ తెండూల్కర్‌తో భారత మహిళా జట్టు, ఈ పర్యటనలో మూడు వన్డేలు, ఐదు టి20ల్లో తలపడనుంది.

కివీస్ విజయం

న్యూజిలాండ్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన తొలి టి20లో కివీస్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ఏప్రిల్ 7న ఐపిఎల్ తొలి మ్యాచ్

- ముంబాయిలో 6న ప్రారంభ వేడుకలు



ముంబాయి : ఏప్రిల్ 7 నుండి మే 27వ తేదీ వరకు ఇండియన్ ప్రిమియర్ లీగ్ (ఐపిఎల్) 11వ ఎడిషన్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. వెయ్యిమందికి పైగా క్రీడాకారులను రీటెన్షన్ ద్వారా ఫిల్టర్ చేసి 578 క్రీడాకారులకు కుదించింది. క్రీడాకారుల వేలం జనవరి 27, 28 తేదీలలో ముంబాయిలో జరగనుంది. ఏప్రిల్ 6న ముంబాయిలోని వాంఖడే స్టేడియంలో ప్రారంభ వేడుకలు జరగనున్నాయని... 7వ తేదీనుండి ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతాయన్నాయి. స్టార్ స్పోర్ట్స్ అభ్యర్ధన మేరకు రాత్రి 8 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌లను 7 గంటలకు... సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌లను 4.00 గంటలకు సమయాలను మార్పులు చేసినట్లు ఐపిఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా సమావేశానంతరం తెలియజేశారు. ఈ సమావేశానికి ఐపిఎల్ గవర్నింగ్ కమిటీ సభ్యుడు సౌరవ్‌గంగూలీ హాజరుకాలేదు. ఈ సందర్భంగానే కింగ్స్ ఎలెవన్ పంజాబ్ పాల్గొనే నాలుగు మ్యాచ్‌లలో మూడు మ్యాచ్‌లు మొహాలీలో... మూడు మ్యాచ్‌లు ఇండోర్‌లో జరుగుతాయని తెలియజేశారు.

హైదరాబాద్‌లో ఖాకీల రాసలీలలు

కేసు నమోదు చేసిన మాదాపూర్ డిసిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన భార్యతో కల్వకుర్తి సీఐ మల్లికార్జున రెడ్డి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అవినీతి నిరోధక శాఖ అడిషనల్ ఎస్పీ సునితారెడ్డి భర్త సురేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఇద్దరు పోలీస్ అధికారుల మధ్య వివాహేతర సంబంధం బట్టబయలైంది. ఏఎస్పీ, సీఐల రాసలీలల వ్యవహారం ఉన్నతాధికారులకు ఆగ్రహాన్ని తెప్పించింది. సీఐ మల్లికార్జున్ రెడ్డిపై ఐపిసి 447, 497, 506 వివిధ సెక్షన్ల కింద కేసునమోదు చేసినట్టు మాదాపూర్ డిసిపి విశ్వప్రసాద్ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీకి నివేదిక అందజేస్తామన్నారు.

ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా: సురేందర్‌రెడ్డి

ఖాకీల వ్యవహారం నగరంలో సంచలనం రేపింది. వీరిద్దరి మధ్యా గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోందని ఆమె భర్త సురేందర్‌రెడ్డి ఆరోపించారు. విషయం తెలుసుకున్నాక ఆత్మహత్య చేసుకోవాలని ముందుగా అనుకున్నానని, వీరి వ్యవహారాన్ని బయటపెట్టాలనే ఉద్దేశంతోనే ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నానని ఆయన మీడియాకు చెప్పారు. వీరిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల్ని కోరానని తెలిపారు.

రాజ్యాంగానికి విరుద్ధంగా రాష్ట్రపతి తీరు

- ఆప్ ఎమ్మెల్యేలపై వేటును ఖండిస్తున్నాం సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాల్సిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఢిల్లీలో ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రపతి కొంగజపం చేస్తున్నారని విమర్శించారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలోనే కేంద్రం ఇటువంటి చర్యకు పాల్పడిందని విమర్శించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో ఆప్ ఎమ్మెల్యేల వ్యవహారం కోర్టులో ఉండగా నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. మరో రెండు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఎన్నికల కమిషనర్ జోతి ఈ అంశంపై రాష్ట్రపతికి సిఫార్సు చేయడం, వెను వెంటనే రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడం వెనుక ప్రధాని మోడీ హస్తం ఉందన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. దేశ న్యాయ వ్యవస్థలో అనూహ్యమైన సంక్షోభం వచ్చిందన్నారు. రూ.వేల కోట్ల మెడికల్ కుంభకోణానికి కారణమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, విచారణకు వచ్చిన కేసును తన ధర్మాసనానికి బదలాయించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నుంచి వచ్చిన ఒత్తిళ్లను తట్టుకోలేక అరుణాచల్‌ప్రదేశ్ సిఎం ఆత్మహత్యకు పాల్పడగా సిబిఐ కోర్టు న్యాయమూర్తి లోయా అనుమానాస్పద స్థితిలో మృతి చెందారన్నారు. సుప్రీం కోర్టు వివాదాన్ని రాజీ చేసేందుకు పిఎంఒ వర్గాలు ప్రయత్నిస్తున్నారన్నారు. న్యాయమూర్తులు లేవనెత్తిన ఐదు కేసుల్ని పారదర్శకంగా పరిష్కరించాలని, లేని పక్షంలో న్యాయవ్యవస్థకు కళంకమేర్పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగకపోతే సుప్రీం కోర్టుకు వెళతానన్న చంద్రబాబు వ్యాఖ్యల్ని నారాయణ తప్పుబట్టారు. ప్రస్తుత పరిస్థితికి టిడిపి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. గవర్నర్ నర్సింహన్ ఒక బఫూన్‌లా మారారన్నారు. 26న జరిగే గణతంత్ర వేడుకలకు ఆహ్వానం పంపారని, ఆయన తీరుకు నిరసనగా కార్యక్రమానికి తాను వెళ్లడంలేదన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాజధానిలో ఏడు ప్రైవేటు మెడికల్ కళాశాలల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారన్నారు. ప్రభుత్వంపై 63 శాతం సంతృప్తి ఉందంటూ ప్రజల్ని మభ్యపెడుతున్నారన్నారు. మార్చి 7 నుంచి 9 వరకు సిపిఐ రాష్ట్రమహాసభలు కడపలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు జెల్లి విల్సన్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో రెండుపూటల పనిని ప్రవేశపెట్టొద్దు

- పాత పద్ధతినే కొనసాగించి కనీస వేతనమివ్వాలి
- వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధిహామి పథకంలో రెండుపూటల పనివిధానాన్ని ప్రవేశపెట్టొద్దని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్రప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పద్ధతిలో కొనసాగిస్తూ కనీస వేతనమివ్వాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రారంభం నుంచీ వ్యవసాయ కార్మికులకు రోజువారీ కూలి కాకుండా క్యూబిక్ మీటర్ల కొలతల ప్రకారం వేతనాలిస్తున్నారని, ఎంత పనిచేసుకుంటే అంత వేతనం వస్తుందని పేర్కొన్నారు. ఈ పథకంలో కూలీలకు రోజుకు రూ.197ల వేతనం నిర్ణయించినా సగటున రూ.130లు మించి రావడం లేదన్నారు. కేరళ, కర్ణాటక, హర్యాణా రాష్ట్రాల్లో రూ.250 నుంచి 300 వరకు కూలి వస్తోందని తెలిపారు. అతి తక్కువ వేతనాలిస్తున్న రాష్ట్రాల్లో ఎపి ముందుభాగంలో ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టం ఉందని, ప్రభుత్వం దీన్ని అమలు చేయడం లేదని తెలిపారు. దీంతో ఈ పథకం లక్ష్యం పూర్తిగా నీరుగారిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీలకు పనులు కల్పించకుండా యంత్రాలకు, కాంట్రాక్టర్లకు కట్టబెడుతున్నారని తెలిపారు. చేసిన పనికి నెలల తరబడి బిల్లులు రాక పేదలు ఈ పథకం పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం రెండు పూటల పని విధానాన్ని ప్రవేశ పెట్టి, పేదల్ని ఈ పథకం నుంచి మరింత దూరం చేయాలనుకుంటోందని, ఈ నిధులన్నింటినీ ఇతర పథకాలకు మళ్ళించే ప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆలోచనను విరమించుకొని కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కోడిపందేల్ని ఎందుకు అడ్డుకోలేదు

- సర్కార్‌ను నిలదీసిన హైకోర్టు
- 29న విచారణకు సిఎస్, డిజిపిలు స్వయంగా హాజరుకావాలని ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోడిపందేల్ని నిర్వహించకుండా అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటారని హామీ ఇచ్చినా ఎందుకు అడ్డుకోలేకపోయిందని ఏపీ సర్కార్‌ను హైకోర్టు నిలదీసింది. కోర్టుకు హామీ ఇవ్వడమే కాకుండా కోడిపందేల్ని నిర్వహించడానికి వీల్లేదని తాము ఉత్తర్వులిచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని ప్రశ్నించింది. కోడిపందేలపై కౌంటర్ పిటిషన్ వేయాలని ఈ నెల 4న ఆదేశాలిస్తే తీరా కేసు విచారణకు వచ్చినప్పుడు తమకు సమయం కావాలని సీఎస్, డిజిపి తరఫు లాయర్లు కోరడాన్ని సోమవారం హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. కోడిపందేలు జరగబో వని చెప్పిన తర్వాత కూడా యథాప్రకారం జరిగాయని, కోడిపందేలు జరిగినట్లుగా టీవీలో చూశామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ చెప్పింది. భీమవరం మండలం వెంప, రామపురం గ్రామాల్లో కోడిపందేలతోపాటు వ్యభిచారం, జూదం ఆడుతున్నారని, ఇవి జగకుండా ఉత్తర్వులివ్వాలని కోరుతూ కలిదిండి రామచందర్ రాజు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. సోమవారం పిటిషనర్ లాయర్ వాదిస్తూ.. వెంప, రాంపురం గ్రామాల్లో మాత్రమే హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కోడిపందేలు జరగలేదని, మిగిలిన ప్రాంతాల్లో కూడా జరిగాయని చెప్పారు. కోడిపందేలపై వాస్తవ నివేదిక ఇవ్వాలని ఈ నెల 4న ఆదేశాలు జారీ చేస్తే ఇప్పుడు సీఎస్,డిజిపి తరఫున రెవెన్యూ,హెూం శాఖల లాయర్లు వచ్చి తమకు సమాచారం అందింది కానీ, కౌంటర్ వేయడానికి వ్యవధి కావాలనడం ఎంతవరకు సబబని బెంచ్ వారిని ప్రశ్నించింది. ఈ నెల 29న జరిగే విచారణకు సీఎస్, డిజిపి స్వయంగా కోర్టుకు రావాలని బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్ని రద్దు చేయాలని ప్రభుత్వ లాయర్లు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ బెంచ్ అంగీకరించలేదు. కోర్టులంటే లెక్కలేకుండా పోయిందని, 4న కౌంటర్ వేయాలంటే ఇంతవరకు మౌనంగా ఉండి ఇప్పుడు సమయం కావాలనడంలో ఔచిత్యమేమిటని బెంచ్ ప్రశ్నించింది. రెండేళ్ల క్రితం కోడిపందేలపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని అమలు చేయకపోవడమే కాకుండా తాజాగా హైకోర్టుకు సీఎస్, డిజిపి హామీ ఇచ్చి కూడా అమలు చేయడంలో విఫలం చెందడానికి కారణాలేమిటని బెంచ్ నిలదీసింది. విచారణ 29కి వాయిదా పడింది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68